SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:56, Issue: 09
February - 2026, Price Rs.20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

ఫిబ్రవరి 2026
వెల రూ. 20/-
పుటలు - 56




చేరి కొలువరో ఈతడు శ్రీదేవుడు!
- అన్నమయ్య



## శ్రీనివాసమంగాపురం
# శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం

**2026, ఫిబ్రవరి 07 నుండి 16 వరకు**

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 07-02-2026 | శని | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 08-02-2026 | ఆది | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేష వాహనం |
| 09-02-2026 | సోమ | చిన్నశేష వాహనం | హంస వాహనం |
| 10-02-2026 | మంగళ | సింహ వాహనం | ముత్యపుపందిరి వాహనం |
| 11-02-2026 | బుధ | కల్పవృక్ష వాహనం | సర్వభూపాల వాహనం |
| 12-02-2026 | గురు | పల్లకీలో మోహినీఅవతారోత్సవం | గరుడ వాహనం |
| 13-02-2026 | శుక్ర | హనుమద్వాహనం | సా॥వసంతోత్సవం, గజ వాహనం |
| 14-02-2026 | శని | సూర్యప్రభ వాహనం | చంద్రప్రభ వాహనం |
| 15-02-2026 | ఆది | రథోత్సవం | అశ్వ వాహనం |
| 16-02-2026 | సోమ | పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం, తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |

**జగత్కల్యాణదంపతులైన శ్రీపద్మావతీశ్రీనివాసులు నేటికీ నిత్యనూతన వధూవరులై దర్శనమిస్తున్న నిత్యకల్యాణపురం శ్రీనివాసమంగాపురం!**

- తిరుపతి నగరానికి పశ్చిమంగా పది మైళ్ల దూరంలో ఉన్న క్షేత్రం శ్రీనివాస మంగాపురం.
- ఈ క్షేత్రానికి ఉత్తరాన పరమపావన శేషాచలశిఖరాలు, నైరుతిలో చంద్రగిరి దుర్గం కనువిందు చేస్తుంటాయి. పచ్చటి ప్రకృతి పరిసరాల నడుమ ఉన్న ఈ ఆలయం - పౌరాణిక, చారిత్రక, సాంస్కృతిక సన్నివేశాలకు చిరునామా!
- పద్మావతీశ్రీనివాసుల పరిణయం తరువాత కొంతకాలం ఇక్కడే నివసించారు.
- ఇక్కడ అర్చామూర్తి "కల్యాణ వేంకటేశ్వరుడు".
- తాళ్లపాక అన్నమయ్య మనమడు చిన్నన్న (చినతిరు వెంగళనాథుడు) శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరాలయాన్ని జీర్ణోద్ధరణ చేశాడు.
- 26-04-1967న ఈ ఆలయాన్ని తి.తి.దే. అనుబంధ ఆలయంగా స్వీకరించింది.
- 1981 సం॥ నుండి ఇక్కడ అంగరంగవైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.
- ఇక్కడ కల్యాణోత్సవం తర్వాత ఇచ్చే శ్రీవారి కల్యాణకంకణాలను అవివాహితులు ధరిస్తే వాళ్లకు ఆలస్యం కాకుండా త్వరగా పెళ్లవుతుందని భక్తుల విశ్వాసం!



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** హతో వా ప్రాప్స్యసే స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్ ।
తస్మాదుత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః ॥
(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-37వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** కౌన్తేయ= ఓ అర్జునా!; హతో వా= (నీవు) చంపబడినవాడవైతివేని; స్వర్గమ్= స్వర్గాన్ని; ప్రాప్స్యసే= పొందగలవు; జిత్వావా= జయించితివేని; మహీమ్= రాజ్యాన్ని; భోక్ష్యసే= అనుభవింపగలవు; తస్మాత్= అందువల్ల; యుద్ధాయ= యుద్ధంకోసం; కృతనిశ్చయః= చేయబడ్డ నిశ్చయం కలవాడవై; ఉత్తిష్ఠ= లెమ్ము.

**భావం:** అర్జునా! ఒకవేళ నీవీ ధర్మయుద్ధంలో శత్రువులచే చంపబడినచో స్వర్గాన్ని పొందగలవు. అలాకాక నీవే జయిస్తే భూలోకరాజ్యాన్ని అనుభవిస్తావు. ఈ ప్రకారంగా రెండు విధాల మేలే. కాబట్టి లెమ్ము! యుద్ధానికి సంసిద్ధుడవు కమ్ము!

---

## శరణాగతి కంటే ఏదీ గొప్పది కాదు

నిర్మలులు వీరు నిత్యసుఖులు
కర్మదూరులు విష్ణుకైంకర్యపరులు

పరమజ్ఞానసంపన్నులగువారికిని
అరుదుగా దిచటి మహదైశ్వర్యము
హరికృపాధనము చేనబ్బిన మహాత్ములకు
సరకుగాకుండు పంచల నిధానములు

బలిమిని వేదాంతపట్టభద్రులకు నిల
బలురాజ్యపదవు లిరుగడ బంట్లు
లలిమీరి హరిచక్రలాంఛనపుశూరులకు
యెలమి విజయములెల్ల నింటిలో నుండు

యీవలను శ్రీవేంకటేశు శరణాగతుల-
కావటించిన పుణ్య మడువుగాదు
దైవజ్ఞులయిన యా ధర్మస్వరూపులకు
వేవేలుభోగములు వెనుతగులుచుండు

సంపుటం 02 - సంకీర్తన - 114





విష్ణుసేవాపరులైన వారు నిర్మలులు, నిత్యం సుఖపడేవారు, కర్మదూరులు. శ్రీవేంకటేశుని సన్నిధిలో పరమజ్ఞాన సంపన్నులైనవారికి ఇహలోకపు మహైశ్వర్యం దుర్లభం కాదు. శ్రీహరి దయ అనే సంపద చేతికి చిక్కిన మహాత్ములు ఇంటిలోని నిధానమును లెక్కచేయరు. వేదాంతవిద్యలో పట్టభద్రులైన వారికి పెక్కు రాజ్య పదవులు లభించినా వాటిని తమకు ఇరువైపుల గల బంట్లు వలే భావిస్తారు. అనురక్తితో శ్రీహరి చక్రపు గుర్తులను ధరించిన శూరులకు జీవితంలో అన్ని విషయాలలో విజయాలు హస్తగతాలై ఉంటాయి.

శ్రీ వేంకటేశ్వరుని శరణు పొందినవారికి ఐశ్వర్యం, రాజ్యం, విజయం మొదలైనవి అప్రయత్నంగానే సిద్ధిస్తాయి. వాటికోసం వారు ఏ పుణ్యం చేసినా అది శరణాగతి కంటే గొప్పది కాదు. దైవతత్త్వాన్ని యథార్థంగా తెలిసిన ఆ ధర్మాత్ములను వేలకొలది భోగాలు వెంటపడి తమను అనుభవించమంటాయి అని విష్ణు కైంకర్యపరులకు వేవేలభోగాలు అప్రయత్నంగా సమకూరుతాయని అన్నమయ్య తెలియజేశాడు.

# శివుడు పార్వతికి చెప్పిన విషయాలు మనమూ తెలుసుకుందాం!



(01) సూర్యుడు మకరరాశిలో ఉన్నప్పుడు మాఘమాసంలో ప్రాతః కాలస్నానం చేయడం ముక్తిమార్గం.

(02) మాఘమాసంలో గంగాస్నానం చేసిన వారికి పునర్జన్మ ఉండదు.

(03) తెలసికాని, తెలీక కాని, బలవంతంగా గాని మాఘ మాసంలో ఒకసారైనా సూర్యోదయానికి ముందు స్నానం చేస్తే పాపాలు నశిస్తాయి.

(04) భక్తిభావంతో మాఘమాసమంతా స్నానం చేస్తే విష్ణు లోకం ప్రాప్తిస్తుంది.

(05) మాఘమాసంలో చలికి భయపడి స్నానం చేయని వాళ్లను చూడకూడదు.

(06) చిన్నపిల్లలు, అశక్తులైన వృద్ధులు హరినామస్మరణ చేస్తూ మూడుసార్లు నీటిబిందువులను శరీరంపై చిలకరించు కున్నా పుణ్యమే!

(07) అశక్తుడు తాను మాఘస్నానం చేయలేకపోతే స్నానం చేసినవారికి దక్షిణ ఇచ్చి వారి నుండి స్నానఫలం పొంద వచ్చు.

(08) మాఘస్నానం చేసిన వారికి సంసారభయం లేదు.

(09) మాఘస్నానం చేసి చలికి ఆగలేనివారు శ్రీహరిని స్మరిస్తూ మంట దగ్గర చలి కాగవచ్చు. చలి కాగినవారు స్నానం చేసిన తర్వాత శ్రీహరిని దర్శించి ఆ తర్వాత అగ్ని దేవునికి, సూర్యభగవానునికి నమస్కరించి నైవేద్యం సమర్పించాలి.

(10) ఈ మాసంలో లేనివారికి వస్త్రాలు గానీ, కంబళి గానీ దానం చేస్తే స్నానఫలం లభిస్తుంది.

(11) ఈ స్నానం అన్ని వర్ణాలవారు చేయవచ్చు.

(12) మాఘస్నానం చేసే వారిని నిందించినా, పరిహసించినా, నివారించినా మహాపాపాలు కలుగుతాయి.

(13) మాఘస్నానం సద్యోముక్తిప్రదం. దానికి సాటిలేదు. ఈ మాసం శివకేశవప్రీతికరమైంది. ఈ నెలలో చేసిన పుణ్య కార్యాలు, ఇతర రోజులలో చేసిన పుణ్యకార్యాలకంటే ఎక్కువ పుణ్యాన్నిస్తాయి.

(14) మాఘమాసంలో ప్రాతఃకాలంలో చేసిన స్నానం అన్ని పాపాల్ని పోగొట్టి అక్షయాలైన పుణ్యఫలాల నిస్తుంది.

(15) మాఘమాసంలో స్నానం చేసే శక్తి, వసతి ఉన్నా, కేవలం చలిగా ఉందని స్నానం చేయనివారు తమకు లభించబోవు పుణ్యఫలాన్ని కాలితో తన్నుకున్నట్లే అవుతుంది.

(16) మాఘస్నానం చేసిన తర్వాత తడివస్త్రం నాలుగు అంచులను చేర్చి నీటిని పిండుతూ పితృదేవతల్ని స్మరించాలి. ఇలా చేయడం పితృదేవతలకు ప్రీతిని కలిగిస్తుంది.

(17) మాఘస్నానం ఆయువును, ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని ఇస్తుంది.

(18) మాఘమాసంలో నదీస్నానం ముఖ్యమైంది. మాఘ స్నానాలు చేయలేక, తీర్థాలు సేవిస్తే చాలునని అనుకోవడం అవివేకం.

(19) మాఘమాసంలో ఏ నది నీరైనా గంగాజలంతో సమానం. అందుచేత మాఘమాసంలో నదీస్నానం సర్వపాపహరం!



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥


గౌరవ సంపాదకులు
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-సంపాదకులు,
ప్రధాన సంపాదకులు (ఎఫ్.ఏ.సి.)
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకులు
'కళారత్న' డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., తెలుగు & ఇంగ్లీషు, ఎం.ఫిల్., పిహెచ్.డి.,

ముద్రాపకులు
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఎడ్.,
ఉపకార్యనిర్వహణాధికారి, (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
ప్రధానసంపాదకులు-0877-2264363
కార్యాలయం -0877 -2264543
0877 -2264359



విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-



వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
editorsapthagiri@gmail.com;
ద్వారా తెలియజేయవచ్చు.


24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333


తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 56 ఫిబ్రవరి, 2026 సంచిక : 09


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| పరమశివుని మహోత్సవం | ఆచార్య వేదాంతం శ్రీ విష్ణుభట్టాచార్య | 07 |
| ఎప్పుడనుకుంటే అప్పుడే చేయాలి | 'కళారత్న' డా॥కంపల్లె రవిచంద్రన్ | 09 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమ రావు | 11 |
| భయంలేకుండా ఉండడమే సుఖం! | డా॥ ముంజులూరి నరసింహారావు | 13 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు | 16 |
| | కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | |
| సందేహాలు-సమాధానాలు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 17 |
| వేంకటాచలానికి నమస్కరించండి! | డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు | 18 |
| ఒడిలో బరువుంటే కదా.. దారిలో భయముండేది! | ఆచార్య కె.రాజగోపాలన్ | 22 |
| తిరుక్కోళూరు (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| శివతాండవం | డా॥నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి | 26 |
| 'భస్మం' ధరిస్తే బతుకు బంగారమే! | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుశర్మ | 31 |
| ధర్మపరులకు ఈయన అండ ఎప్పుడూ ఉంటుంది! | డా॥ జి.ఆంజనేయులు | 35 |
| గురుబలం పెరగాలంటే... | శ్రీ తల్లంరాజు శేషగిరిరావు | 37 |
| ప్రయత్నంలో నిజాయితీ ఉంటే... | శ్రీ వి.నరేష్ కుమార్ | 41 |
| పిల్లలు లేరని దిగులు పడుతున్నారా..? | బ్రహ్మశ్రీ తాడంకి వెంకట లక్ష్మీనరసింహారావు | 42 |
| మహాభాగ్యవంతుడు | శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | 43 |
| జగానికి నిండుదనం | శ్రీ కందుకూరి వేంకటసత్యబ్రహ్మాచార్య | 45 |
| అర్థం చేసుకునే మనసుండాలి! | డా॥ నల్లాని రాజేశ్వరి | 46 |
| తల్లిప్రేమ ముందు తలవంచాల్సిందే కదా! (చిత్రకథ) | కథ: 'కళారత్న' డా॥కంపల్లె రవిచంద్రన్ | 48 |
| | చిత్రాలు: శ్రీ తుంబలి శివాజీ | |
| అప్పు చేయరాదు (వేమన శతకం) | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 50 |
| క్విజ్ | | 51 |
| బాలవినోదం | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| శ్రీపదకేళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : ఉభయదేవేరీ సమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి, శ్రీనివాసమంగాపురం
వెనుకచిత్రం: పరమభాగవతోత్తముడు శ్రీకులశేఖరాళ్వార్



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# జీవితానికి అవసరం!

భగవంతుడు ఒక్కడే... అనే దృఢమైన భావం మన భారతీయ సనాతన హైందవధర్మంలో అనాదిగా ఉంది. ఒకే బంగారం వివిధ ఆభరణాలైనట్లు ఆ ఏకదైవమే వివిధ దేవతలుగా పూజలందుకుంటోందన్న స్పష్టమైన సమన్వయం మన సనాతనధర్మంలో ఉంది. ఎన్ని ఆభరణాలు చూచినా 'అవి బంగారపు రూపాలే!' అనే స్పృహ ఎలా ఉంటుందో - వివిధ నామరూపాలు ఒకే పరమాత్ముని అభివ్యక్తులనే చింతన హైందవులకు కూడా అలాగే ఉంది. అయితే లోకోభిన్నరుచి. ఉపాసనా సామర్థ్యమున్నవారు మహామంత్రాలతో, తంత్రాలతో సాధనల్లో మునిగితే, నిర్గుణతత్త్వంగా గ్రహించగలిగే యోగులు అంతరంగంలోనే ఆవిష్కరించుకుంటారు. పండితులు మహాశబ్దాలతో శ్లాఘిస్తే, సామాన్యులు మామూలు మాటలతో, పదాలతో పలుకరిస్తారు. అందరికీ బదులు పలికే భగవంతుడు అందరి కోసం అనేకమయ్యాడు. ఇది మన సనాతనధర్మపు మౌలికస్వరూపం.

హిమవంతం నుండి సేతువు వరకు జ్యోతిర్లింగాలుగా పూజలందుకునే సదాశివుడు వేదవేత్తల రుద్రాభిషేకాలకే కాదు, అతి సామాన్యులు అందించే నీటిధారలకీ పరవశిస్తున్నాడు. వాళ్ల 'భంభం...భోలే', 'హరహర మహదేవ' రావాలతో మురిసిపోతున్నాడు. సాలీడు- పాము- ఏనుగులకు ముక్తినిచ్చి, అమాయక కన్నప్పను అనుగ్రహించిన శ్రీకాళహస్తీశ్వరుడు, నందనారుకు ముక్తినిచ్చిన చిదంబరేశుడు, ప్రేమకు పేదరికంలేని భక్తిసంపన్నులకు కైవల్యపట్టం కట్టాడు. పండితులను మొదలుకుని పామరులవరకు, యోగులను మొదలుకుని శ్రమజీవులవరకు, వేదవేత్తలను మొదలుకుని పేద జానపదులవరకు.... అన్ని రకాల మనః స్థాయిలవారికీ, విభిన్న అభిరుచుల వారికీ తగినట్లుగా ఎన్నోవిధాల ధర్మరీతులను మలచి వేలకొమ్మలతో విస్తరిల్లిన ఏక మహావృక్షంగా నిలిచిన హిందూచైతన్యం- ఈ వైవిధ్యలక్షణం చేతనే ప్రజల మన్నన లందుకుంటోంది. దివి అంతటి ఉన్నతితోపాటు, భువికి చేరిన అందుబాటుతనం కూడా మన సంస్కృతిలో మన దేవుడు చూపిస్తాడు. ఇతర లోకాలలోనే కాదు- ప్రతి అణువులోనూ మన భగవంతుడు వ్యాపించి ఉన్నాడని దర్శిస్తారు మనవాళ్లు. పరమాత్ముడై కేవలం అందనంతస్థాయిలో ఉండడమే కాదు, అవతారపురుషుడై మనతో ఆడుకుంటాడు, మనల్ని ఆదుకుంటాడు. బెజ్జ మహాదేవి, తిన్నడి కథలు మనకు తెలిసినవే, పరమేశ్వరుడి భక్తప్రియత్వం కూడా తెలిసిందే!

శివారాధన భక్తికి, ఆత్మశుద్ధికి, లోకక్షేమానికి ఒక శాశ్వతమార్గం. శివారాధనలో భక్తి, జ్ఞానం, వైరాగ్యం, సేవాభావం కలగలిసి ఉంటాయి. శివార్చనలో ఉపయోగించే బిల్వదళాలు, గంగాజలం, పాలు, తేనె, ధూపం, దీపం వంటివి సమర్పించడం ఆరాధకుని మనస్సులో పవిత్రతను నింపుతాయి. మాఘమాసంలో, ముఖ్యంగా మహాశివరాత్రి సందర్భంలో జాగరణ చేసి, లింగాభిషేకం చేయడం మహాపుణ్యప్రదం. శివుడు సమన్వయానికి ప్రతీక. ఆయనలో సౌమ్యం, రౌద్రం, కరుణ, న్యాయం అన్నీ సమాహారంగా ఉంటాయి. శివుడు సమస్త భూతజాతిని సమానంగా చూస్తాడు. శివుడిని స్మరించడం అంటే అనంతత్త్వాన్ని స్మరించడం. శివుడు అనుగ్రహిస్తే జన్మబంధనం తెగిపోతుంది. భక్తి, క్షమ, దయ, ధర్మం, త్యాగం వంటి విలువలు శివారాధన ద్వారా మన హృదయంలో శాశ్వతంగా నిలుస్తాయి. శివుని గుణాలను మన జీవితంలో అవలంభిస్తే భౌతికవిజయాలకే కాకుండా ఆధ్యాత్మికశిఖరాలకు కూడా చేరుకోవచ్చు. శివసేవతోనే లోకహితం, ఆత్మహితం సాధ్యమౌతాయి. శివారాధన భక్తికి పరాకాష్ఠ, జీవితానికి పరమావసరం.



# పరమశివుని మహోత్సవం

- ఆచార్య వేదాంతం శ్రీవిష్ణుభట్టాచార్య, 94907 41414

సృష్టిస్థితిలయకారకులలో లయకర్త పరమశివుడు. ఆ పరమశివునికి ప్రీతికరాలలో మహాశివరాత్రి ముఖ్యమైంది. ఆ రోజు పూర్వాపరాలలో మహోత్సవం జరపటం వేంకటాచల క్షేత్రమూలంలో ఉన్న కపిలతీర్థ కపిలేశునికి సంప్రదాయం. దీన్ని అజితాగమగ్రంథ ఆధారంగా పరిశీలిద్దాం!

సవః కల్యాణమిత్యుక్తం
సర్వజన్తు సుఖావహమ్
ఉద్భూతస్తు సవోయస్మాత్
తస్మాదుత్సవ ఉచ్యతే (27-1)

అని మహోత్సవ పద నిర్వచనం. ఈ ఉత్సవంలో త్రిశూలస్నానమనే కార్యక్రమాన్ని ప్రధానంగా చేసికొని ఉత్సవ దిన సంఖ్య నిర్ణయింపబడుతుంది. ఇది ఆరు రకాలు (కారణాగమం 141-3, 4). అందు పన్నెండు దినాల ఉత్సవం పైతృకం, తొమ్మిది దినాలు సౌఖ్యం, ఏడుదినాలు శ్రీకరం, ఐదుదినాలు పార్థివం, మూడుదినాలు సాత్వికం, ఒక దినం శైవం అని తెలుసుకోవాలి.

శివరాత్రిరితిఖ్యాతా సారాత్రి శ్శంకరప్రియా(118-25)

- అని చెప్పబడినట్లు శంకరప్రియమైన ఈ రాత్రి దినానికి ఈ మహోత్సవ సంబంధమైనట్లయితే విశేష పుణ్యప్రదం.

ఈ మహోత్సవంలో అంకురార్పణ విధిగా ఆచరించాలి. ధ్వజవస్త్రంలో సంహితోక్తంగా వృషభుని లిఖించి, ఆహ్వానించి, అధివాసం ఉత్సవం చేయాలి. ధ్వజదండ స్థాపన పూర్వక ధ్వజారోహణ గావించాలి. ఆ ధ్వజదండం-

శిఖరావధికంతువా
నాసికావధికం చాపి
గోపురావధికంతువా
ప్రస్తరాంతం గళాంతంవా
ధ్వజదండం ప్రకల్పయేత్ (27-56)

అని ధ్వజం యొక్క ప్రమాణవిధి వివరింపబడింది. ధ్వజారోహణం సుముహూర్త సులగ్నంలో గీతనృత్త సమన్వితంగా కావించాలి. తరువాత శాస్త్రోక్తంగా భరతుడు నాంది కార్యక్రమాలు ఆచరించాలి. అందులో ప్రధానఘట్టం దేవతాహ్వానం. ఇది -

శివాది సర్వదేవాంశ్చ
సాష్టాదశ గణానపి
నక్షత్రాదీన్ నదీంశ్చాపి
సముద్రాన్ పర్వతానపి
ద్వీపాన్ లోకాన్ సపాతాళాన్
సమాహూయ విశేషతః

**ఈనెల 7వ తేదీ నుండి 17వ తేదీ వరకు**
**శ్రీ కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా...**







**ఉత్సవా వభృథౌ పశ్చాత్**
**శ్రావయేత్ సకలం జనమ్ (27-123, 4)**

అని చెప్పినట్లు. అష్టాదశ గణ నక్షత్ర, సముద్ర, పర్వతాదులను ఆహ్వానించాలి. ఆ ఆహ్వానానికే భేరీతాడనం అని పేరు. ఆ తరువాత ఉక్త హోమం, కుంభపూజా ఉత్సవం, ఆస్థానార్చన కార్యక్రమం విధిగా జరగాలి. అట్లే ప్రతిరోజూ ఆయా వాహనాలలో యథాశక్తి గ్రామోత్సవం జరపాలి.

ఉత్సవం చివరిరోజు ప్రధానఘట్టం త్రిశూలస్నానం. ఇది సుముహూర్తంలో చేయాలి. ఆచార్యుడు (దేశికుడు) నీటిలో నిమజ్జనమాడే సమయంలోనే -

**యేతత్ర సహమజ్జన్తి**
**జనా భక్తి సమన్వితాః**
**బ్రహ్మహత్యాదిభిః సర్వైః**
**ముచ్యన్తే పాపరాశిభిః**

ఎవరు స్నానమాడుతారో వాళ్లు బ్రహ్మహత్యాది దోషాల్ని పోగొట్టుకుంటున్నారు. తర్వాతది ధ్వజావరోహణం. ఇవి ప్రధానఘట్టాలు. దీనికి అంగాలుగా అనేక విధులు ఆయా ఆగమసంహితలలో చెప్పబడ్డాయి. అవి తప్పక ఆచరణీయాలు. ఇలా ఈ మహోత్సవాన్ని ఎవ్వరు ఆచరిస్తారో వాళ్లు-

**ఇతియః కారయేత్ మర్త్యః**
**శివోత్సవ మనుత్తమమ్**
**సర్వయజ్ఞఫలం ప్రాప్య**
**శివేన సహ మోదతే**

సర్వ యజ్ఞ కృతఫలాన్ని, శివానందాన్ని పొందుతారు.






ఈనెల 28వ తేదీన కులశేఖరాళ్వార్ వర్షతిరునక్షత్రం

# ఎప్పుడనుకుంటే అప్పుడే చేయాలి

- 'కళారత్న' డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478

ప్రపంచంలో ఏ మతానికైనా సంప్రదాయం, సిద్ధాంతం అని రెండు విభాగాలు ఉంటాయి. 'సంప్రదాయం' పుట్టిన తర్వాతనే 'సిద్ధాంతం' పుడుతుంది. విష్ణుసంబంధమైన వైష్ణవమతంలో 'శ్రీ వైష్ణవం' సంప్రదాయం. 'విశిష్టాద్వైతం' సిద్ధాంతం. సంప్రదాయం ఎప్పుడూ భక్తుల పరంపరతో ఏర్పడే భక్తిమార్గం. సిద్ధాంతం శాస్త్రాన్ని, సంప్రదాయాన్ని సమన్వయించి, వైరుధ్యాలు తొలగించి ప్రామాణికత్వాన్ని సమకూర్చేది.

శ్రీ వైష్ణవంలో పన్నెండుమంది ఆళ్వారులు సమకూర్చి పెట్టింది సంప్రదాయం. ఆరుగురు ఆచార్యపురుషులలో మూడవవారైన శ్రీమద్రామానుజాచార్యులవారు స్థాపించింది సిద్ధాంతం.

దీన్నిబట్టి మనకు తెలిసేదేమంటే, శాస్త్రం పండితుల కోసం ఉద్దేశింపబడింది. 'భక్తి' సామాన్యజనుల 'ముక్తి' కోసం ఏర్పడింది. 'ముక్తి' కోరేవాడు ముముక్షువు. అలాంటి ముముక్షు జనులైన సామాన్యమానవుల కోసం, శ్రీవైష్ణవసంప్రదాయంలో చెబితే 'సంసారి చేతనుల' కోసం ఆళ్వారులు చెప్పిన నాలుగు వేల పాశురాలనే 'నాలాయిర దివ్యప్రబంధ' మంటారు. 'ఆళ్వారు' అంటే నిరంతరం భగవంతుని భక్తిలో నిమగ్నమైన వాడని అర్థం.



'పన్నిద్దరు ఆళ్వారులలో చారిత్రక కాలానుసారం చూస్తే, ఏడవ ఆళ్వారు కులశేఖర ఆళ్వారు (700-750),

కులశేఖర పెరుమాళ్ అని పిలువబడే ఈ ఆళ్వారు కేరళదేశంలోని చోళపట్టణమనే పేరుగల కొల్లి నగరంలో 28వ కలియుగంలో పరాభవనామ సంవత్సరం, కుంభ రాశి, మాసిమాసం, శుక్లపక్షం, ద్వాదశి శుక్రవారం పునర్వసు నక్షత్రంలో, శ్రీ మహావిష్ణువు కౌస్తుభాంశలో చంద్రవంశపు రాజకుటుంబంలో జన్మించారు.

శ్లో॥ ఘుష్యతే యస్య నగరే
రంగయాత్రా దినేదినే ।
త మహం శిరసావందే
రాజానం కులశేఖరమ్ ॥

"ఎవరి రాజధానీ నగరమైన కొల్లం అనే పట్టణంలో ప్రతిరోజూ ఉదయం "శ్రీరంగ యాత్రకు వచ్చేవారు రాజుగారితో వెళ్లవచ్చు ననే" (ఘోషణ) చాటింపు వినబడుతూ ఉంటుందో, అలాంటి శ్రీరంగనాథుని భక్తుడైన కులశేఖర మహారాజుకు శిరసు వంచి అంజలి ఘటిస్తున్నాను."

భగవత్సేవకంటే భగవంతుని భక్తులైన భాగవతులను సేవించుకోవడం చాలా గొప్పదనే గాఢనమ్మకం గలవాడు కులశేఖర ఆళ్వారు.

కులశేఖర ఆళ్వారు విలక్షణభక్తుడు. ఈయన రచన 'ముకుందమాల' భక్తులకు నిత్యపారాయణ గ్రంథం. నలభై శ్లోకాలలో కృష్ణునిపై తమకుగల విశిష్టభక్తిని వెల్లడించారు.

శ్రీవైష్ణవుల చరమశ్లోకాల్లో ఒకటైన వరాహపురాణ శ్లోకమైన **"స్థితే మనసి సుస్వస్థే.."** అనే శ్లోక భావాన్ని తలపించే ఒక్క శ్లోకం చూడండి –



**కృష్ణ! త్వదీయ పదపంకజ పంజరాంతమ్,**
**అద్యైవ మే విశతు మానస రాజహంసః ।**
**ప్రాణ ప్రయాణసమయే కఫవాత పిత్తైః,**
**కంఠావరోధన విధౌ స్మరణం కుతస్తే ॥ (8)**

"శ్రీ కృష్ణా! నీ పాదకమలమనే పంజరంలో నా మనస్సనే రాజహంస ఇప్పుడే ప్రవేశించుగాక! ఎందుకంటే ప్రాణావసాన సమయంలో వాత, పిత్త, కఫాలతో నిండిన కంఠం నుండి పెగలి నీ నామం ఉచ్చరించబడజాలనప్పుడు నీ స్మరణ నోరార నేనెలా చేయగలను? అందుకే ఇప్పుడే నా మనస్సును నీ పాదపద్మాలకు సమర్పించుకున్నాను" అన్నారు.

శరీరంలో అన్ని అంగాలు చక్కగా పనిచేసేటప్పుడే భగవత్సేవ, భగవన్నామకీర్తనం చేయాలి. ఎప్పటికో చూద్దాం లెమ్మని వాయిదావేయకూడదు. పుణ్యకార్యాలు అనుకున్న వెంటనే చేయాలి. భగవంతుని పాదపద్మాలు శత్రువులకు భేదింపరాని వజ్రాధికపంజరం. అక్కడకు మన మనస్సు అనే రాజహంస ముందుగా చేరుకుంటే ఇక అరిషడ్వర్గం అక్కడకు చేరి, దాన్ని హరింపలేవు. మనస్సును రాజహంసగా రూపించడం వల్ల ఇది శుద్ధ సత్త్వగుణాత్మకమైంది. శ్రీకృష్ణ పాదారవింద పంజరంలో చేరిన ఈ మానస రాజహంస శుద్ధసత్త్వంతో కూడి, హరినామస్మరణసేవలతో సమాధిస్థితి పొందుతుంది. మనస్సులో స్మరణకంటే మనస్సే ఆ పాదపద్మాలలో చేరితే ఇక దాన్ని ఎవ్వరూ విడదీయలేరు. అక్కడ చేరిన మనస్సు పాదారవిందంగానే పరిణమిస్తుంది. కనుక శత్రువులకు కన్పించదు. ఒకవేళ శరీరంలోని ప్రాణంపోయినా, మనస్సు మాత్రం ఆ దివ్యపాదారవిందాల దగ్గరే ఆనందిస్తుంటుంది. ఇక దానికి జరామరణాది భయం లేదు. అక్కడ మనస్సు నిత్యానంద, నిర్వికల్పక సమాధిస్థితిలో తన్మయమై ఉంటుంది. అక్కడున్న మనస్సుకు గేహ, దేహ చింతన ఉండదు.

శ్రీకులశేఖర ఆళ్వారు ఇచ్చిన ఈ దివ్యసందేశార్థాన్ని గ్రహించి, మనమందరం మన మానస రాజహంసను శ్రీకృష్ణ పరమాత్ముని పాదపద్మపంజరంలో చేర్చి, జీవన్ముక్తులమై తరించాలి!

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమ రావు, 97041 04000



## గతసంచిక తరువాయి..

"ముద్దు బాలకా! నాకు మొక్కులెందుకు? నీవెవరు? నీ తల్లిదండ్రులెవ్వరు?" అని ప్రశ్నించగానే ఆ బాలుడు ధైర్యంతో, "నరనాథ! నా తల్లి నాగకన్య. తండ్రి సుధర్మప్రభువు" అని పరిచయం చేసుకుని తన చేతి ముద్దుటుంగరాన్ని చూపాడు.

రాజు సర్వం ఆకళించుకుని వెనువెంటనే ఆత్మజ బంధుమిత్రాదులకు ఆ బాలుణ్ణి పరిచయం చేసి తాను గతంలో నాగకన్యను పెళ్లాడడం, ఆవిడకు ఉంగరం ఇవ్వడం లాంటివాటిని విశదీకరించి అతనికి తొండమాన్ చక్రవర్తి అని నామకరణం చేశాడు. ఆ పై అతనికి ఉపనయ, వివాహాదులు నిర్వర్తించి, పుత్రుల నిద్దరిని చూస్తూ సంతోషంతో కాలం గడిపాడు. తదనంతరం ఆకాశరాజుకు పట్టంగట్టి, తొండమానుని యువరాజుగా చేసి కొంతకాలానికి భౌతికదేహం చాలించాడు.

ఆకాశరాజు, తొండమానుల తల్లులు వేరైనా ఒకే కడుపులో పుట్టిన బిడ్డల్లాగా కలసిమెలసి జీవించారు. వారిలో పెద్దవాడైన ఆకాశరాజు తనకు సంతానం కలగనందుకు బాధపడుతూ ఒక రోజు బృహస్పతితో- "సద్గురువర! నాకు ఇప్పటిదాకా సంతానభాగ్యం లేదు. నేను ఏ పాపకర్మలు చేశానో నాకు తెలీదు" అని బాధతో విన్నవించాడు.

"రాజా! నీ పాపాలన్నిటికి ప్రాయశ్చిత్తంగా నీవు పుత్రకామేష్టిని చిత్తశుద్ధితో చేయవయ్యా! తప్పక నీకు సంతానం కలుగుతుంది" అని సలహా ఇచ్చాడు. ఆకాశరాజు పుత్రకామేష్టి యజ్ఞం చేసేందుకు సంసిద్ధుడయ్యాడు. బంగారునాగలితో భూమిని దున్నతుంటే వేయిరేకుల పద్మమొకటి వెలువడింది. రాజు నేలమీద పద్మావిర్భావం ఏమిటని సందేహించాడు. తీరా చూస్తే పద్మదళాల మధ్య ఒక బాల కనబడింది.

రాజు దిగ్భ్రాంతుడై ఊరిలోని పెద్దలందరిని పిలిచాడు. పద్మోద్భవ అయిన బాలికను వారికి చూపాడు. సరిగ్గా అదే సమయంలోనే అశరీరవాణి- "రాజా! ఈ బాలికను పెంచుకో. నీకు అన్ని విధాల శుభం కలుగుతుంది" అని ఆదేశించింది. రాజు ఆ బాలిక ఆలనపాలనాదుల పట్ల శ్రద్ధ వహించాడు. భార్య ధరణీదేవి తమకు ఒక ఆడుబిడ్డను భగవంతుడు ప్రసాదించినందుకు మురిసిపోయింది. ఆ బిడ్డ అంతః పురం చేరుకున్న ప్రభావంగా ధరణీదేవి గర్భవతి అయ్యింది.

ఐదవనెల సీమంతం ఘనంగా చేయించాడు. పదవనెల సూర్యుడు కన్యరాశిలో ప్రవేశించిన వేళ శుక్లపక్షం-దశమి-రోహిణి శుక్రవారం శుభలగ్నంలో ధరణీదేవికి కొడుకు పుట్టాడు.

అతడికి 'వసుదానుడని' నామకరణం చేశారు. అమ్మాయికి పద్మావతి అని నామకరణం చేశారు. కూతురిని, కొడుకుని చాల గారాబంగా ఆకాశరాజు పెంచి పోషించాడు. పద్మావతి లక్ష్మిలాగా, వసుదానుడు చంద్రునిలాగా పెరిగారు. ఆ తర్వాత వారికి విద్యాభ్యాస ముహూర్తం నిర్ణయించాడు. కుమారునికి ఉపనయన సంస్కారం పూర్తి చేశాడు. మనసులో పద్మావతికి తగిన వరుణ్ణి ఎలా ఎన్నుకోవాలో తెలియక మథనపడుతుంటే గురువుతో తన చింతను వ్యక్తపరిచాడు.

రాజా! నీవేమాత్రం బాధపడవద్దు. ఆ అమ్మాయికి తగిన వరుడు లభిస్తాడు. ఇందుకు సందేహమేమాత్రం లేదు అన్నాడు గురువు.

దాంతో ఆకాశరాజులో విశ్వాసం పెరిగింది. ప్రజలందరు "మా రాజు పుణ్యాత్ముడ"ని పొగుడుతుంటే ధర్మమార్గాన రాజ్య పాలన చేశాడు. వేంకటాద్రి విభుడు పద్మావతిని పెళ్లాడాలని భావించాడు. పద్మావతి లోకోత్తర సౌందర్యవతిగా పెరిగింది.

ఒకరోజు పద్మావతి మేడ ఎక్కి సుదూరంలోని వన సౌందర్యాన్ని కళ్లారా చూచి ఆ వనంలో విహరించాలని అనుకుంది. తల్లి దగ్గరకు వెళ్లింది.

"అమ్మా! నేను నా చెలికత్తెలతో వనాలకు వెళ్లి రకరకాలపూలను తెస్తానమ్మా" అంది.

ధరణీదేవి "అమ్మా! పూలకోసం వెళితే లోకులు నవ్వుతారు నేను ఏ పరిస్థితిలోనూ నిన్ను పంపను. నీవు నీ చెలికత్తెలను పురమాయించు. వాళ్లు కావలసినన్ని పువ్వులు తెస్తారమ్మా" అంది. దాంతో పద్మావతి బాధతో తిండితినక పడకపై మేను వాల్చింది. ధరణీదేవి పద్మావతీదేవి మారాం పట్టిందని గ్రహించింది. చివరకు నవ్వుతూ తన కూతురి దగ్గరికి వెళ్లింది.

"అమ్మా! వనాలకు వెళ్ళవద్దని చెప్పినందుకే అలిగావు. సరే అలాగే వెళుదువు" చెలికత్తెలతో వెళ్లడానికి అనుమతించింది. వారందరు వనాలకేసి సంతోషంతో కదిలారు. అందరు వనవిహారం చేయసాగారు.

పూలుకోసి తమ చెలులపై పడవేసి కిలకిల నవ్వేవారు కొందరు. మాటమాటికి తియ్యని పల్లిస్తూ ఆనందించేవారు కొందరు. లాలించి, బేలించి నెమళ్లతో పరిహాసాలాడేవారు కొందరు. రాజహంస లాగా నడుస్తూ అనుకరిస్తూ సొరెసొరెకు సోలి పోయేవారు కొందరు. కోయిల లాగా కుహూకుహూ అనే వారు కొందరు. చిలుకల్లా మాట్లాడేవారు కొందరు. మొల్లలు, పొన్నలు, పొగడలు, మల్లెలు, సంపెంగ విరులు, మందారాలు కోస్తూ పూలరాసి పోసేవారు కొందరు. వయసుకు తగిన ఒయ్యారంతో నడిచేవారు కొందరు. విప్రసతులతో జలకాలాటలాడేవారు కొందరు. మెత్తనివస్త్రంతో తడిఒత్తి పట్టుపావడ మొలకట్టింది ఒకతె. సరిగ పూవుల చీర పట్టుపావడమీద చుట్టింది ఒకతె. మొలనూలు వడ్డాణం నడుమలకు బిగించింది మరొకతె. చందురుకావి రవిక తొడిగిందొకతె. అందమైన ఆభరణాలతో అలంకరించింది ఒకతె. మొగిలిరేకులను అందంగా కూర్చి పూసరుల చుట్టుతూ జడవేసిం దొకతె. తిలకం నుదుట దిద్ది వాల్గన్నులకు తగినట్లు కాటుక తీర్చింది ఒకతె. బాలికామణి ఒంటినిండా పరిమళ గంధం అలదింది ఒకతె. మల్లెపూవుల వీవనలతో విసిరింది ఒకతె. నిలువుటద్దం చూపి నిలిచింది ఒకతె.

ఇలా పద్మావతికి సర్వోపచరాలు చేస్తుంటే పద్మావతి బ్రాహ్మణస్త్రీలకంతా పసుపు, కుంకుమ, పూలు, ఫలాలను అర్పించి ఆపై వారికి మొక్కింది. వారు పద్మావతిని దీవించారు. పద్మావతి తన తల్లిపంపిన పంచభక్ష్య పరమాన్నాలను పంచింది. చెలికత్తెలు కూర్చిన విమలపాన్పుపై కూర్చొని తాంబూలం ఇచ్చి తానూ తాంబూలం వేసుకుంది.

సరిగ్గా, అదే సమయానికి నారదుడు వచ్చి, "వనజలోచన నీకు త్వరలోనే వివాహసిద్ధి" అని దీవించాడు. ఆ దీవెనలకు పద్మావతి సిగ్గుపడింది. పద్మావతి చేయి చూచి "అమ్మా! నీ చేతిలోని రేఖలు అద్భుతవిశేషాలను ప్రకటిస్తున్నాయి. స్వస్తికం, పద్మం, ఛత్రం, చామరం, యవ, కలశ రేఖలున్నాయి. ఇవన్నీ శుభప్రదాలు. అంతేకాదు ఘన మాంగల్యరేఖ మెరుస్తూ ఉంది. ఈ రేఖాబలం వల్ల నీకు నారాయణుడే పతి అవుతాడు. నీవు ఆదిలక్ష్మిలా సంతోషంతో ఉంటావమ్మా" అని చెప్పి వెళ్ళాడు. *(ఇంకా ఉంది)*

## శ్రీపదకేళి

### :: 121 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 క | 2 పి | లే | 3 శ్వ | ర | 4 స్వా | మి | |
| 5 మ | | త | | శు | | హ | | 6 శి |
| 7 హా | యి | | 8 మ | రు | డు | | 9 కా | శి |
| శి | | 10 ని | | డు | | 11 వి | | ర |
| 12 వ | సి | ష్ఠ | డు | | 13 పూ | జ | | ఋ |
| రా | | రం | | 14 ఆ | | య | | తు |
| 15 త్రి | అ | | 16 సు | మ | తి | | 17 పా | వు |
| | | 18 ల | | ల | | 19 క | | |
| 20 ల | పి | త | | 21 కి | స | ల | య | ము |

శివతత్త్వమంటే, సుఖమని భావం. శివుడని మనం పరమేశ్వరుణ్ణి పిలుచుకుంటూ ఉంటాం. అంచేత, ఆ పరమేశ్వరుడి తత్త్వం, సుఖస్వరూపమన్న మాట. నిజానికి మన మందరమూ ఆనందంలో పుట్టి, ఆనందంలోనే ఉంటూ, చివరికి ఆనందంలోనే లీనమైపోతాం. అయితే, మనమందరమూ ఈ ఆనందంలో ఉంటున్నామా మరి? అనేదే గడ్డుప్రశ్న.

మనిషి సుఖంకోసం పనుల్ని చేస్తూ ఉంటాడు. అయితే, అతనికి వాటితో సుఖం రాదు సరిగదా, ఉన్న దుఃఖమూ పోదు. అంతేగాదు. మళ్లీ మరో దుఃఖమే వచ్చి పడుతుంది. ఈ విషవలయం నుంచి బయటపడడం ఎలా? అసలు దుఃఖమంటే ఏమిటి? సుఖమంటే ఏమిటి? అనే ప్రశ్నలు మనల్ని చుట్టుముడతాయి. భాగవతంలోని పదకొండవ స్కంధంలో ఉద్ధవగీతలో శ్రీకృష్ణుడు సుఖాన్ని 'దుఃఖసుఖాత్యయం' అని నిర్వచిస్తాడు. అంటే, దుఃఖసుఖాలను రెండింటినీ దాటిందే సుఖమని అర్థం. ఈ నిర్వచనం మనకు తిరకాసుగా ఉంటుంది. దుఃఖాన్ని దాటడం బాగానే ఉంది గానీ సుఖాన్ని కూడా దాటడమేమిటి? దుఃఖమంటే కామసుఖాపేక్ష అని శ్రీకృష్ణుడే అక్కడ చెబుతాడు. కోరికలు తీరటంవల్ల కలిగే హాయిని కోరుకోవటం దుఃఖమెలాగవుతుంది? ఎందుకంటే, ఇంద్రియాలకూ, దృశ్యాలకూ కలిగే సంపర్కంవల్ల వచ్చే హాయి ఇలా కలిగినట్టే కలిగి, అలా చక్కాపోతుంది కనుక. అది ఎంత కలిగిందో అంతగా ఉండదు. కరిగిపోతూ ఉంటుంది. తరిగిపోతూ ఉంటుంది. చివరికి సున్నా అయిపోవటమే గాదు, దుఃఖంగా మారిపోతుంది కూడాను. ఒకతనికి ద్రాక్షపళ్లంటే ఇష్టం. అతని ఇంటికి చుట్టపుచూపుకు వచ్చినవాడు, వాళ్ల దగ్గర దొరికిన ద్రాక్షపళ్లు కొన్ని పట్టుకొచ్చి ఇచ్చాడు. అతని ముఖం చేటంత అయింది. తెచ్చినవాడి ఎదురుగానే ఆబగా తిన్నాడు. పాపం అంత ఇష్టమేమోనని అతను అటువచ్చినప్పుడల్లా ఆ పళ్లు తెచ్చి ఇచ్చేవాడు. నాలుగైదుసార్లవరకూ ఇతనికి బాగానే ఉంది. ఇక ఆపైనుంచీ ఆ ఫలానావాడు వస్తున్నాడంటేనే భయం పట్టుకుంది. మళ్లీ ఎక్కడ ద్రాక్షపళ్లగుత్తులు తెచ్చాడో అని. ఇంటినిండా ఆ గుత్తులే ఉన్నాయి. ఎంతకని వాటిని తింటూనే ఉంటాడు? ఇంట్లోనే ఉన్నా లేదన్నట్టుగా అబద్ధం చెప్పించడానిక్కూడా వెరవలేదు అతను. ఏదైనాసరే ఇలాగే మొహం మొత్తుతుంది. అంచేతనే కామసుఖాపేక్షనే సూటిగా దుఃఖమని చెప్పడం. కోరిక తీరగానే వచ్చిపడే హాయి ప్రతిదీ ఇలాగ బాధగా మారిపోతూ ఉంటే, మొదట్లో కలిగిన




సుఖాన్నిమాత్రం సుఖమని ఎలాగ పిలవగలం? ఒక రేఖకు ఒక చివర సుఖమైతే రెండో చివర దుఃఖముంటుంది. రెండు చివర్ల నుంచీ నడిమికి జరుగుతూంటే, సరిగ్గా మధ్యబిందువు దగ్గర దాటిన ఏ వికారమూ ఏ అలజడీ లేని స్థితి అవుతుంది. అక్కడ దుఃఖంగా మారిపోయే సుఖమూ లేదు. గుండెను కోసేసే దుఃఖమూ లేదు. ఇదే అసలుసిసలైన సుఖం. దీనికి ఏ మార్పూ ఉండదు. దీన్నే 'శివం' అని పిలుస్తారు. ఏ మార్పూ లేకుండా ఉండే ఈ సుఖానికి మనం ఆకారాన్ని ఊహిస్తే అదే పరమేశ్వరుడి శివస్వరూపం. ద్వంద్వాలకు అతీతమైన స్వరూపం.

సుఖదుఃఖాల తాలూకు ఈ నడిమిబిందువు దగ్గరికి ఏ విధంగా చేరుకోవాలి? అనే ప్రశ్నకు మళ్లీ అతనే సమాధానం:

ఈశ్వరుడు తన 'శరీరాన్ని' తిన్నగా నిటారుగా నిలబెట్టి, కనుబొమల నడిమిచుక్క దగ్గర చూపును నిలిపి, దేహసదు పాయాలేమీ చూడకుండా, హిమాలయాల్లో కదలకుండా స్థాణువులాగ కూర్చొని ఉంటాడు. శివుణ్ణి తలుచుకోవాలంటే, మనమందరమూ ఇలాగే ఊహిస్తాం. ఈ యోగముద్రలో కూర్చోవడమేగాదు. ఆయన మెడ ఒక పామును చుట్టబెట్టుకొని కూడా ఉంటుంది. ఒంటినిండా చితాభస్మం పూసుకుని ఉంటాడు. కొంకర్లు పోయే మంచుకొండ మీద కొంతసేపు నిలుచోమంటేనే పారిపోతాం మనం. రగ్గులమీదరగ్గులు చుట్ట బెట్టుకునికూడా గజగజలాడిపోతూ ఉంటాం. దూరంలో ఉన్నా సరే పామును చూడాలంటే భయంతో వణికిపోతూ అక్కణ్ణించి పలాయనం చిత్తగిస్తాం. శ్మశానంలో కాలుతున్న శవాన్ని చూస్తేనే ఆమడదూరం పరుగులు పెడతాం, ముఖాన్ని తిప్పు కుంటాం. ఇక ఆ కాలిన శవం తాలూకు బూడిదను ఒంటికి పూసుకోవటం అసలు కలలోకూడా ఊహించలేం. వీటన్నిటి తోనూ అదరకుండా, బెదరకుండా, కదలకుండా, యోగ ముద్రలో కూర్చోవడమే సుఖానికి మార్గమని శివమహాదేవుడు మనకు తన రూపంతో, మాటలతో చెప్పకుండానే, నిరూపిస్తూ ఉంటాడు. చుట్టూ ఎన్నెన్ని కష్టాల కెరటాల్లాంటి పాములూ పెనుబాధలరూపాలైన తిమింగిలాలూ భీకరంగా గెంతులేస్తూ భయపెడుతూన్నా ఏ క్షోభా పడకుండా చిన్మయంగా ఉండడమే సుఖమంటే. ఎప్పటికీ ఆ సుఖంతో కలిసి ఉండడమే శివత్వం, శివతత్త్వం. సుఖయోగమంటేనే మూర్తీభవించిన శివుడు. అతను ఆనందయోగేశ్వరేశ్వరుడు.

సాధకుడి సాధకబాధకాలన్నీ ఎరిగిన కరుణామూర్తి గనకనే శివుడు, సాధకయోగి చేసే మొదటి ప్రయత్నాల్లో పుట్టే ఆటంకాలను తానే తీసేస్తూ ఉంటాడు. దీన్నే కథాపూర్వకంగా మనకు పెద్దలు 'లోకకల్యాణం కోసం అతను విషాన్నిమింగాడు' అని చెబుతారు. క్షీరసాగరమథనంకోసం దేవతలూ, అసురులూ కష్టపడి మందరపర్వతాన్ని మోసుకొచ్చి, వాసుకినే కవ్వంతాడుగా ఆ కొండకు చుట్టి, అటూ ఇటూ వాళ్లూ వీళ్లూ లాగుతూ చిలకడం మొదలుపెట్టారు. అప్పుడు మొదట్లో హాలాహలం పుట్టింది. సాధకుడి మనస్సే ఒక మహాకడలి. మనస్సే మందర గిరి. దేవతలూ, అసురులూ అతనిలో కొట్టుకుంటూ కూడా విడివడకుండా ఉండే మంచీచెడులు, పాము కుండలినీశక్తి. మనస్సును మథించడమంటే అతికష్టం. మనస్సును అదుపులో పెడదామనే ప్రయత్నం మొదలుపెట్టడమే తడవు, అది ప్రచండంగా ఎదురుతిరుగుతుంది. అప్పటిదాకా మరిచిపోయిన వన్నీ ఒక్కసారిగా ఒకదానివెనక ఒకటిచొప్పున ఆపుదల లేకుండా వచ్చి పుంఖానుపుంఖంగా దాడి చేస్తూనే ఉంటాయి. ఆసనంలో కూర్చొన్న అతని కాళ్లు నొప్పి పుడుతోందంటూ ఒకే అల్లరిచేస్తూ ఉంటాయి. చూపు కనుబొమలమధ్య నిలిపి ఉంచడంతో కళ్లు గుంజేస్తూ ఉంటాయి. అవతల జరిగే హడావిడులూ, టీవీల హోరులూ లౌకికమైన కార్యక్రమాలు 'ఇంకా కాలేదా?' అని తొందరపెట్టేస్తూ ఉంటాయి. ఉప్పెనలాగ ఊపిరాడనీయని ఈ పరిస్థితులే కాలకూటవిషంలాగ సాధకుడి సావధానతను మూర్ఛపోయేలాగ చేస్తుంది. సాత్త్వికమైన యోగసుఖం **'అగ్రే విషమివ పరిణామేఽమృతోపమం' (భగవద్గీత 18-37)**- మొదట్లో విషంగా కటువుగానూ అతి చేదుగానూ ఉంటుంది గానీ ఓపికను చూపిస్తే, అది ఆమీద అమృతమౌతుంది. సాధకుడు పరమేశ్వరుణ్ణే ఘనమైన ఆలంబనంగా పట్టుకుని ధైర్యాన్ని కోల్పోకుండా, నిరుత్సాహ



పడకుండా ఆ ప్రయత్నాన్ని పిరికిపందలాగ విడిచిపెట్టకుండా కొనసాగిస్తేనే ఆ ఆటంకాల ఆకతాయితనమనే విషాన్ని మనస్సనే పొట్టకు చేరకుండా కంఠం దగ్గరే ఆగిపోయేలాగ సదుపాయం చేసుకోగలుగుతాడు. సాధకుడే దోషనీలవిషాన్ని గ్రహించేసే, అంటే, మింగేసే నీలగ్రీవుడవుతాడు.

బాహ్యయజ్ఞాల కర్మల ఆర్భాటంలో మునిగిపోయి, 'అగ్నిముగ్ధులై', 'ధూమతాంతులై', అంటే, బయటి అగ్నిగుండాల జ్వాలలకే ముగ్ధులౌతూ, దాని పొగల ముమ్మరంలో కళ్లుమూసు కొనిపోయి, ఆయాసపడుతూ అలసిపోతూ, ఆ పొగచూరిన బుద్ధినే గొప్పగా భావిస్తూ దర్పాన్ని చూపించే బాహ్యకర్మదక్షుల యజ్ఞాలను యోగేశ్వరుడైన శివుడు ధ్వంసంచేస్తూ, అంతర్యోగ యజ్ఞాల మాహాత్మ్యాన్ని సూచిస్తూ ఉంటాడు. అసలైన సుఖాన్ని కోరుకోనివాడు గనకనే దక్షప్రజాపతి అశివుడై శివుణ్ణి ద్వేషించే దుఃస్థితికి దిగజారిపోయాడు. శివత్వమంటే బొత్తిగా ఎరగని వాడు ఆ దక్షుడు. తన తండ్రి కదా పోనీ అని సతీదేవి ఆయనను క్షమించలేదు. అతని దేహంనుంచి పుట్టిన తన దేహాన్ని ఆవిడ నిలబెట్టుకోవడానికి కూడా ససేమిరా ఇష్ట పడలేదు. రుద్రయోగాన్ని అవలంబిస్తూ యోగాగ్నిని తన దేహంలోనే రగిల్చి కాల్చేసింది. నిజమైన సుఖానికి మార్గం బయటి యజ్ఞాల ధూమమార్గాలగుండా ఏర్పరుచుకోలేమని దక్షయజ్ఞాన్ని నాశనంచేసి నిరూపించాడు పరమేశ్వరుడు.

త్రిపురాసురసంహారంద్వారా అంతరాత్మను మూడు శరీరాల చెరసాలల నుంచి విడిపించుకోవడానికి దారిని చూపించాడాయన. పురాలంటే ఆత్మతో నిండి ఉన్న శరీరాలని అర్థం. మనకు ఒక్కొక్కళ్లకూ మూడుశరీరాలున్నాయి: కారణ శరీరం, సూక్ష్మశరీరం, స్థూలశరీరం. స్థూలశరీరం లోపల సూక్ష్మశరీర ముంటుంది ఆ సూక్ష్మశరీరంలోపల కారణశరీర ముంటుంది. ఈ మూడూ ఆవిధంగా అంతరాత్మకు జైళ్ల లాంటివి. వాటినుంచి బయటపడితేనే ఆత్మకు ముక్తి. కుమార స్వామి తారకాసురుణ్ణి చంపేసిన తరువాత, అతని కొడుకులు ముగ్గురూ ప్రతీకారం తీర్చుకోవడం కోసం బ్రహ్మను ఉద్దేశించి తపస్సుచేశారు. బ్రహ్మ ప్రత్యక్షంకాగానే వాళ్లు "మాకు చావు లేకుండా ఉండేలాగ వరమియ్యి" అని అడిగారు. చావులేకుండా ఉండడమన్నది ఎవరికీ కుదరదని అన్నప్పుడు, వాళ్లు, మా ముగ్గురికీ మూడు పురాలను ఇమ్మనమనీ అవి వేయేళ్లకొకసారి మాత్రమే కలిసినప్పుడు, రథంకాని రథంలో వచ్చిన యోధుడు, బాణంకాని బాణంతో కొడితేనే మాకు చావు రావాలనీ వరం కోరుకున్నారు. బ్రహ్మదగ్గరినుంచి ఆ వరాన్ని పొందిన ఆ ముగ్గురిలో పెద్దవాడైన తారకాక్షుడికి బంగారుపురమూ, రెండోవాడైన విద్యున్మాలికి ఇనుపపురమూ, మూడోవాడైన కమలాక్షుడికి వెండిపురమూ పురమాయించగా మయుడు తయారుచేసి ఇచ్చాడు. ఆ రాక్షసుల ఆగడాలకు అంతులేక పోవడంతో దేవతల ప్రార్థనను పురస్కరించుకుని శివుడు ఆ త్రిపురాలను దహించడానికి ఉద్యమించాడు. అయితే. బ్రహ్మ వాళ్లకిచ్చిన వరాన్ని మన్నించాలి గనుక అసంభవమైన రథబాణాలు కావలసి వచ్చాయి. విశ్వంలో ఉన్నవన్నీ అతని రథానికి అవయవాలయ్యాయి. భూమే రథమధ్యభాగం. చక్రాలు సూర్యుడూ, చంద్రుడూ, ఆరు ఋతువులూ ఆ చక్రాలను పట్టి ఉంచే కమ్ములయాయి. శ్రద్ధే గతి అయింది. బ్రహ్మే సారథి అయ్యాడు. బ్రహ్మచేతిలో ఉండే కమ్చీకర్రగా ఓంకారమైంది. మేరుపర్వతమే విల్లయింది. వాసుకి ఆ వింటినారి అయ్యాడు. విష్ణువే బాణమయ్యాడు. ఆ బాణానికి ములికిగా అగ్ని అమరింది. వేదాలు గుర్రాలయ్యాయి. సంవత్సరమే ఆ రథవేగమైంది. అలాగ రథంకాని రథమూ బాణంకాని బాణమూ సమకూరాయి. అప్పుడు త్రిపురాలు తయారై వెయ్యేళ్లు కావడంతో అవి ఏకత్వాన్ని పొందాయి. అదే త్రిపురదహనానికి వేళ అని శివుడు నిప్పుములికి ఉన్న విష్ణుశరాన్ని వేసి వాటిని నాశనం చేశాడు. మృత్యువు రాగానే స్థూలశరీరమే పోతుంది. తతిమ్మా రెండు శరీరాలూ అలాగే ఉంటాయి. అంటే, ఆత్మ ఇంకా చెరసాలల్లోనే మగ్గుతూ ఉంటుంది. సాధకుడైన యోగి ఈ మూడు బందిఖానాలను చెండాడడానికి ఆధ్యాత్మిక ప్రయత్నాలను చేస్తాడు. ఈ మూడు శరీరాలూ ఒకటయ్యేది అలాంటి సాధకమానవుడిలోనే. శ్రద్ధాభక్తుల్నే ఆ ఉమ్మడిశరీర రథాన్ని నడిపే గతిగా మలుచుకుని, ఆ సాధకుడు, వెనుబామనే మేరుదండాన్నే ఉపనిషత్సంబంధమైన విల్లుగా చేసుకుని, ప్రాణాగ్నే ములికిగా చేసుకున్న వ్యాప్తమైన ఆత్మనే శరంగా తీర్చి దిద్దుకుని, జ్ఞానాన్నే సారథిగా నిలుపుకుని, శివుడై మూడు గుణాల పడుగూపేకగా ఏర్పడ్డ మూడుశరీరాల సంక్లిష్టాన్ని నాశనం చేసుకుంటాడు. మూడుశరీరాల బందిఖానాల్లో ఉన్న సాధకుడి ఆత్మ ఆ విధంగా ముక్తిని పొంది శివపరమాత్మతో సంయోగించి సుఖైకస్వరూపమై ధన్యమౌతుంది.




*(గత సంచిక తరువాయి భాగం...)*

ఇలా కొంతకాలం శ్రీగోవిందరాజస్వామి సమస్తోత్స వాలు స్వీకరించే కాలంలో మ్లేచ్ఛదండయాత్ర వల్ల శ్రీగోవింద రాజస్వామి తిరుమలపై విజయం చేసియుండి, తాము, నిత్యులు (అనంత, గరుడ, విష్వక్సేనాదులు), ఆళ్వారులు, శ్రీభగవ ద్రామానుజులు మొదలగు పరివారంతో ఒక సంవత్సరం పూజలందుకుంటూ, దురాక్రమణ తొలగిన తరువాత శ్రీగోవింద రాజస్వామి నిత్యసూరులు మున్నగువారితో తిరుపతికి విజయం చేసినపుడు స్థలాభిమానియై భగవద్రామానుజుల నియమనం ప్రకారం శ్రీవేంకటాచలక్షేత్రంలో ధర్మకర్తయైన సేవాపతిజియ్యరు అనే ఏకాంగి అప్పటి మలై కునియనిన్డార్ అరైయర్, వెనుకటి బింబాధరసంతతి సంజాతులైన శ్రీనివాసయ్యంగార్ అనే పేరు గల అర్చకులు మున్నగు పెద్దలకు కలలోన వారి వారికి ఆయా కాలాల్లో సేవను అనుగ్రహించారు.

ఆ సమయంలో కందాడై రామానుజయ్యంగార్ శ్రీగోవిందరాజస్వామి ఉత్సవాలు నిర్వహించడానికి సంకల్పిం చారు. ఇలా తిరుమల, తిరుపతులలో శ్రీవేంకటాచలపతి, శ్రీగోవిందరాజస్వామి మున్నగువారికి కైంకర్యాలను యుక్త కాలంలో నడిచేటట్లుగా తమ పూర్వవర్ణస్థులై, పరమభక్తినిష్ఠులై, పరమవిరక్తులైన ఒకరిని స్థలంలో ప్రతిష్ఠచేసి వారికి అయోధ్య రామానుజయ్యంగార్ అనే పేరుపెట్టి రెండుచోట్ల స్వతంత్రాధి కారాలు జరిగే విధంగా కట్టడిచేశారు.

వీరి కాలానికి ముందు తుళువ, సాలువరాయల కాలంలో శ్రీగోవిందరాజస్వామి శ్రీవైభవానికి ఒక ఉపద్రవం కలుగుటవల్ల అప్పుడు శ్రీ ధనాగారానికి ధర్మకర్తయైన ఆళ్వార్ గోవిందజియ్యరు అనే యేకాంగి శ్రీవైష్ణవులందరూ తెలిసేటట్లు తమకొక అసాధారణమైన ఘంటను చేయించుకొని స్వామి కైంకర్యంకోసం ప్రాణత్యాగం చేస్తానని గోపురమెక్కి క్రింద పడ్డాడు. అప్పుడు శ్రీగోవిందరాజస్వామి కటాక్షంతో ప్రాణహాని కలుగలేదు. చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆ గాయాలు కూడ త్వరలోనే మానిపోయాయి. ఆ ఉపద్రవం కూడ తొలగి పోగా వారు మళ్లీ కొంతకాలం ఘంటానాద హనుమద్ధ్వజ పురస్సరంగ స్వామికైంకర్యాల్ని నెరవేర్చేవారు.

శ్రీరామానుజదర్శనప్రవర్తకులైన మణవాళమహా మునులు తిరుపతికి విజయం చేసి దేశాధిపతి నాశీర్వదించి ఈ స్థలంలో మతాంత రస్థులవల్ల ఉపద్రవం రాకుండా ఉండ డానికి ఒక ఉత్తముణ్ణి స్థలాధిపతిగా చేయాలని చింతించి తమ శిష్యులై రాజవల్లభులై, భగవత్కైంకర్యధురంధరులై కోవెలలో (శ్రీరంగంలో) శ్రీరంగనారాయణ జియ్యరు అనే అతను శ్రీభండారానికి నిర్వాహకులైయున్నట్లుగా, తిరుమలకు ఉద్ధారకులై నిగ్రహానుగ్రహ సమర్థులైన ఒక జియ్యరును 'కోయిల్ కేళ్వి తిరువేంగడజియ్యరు' అనే పేరుతో దేశాధిపతి అనుమతి పొంది అర్చకులను, స్థలనిర్వాహకులను, ఆళ్వార్ గోవింద జియ్యరు అనే ఏకాంగి శ్రీవైష్ణవులను తిరువేంగడ జియ్యరుకు అధీనులను చేశారు. *(ఇంకా ఉంది)*



సోమ, మంగళవారాల్లో మారేడు ఆకులు కోయకూడదు



# సందేహాలు సమాధానాలు

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

**ప్ర శివపరివారమూర్తి పటం ఇంట్లో ఉండడం మంచిదని ఒకటి సంపాదించి పెట్టుకున్నాను. శివుడి వృషభవాహనానికి 'నంది' అనిపేరు. మరి పార్వతీదేవి సింహానికి పేరేమిటి?**

**జ)** అమ్మవారు సింహవాహిని. అందులో సందేహం లేదు, కానీ ఆమె శివునితో కలసి వృషభంపై కూర్చొని ఉంటుందని కూడా ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ప్రదోషార్చనలో వృషభ వాహనంపై ఉన్న పార్వతీపరమేశ్వరులనే ఆరాధిస్తారు. పార్వతీ పరమేశ్వరులిద్దరూ వృషభవాహనులని ఆదిశంకరులు స్తోత్రించారు.



అమ్మవారు విడిగా రాక్షస సంహారాదులు చేసేటప్పుడు సింహవాహినిగా ప్రకాశించిన ఘట్టాలను పురాణాలు వర్ణించాయి. కానీ శివునితో ఉన్నప్పుడు వృషభవాహినిగానే ప్రసిద్ధి. దక్షిణభారతంలో కొన్ని దేవీ ఆలయాలలో అమ్మవారి ఎదురుగా వృషభవాహనమే (శివాలయంలో వలే) ఉంటుంది. కనుక పరివారమూర్తిలో మాత్రం ఒక్క వృషభం (నందీశ్వరుడు) ఉన్నా సరిపోతుంది.

ఇక అమ్మవారి వాహనమైన సింహం పేరు – 'సోమనంది'. ఈ నందికీ, ఆ నందీశునికీ అవినాభావసంబంధం కూడా ఉంది. రెండింటిలో 'నంది' నామసామ్యమే దీనికి తార్కాణం, రెండింటి 'నంద' తత్త్వాలు ఒక్కటే.

**ప్ర మేము శ్రీశైలం వెళ్ళినప్పుడు, అక్కడ అందరూ శివలింగాన్ని తాకి నమస్కరిస్తున్నారు. మిగిలిన క్షేత్రాలలో అలా జరగడం లేదు. ఉత్తరాదిలో కూడా అలాగే చేస్తారు. ఉజ్జయినీ, కాశీ వంటివాటిలో. కానీ మనవైపు, మిగిలిన దేవాలయాలలో ఇలా అందరూ తాకరు. ఎందుచేత?**

**జ)** శివాలయాలుగానీ, ఏ ఆలయాలుగానీ ఆ బింబమందు (లింగం/విగ్రహం) యంత్ర, మంత్రశక్తులతో దైవీకళలను ఆవహింపజేస్తారు. వాటి పవిత్రతను శౌచాదులతో కాపాడుకోవాలి. అప్పుడే, ప్రతిష్ఠించిన 'దేవతాశక్తి' చెక్కుచెదరకుండా ఉంటుంది. పైగా– అనేకమంది అనేకరకాల భావనాప్రకంపనలతో ఉంటారు. వారంతా బింబాన్ని తాకితే, అందులో ప్రతిష్ఠితశక్తి తరుగుతుంది. అందులోనూ– కొన్నివేలసంవత్సరాల నుండి వస్తూ, శాశ్వతంగా ఉండవలసిన శిల్పాలను కూడా తాకరాదనీ, దానివల్ల ఆ శిల్పం క్షయమౌతుందనీ పురాతత్త్వ శాస్త్రవేత్తలు హెచ్చరికలు కూడా చేస్తున్నారు. శిల్పరక్షణదృష్ట్యా కూడా అది సమర్థనీయం. అయితే శ్రీశైలం, ఉజ్జయినీ, కాశీ– ఇవన్నీ జ్యోతిర్లింగాలు. వాటిని తాకినా, అందులోని దైవశక్తి సన్నగిల్లదని, శాస్త్రాలు చెప్తున్నాయి.

స్వయంభూలింగాలై, ప్రత్యేకించి 'జ్యోతిః' స్వరూపంగా ఉన్న వాటికి ఉన్న ఆ మహాశక్తిపై ఎటువంటి భావనాప్రకంపనలైనా దెబ్బతిననీయవు. శివపురాణాదులు కూడా ఈ విషయం చెప్తున్నాయి. ఆ కారణం చేత ఎవరైనా జ్యోతిర్లింగాలను తాకి, అర్చించవచ్చు. అన్నిచోట్లా అలా పనికిరాదు. అయితే 'వాయుప్రతిష్ఠావిధానం'తో చేసిన ప్రతిష్ఠలలో శివలింగాన్ని స్పృశించవచ్చు.

ఈ నెల 3వ తేదీ తిరుమళిశైయాళ్వార్ వర్ష తిరునక్షత్రం

# వేంకటాచలానికి నమస్కరించండి!

– డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు

భగవానుని నిర్హేతుక కృపవల్ల ఆ స్వామియొక్క స్వరూప రూప గుణవిభూతుల యథార్థతత్త్వాన్ని దర్శించి, అనుభవించి, వానిని లోకానికి చాటిన మహనీయులు దివ్య సూరులు. వీరినే ద్రావిడభాషలో ఆళ్వార్లు అంటారు. వీరు తమ దివ్యప్రబంధాల ద్వారా మధురభక్తిని ప్రచారం చేశారు. ఈ మహనీయులలో భక్తిసారయోగి ఒకరు.

## మహీసారక్షేత్ర మహిమ

పూర్వం ఒకప్పుడు అత్రి, వశిష్ఠాది మునులు బ్రహ్మను చేరి, భూలోకంలో తపస్సు చేసుకోడానికి అనువైన ప్రదేశాన్ని చూపాల్సిందని ప్రార్థించారు. అపుడు బ్రహ్మ విశ్వకర్మను పిలిచి కాంచీపురానికి పోవాల్సిందని తూర్పుదిశలో సముద్రానికి పశ్చిమాన గల భూభాగాన్ని ఒక పళ్లెంలో, మిగిలిన భూమిని ఒక పళ్లెంలో పెట్టి తూచమని చెప్పాడు. విశ్వకర్మ అట్లే చేయగా, ముందు పళ్లెం క్రిందకు దిగింది. అపుడు బ్రహ్మ మునులకు ఆ ప్రదేశాన్ని చూపి, అదే తపస్సుకు తగిన చోటని తెల్పాడు. భూమిపై సారమైన దేశమవడంవల్ల ఆ క్షేత్రానికి "మహీసారక్షేత్ర"మని పేరు వచ్చింది. ఇది తమిళంలో "తిరుమలిశై"గా పేరు పొందింది.

## శ్రీభక్తిసారయోగి అవతారం

ద్వాపరయుగంలో ఒకానొక సమయంలో మహీసార క్షేత్రంలో భార్గవముని భగవానుని గూర్చి గొప్పతపస్సు చేయ సాగాడు. ఇంద్రుడు అసూయతో ఆ తపస్సును భంగం చేయా లనుకుని, అప్సరసలను పంపాడు. కానీ వారి ప్రయత్నాలు ఫలించ లేదు. అపుడు కనకాంగి అనే దివ్యకాంత తన నృత్య గీతాదులతో భార్గవముని ని ఆకర్షించింది. విధివశాన ఆ ముని కనకాంగి పట్ల ఆకర్షితుడై, కొంతకాలం ఆమెతో వినోదిం చాడు. తత్ఫలితంగా కనకాంగి గర్భవతియై, సిద్ధార్థి సంవత్సరం మకరమాసంలో మఘా నక్షత్రంలో ఆదివారం చతుర్దశి తిథిలో భగవానుని ఆయుధమైన సుదర్శనం అంశతో నిర్దిష్టమైన రూపంలేని ఒక పిండాన్ని ప్రసవించింది. కనకాంగి ఆ పిండాన్ని ఒక వెదురు పొదలో వదలి తనదారిని తాను వెళ్లింది. భార్గవుడు తపోభంగమైనందుకు చింతించి, వేరొక ప్రదేశాన్ని చేరాడు.

## దివ్యదంపతుల అనుగ్రహం

భగవదాజ్ఞతో పుట్టిన ఆ పిండాన్ని భూదేవి సంరక్షిం చింది. క్రమంగా పిండం రూపుదిద్దుకుని, రోదింపసాగింది. అప్పుడు మహీసారక్షేత్ర అధిపతి అయిన స్వామి, దేవేరి ఇద్దరూ వచ్చారు. భగవానుడు ఆ బిడ్డను ఎత్తుకుని లక్ష్మీదేవి చేతులలో ఉంచగా, ఆమె తన దివ్యకటాక్షంతో ఆ బిడ్డ ఆకలిని తీర్చింది. ఇలా ఆ బాలకుడు పుట్టినప్పుడే దివ్యదంపతుల అనుగ్రహాన్ని పొందాడు. తర్వాత భగవానుడు, లక్ష్మీదేవి వెళ్లిపోయారు.



వాళ్లిద్దరు అంతర్ధానం కాగానే, ఆ బాలుడు మళ్లీ ఏడువసాగాడు. అపుడా ప్రాంతంలో తిరిగే శ్రీనిధి (తిరువాళన్) అనే మేదరి, ఏడుపు విని, బాలకుణ్ణి ఇంటికి తీసుకుపోయి, భార్యకు అప్పగించాడు. సంతానం లేని ఆ దంపతులు బాలుణ్ణి చాలా ప్రేమతో చూచుకునేవారు. కానీ ఆ బాలుడు లోకరీతిలో ఉండక, పాలను త్రాగడంకానీ, ఆకలికి ఏడ్వడంగానీ చేయకుండా ఉండేవాడు. కేవలం భగవద్గుణచింతతో కాలం గడిపేవాడు. ఆ బాలుని విషయం చుట్టుప్రక్కలంతా తెలిసింది.

## కణిక్కణ్ణన్ జననం

బాలుని గొప్పతనాన్ని విన్న ప్రాజ్ఞుడనే అతను సతీసమేతంగా అతణ్ణి చూడడానికి వచ్చాడు. ఆ బాలుడి అప్రాకృత తేజస్సు గమనించి ఆశ్చర్యపడ్డాడు. తాము తీసుకువచ్చిన పాలను స్వీకరించమని వాళ్లు ఆ బాలుణ్ణి పదేపదే ప్రార్థించగా, అతడు అందుకు అంగీకరించాడు. ఇలా ప్రతిరోజూ ఆ దంపతులు బాలుడికి పాలు సమర్పించేవారు. నిస్సంతువులైన ఆ దంపతుల కొఱతను తీర్చాలనుకున్న ఆ బాలుడు ఒకనాడు తన కిచ్చిన పాలలో కొంతభాగాన్ని మిగిల్చాడు. క్షీరశేషాన్ని త్రాగిన ప్రాజ్ఞుని భార్య గర్భవతియై, ఒక పుత్రుణ్ణి కన్నది. వారతనికి "కణిక్కణ్ణన్" అని పేరు పెట్టారు. కాలక్రమంలో పెరిగి పెద్దవాడైన అతడు భగవద్భక్తి కలవాడై, సర్వజ్ఞుడై, గొప్పకవి అయ్యాడు. ఇలా భార్గవకుమారుడు బాల్యంలోనే తన మహిమను ప్రదర్శించాడు.

## మహాయోగికి శిష్యుడవడం

భార్గవసుతుని బాల్యం మేదరి వారి ఇంట గడచింది. బాల్యదశ దాటాక అతడు దేశసంచారం చేస్తూ, అష్టాంగయోగసాధన ద్వారా భగవానుని ఆరాధించాలనుకున్నాడు. ఆ ప్రయత్నంలో భార్గవకుమారుడు సమస్తదర్శనాలను, అందులోని రహస్యాల్ని గ్రహించాడు. భార్గవసుతుని గొప్పతనాన్ని ఇంతకుముందే విన్న మహాయోగి (పేయాళ్వార్లు) ఆయనను విష్ణుభక్తునిగా చేయాలనుకున్నారు. భార్గవకుమారుడు నివసించే ప్రాంతంలో నివాసమేర్పరచుకుని, అక్కడ పూలమొక్కలను, పండ్లమొక్కలను తలక్రిందులుగా నాటుతుండేవారు. భార్గవ సుతుడా సంగతి చూచి, నవ్వుతూ "అయ్యా! మీకేమైంది? మొక్కలను తలక్రిందుగా నాటితే ఏమి ఫలం" అని పరిహాసం చేశాడు. అప్పుడు మహాయోగి సర్వేశ్వరుడైన శ్రీమన్నారాయణుని వైభవాన్ని పలు ప్రమాణాలతో నిరూపించారు. భార్గవ కుమారుడు మహాయోగికి ప్రణమిల్లి వారికి శిష్యుడయ్యారు. మళ్లీ మహీసారక్షేత్రాన్ని చేరి, అక్కడ భగవద్ధ్యానంతో కాలం గడుపసాగారు.

## భక్తిసార బిరుదు

ఒకసారి పార్వతీపరమేశ్వరులు అతనివద్దకు వచ్చి అనేకవిధాలుగా పరీక్షించి అతని విష్ణుభక్తితత్పరతను పరీక్షించి, "భక్తిసారులు" అనే బిరుదునిచ్చి, ప్రశంసించారు. ఈ వృత్తాంతాన్ని భక్తిసారులు తమ ప్రబంధమైన 'నాన్ముగన్ తిరువన్దాది'లోని 'మత్తుత్తొళువార్' అనే 26వ పాశురంలో ప్రస్తుతించారు. అప్పటినుండి భార్గవకుమారుడు "భక్తి సారులు" అనే పేరుతో ప్రసిద్ధి చెందారు. భక్తిసారుడనడానికి భగవత్ భక్తి యొక్క సారమైనవారని, భగవద్భక్తియేసారంగా అనగా జీవనాధారంగా కలవారని చెప్ప వచ్చు.

## రచనలు

భగవద్గుణ సముద్రంలో పరిపూర్ణంగా అవగాహించిన భక్తిసారులు లోకోద్ధరణ కోసం రెండు దివ్యప్రబంధాల్ని అనుగ్రహించారు. వానిలో మొదటిది నాన్ముగన్ తిరువన్దాది. ఈ ప్రబంధం "నాన్ము కనై" అనే పదంతో ప్రారంభం కావడంవల్ల దీనికి ఆ పేరు వచ్చిందని పెద్దలంటారు. దీనికే "నాలామ్ తిరువన్దాది, నానామ్ తిరువన్దాది" అనే పేర్లు ఉన్నా అవి అప్రసిద్ధాలు. ఇలా ప్రబంధంలోని మొదటి పాశురంలోని మొదటిపదంతో ఆ



ప్రబంధానికి పేరుపెట్టడం "అమలనాది పిరాన్, కణ్ణినుణ్ శిఱుత్తామ్బు" వంటి ప్రబంధాల పేర్లలో కూడ కన్పిస్తోంది. ఈ గ్రంథం "అన్దాది" ప్రక్రియలో రచింపబడింది. నాన్ముకన్ తిరువన్దాదిలో "వెణ్‌పా" అనే తమిళ ఛందస్సులో రచింపబడ్డ 96 పాశురాలున్నాయి. విష్ణుపారవశ్యమే ఈ ప్రబంధ ప్రధానాంశం.

వీరి రెండోరచన "తిరుచ్చన్ద విరుత్తమ్" అనే దివ్య ప్రబంధంలో 120 పాశురాలున్నాయి. ఈ ప్రబంధంలో కూడా భక్తిసారులు విష్ణువే పరతత్త్వమని నిర్ణయించారు. వీరికి భగవానుని అంతర్యామిరూపంపై కల ప్రత్యేకాభినివేశం ఈ ప్రబంధంలో నిరూపితమైంది.

## ప్రబంధప్రమేయం

భక్తిసారులు తాము రచించిన రెండు ప్రబంధాల్లో విష్ణుపారమ్యాన్ని నిరూపించారు. కాబట్టే వీరిని సంప్రదాయంలో 'తిరుమళిశైప్పిరాన్' అని గౌరవిస్తారు. "పిరాన్" అంటే ఉప కారకుడు అని అర్థం. విష్ణుపారమ్యాన్ని ఎదిరించేవారిని ఓడించడంకోసం నిత్య సన్నద్ధులై ఉండడంవల్ల వీరిని "ఆచార్య హృదయమ్" అనే గొప్ప రహస్యగ్రంథంలో "అళిగియ మణవాళ ప్పెరుమాళ్ నాయనార్" అనే ఆచార్యులు "ఉఱైయి లిడాదవర్" (ఒరలో కత్తిని పెట్టనివారు) అని పొగిడారు. ముదలాళ్వార్ల దివ్యప్రబంధాలు మూడిట్లో భగవదనుభవం ప్రధానాంశం. ఈ అనుభవం నిరాటంకంగా కల్గడానికి విరోధి నివృత్తి అవసరం. ఇలాంటి నివృత్తి విష్ణువే పరతత్త్వం, ఆ స్వామికి మాత్రమే చేతనులందరు శేషభూతులు, వేరొకరికి కాదు, ఆ స్వామినే ఆశ్రయించి, సేవించడమే స్వరూపం అనే జ్ఞానం కల్గినప్పుడే సాధ్యపడుతుంది. ఈ రహస్యాన్ని భక్తిసారులు తమ ప్రబంధాల్లో పొందుపఱచారు. "నాన్ముకనై నారాయణన్ పడైత్తాన్" (చతుర్ముఖుని నారాయణుడు సృజించాడు) అని ప్రారంభించిన నాన్ముకన్ తిరువన్దాదిలో "తిరువిల్లాత్తే వరైత్తేవేల్ మిన్ తేవు (శ్రీయఃపతి కానివారిని దైవంగా తలచకండి)" అని మధ్యలో, "ఇనియఱిన్దేన్ ఈఱుమ్ నాన్ముకక్కుమ్ దెయ్‌వమ్" (ఇక ఈశ్వరునకు, బ్రహ్మకు దైవమైన వాణ్ణి తెలిసితిని) అని చివరలో విష్ణుపారమ్యాన్ని ఉద్ఘాటించారు. అట్లే తిరుచ్చన్దవిరుత్తంలో "అన్ఱు నాన్ముకత్పాయన్ద ఆదిదేవనల్లైయే" (అపుడు ప్రళయ కాలంలో బ్రహ్మను సృష్టించిన జగత్కారణం నీవు కదా!) అని ప్రారంభంలో "కాణిలుమ్ ఉరుప్పొలార్"(చూచినా శరీరంలో దోషాన్ని కలవారు) అని మధ్యలో, "అడుత్తశీర్ నలఙ్గొళ్ మాలై" (సహజగుణాలతో కల్గిన గొప్పతనాన్ని కల సర్వేశ్వరుని) అని చివరలో ఆ విషయాన్ని దృఢీకరించారు. కావున అష్టాక్షరీ మంత్రంలో విరోధి నిరసనను తెల్పు నమః శబ్దం అర్థాన్ని ఈ రెండు ప్రబంధాలు వివరిస్తున్నాయని చెప్పవచ్చు.

## భక్తిసారులు - వేంకటాచలం

భక్తిసారులు తమ ప్రబంధాల్లో పలు దివ్యదేశాల్ని కీర్తించారు. వానిలో శ్రీవేంకటాచలానికి ప్రత్యేకస్థానముంది. వీరు నాన్ముకన్ తిరువన్దాదిలో 12 పాశురాల్లో, తిరుచ్చన్దవిరుత్తమ్‌లో 2 పాశురాల్లోను వేంకటాచలాన్ని, అక్కడి స్వామిని పొగిడారు. తిరుచ్చన్ద విరుత్తమ్‌లోని "కున్ఱిల్ నిను" "నిఱ్పదు మోర్ వెఱ్పకత్తు" అని ప్రారంభమయ్యే పాశురాల్లో వేంకటాచల ప్రస్తావన శబ్దతః కన్పించకున్నా, సుప్రసిద్ధ నాలాయిర దివ్య ప్రబంధ వ్యాఖ్యాత అయిన పెరియవాచ్చాన్ పిళ్లై అక్కడ వ్యాఖ్యా నిస్తూ "వేంకటాచల మనే పర్వతం పై నిల్చి" అని వివరించారు. కాబట్టి ఆ పాశురాలు కూడ తిరుమలపరమని చెప్పవచ్చు.

భక్తిసారులు వేంకటాద్రిని, అక్కడి ప్రకృతిసౌందర్యాన్ని, ఆక్కడ వేంచేసి ఉన్న స్వామిని కీర్తించారు. "కల్లురువిముత్తుదిర" (శబ్దించే వాగులద్వారా ముత్యాలు రాలగా) అని, పొళిల్ వేంగడ మలై (తోటలచే చుట్టబడ్డ వేంకటాచలం) అని "ఆళియుమ్ కోళరియుమ్ పొన్‌మణి ముత్తముమ్, పూమరముమ్" అని పలుచోట్ల తిరుమలశోభను వర్ణించారు. "శెన్ఱువణఙ్గోమినో శేణుయర్ వేఙ్గిడత్తై" (ఉన్నతశిఖరాలతో అందమైన వేంకటా చలానికి వెళ్లి నమస్కరించండి), "వెఱ్పెన్ఱు వేఙ్గడమ్ పాడినేన్" (పర్వతం అంటూ వేంకటాచలాన్ని కీర్తించాను) అంటూ వేంకటాచలాన్ని పొగిడారు. "వీత్తిరున్దు విణ్ణాళ వేణ్డువార్ వేఙ్గిడత్తాన్ పాల్ తిరున్దవైత్తారే పన్ మలర్ కళ్ (వైకుంఠంలో నిలచియుండి ఆ పరమపదాన్ని ఏలగోరువారు శ్రీవేంక టేశ్వరునకు పలు పుష్పాల్ని సమర్పించినవారే అవుతారు). అంటూ స్వామి మహిమను పాడారు. "నిన్ఱు వినైకెడుక్కుమ్ నీర్మైయాల్" (నిలిచియుండి పాపాల్ని హరించే స్వభావంతో సౌలభ్యంతో) అంటూ వేంకటశబ్దాన్ని నిర్వచించారు.



ఈశ్వరుణ్ణి ఆశ్రయించిన వారికి బుద్ధిశక్తి పెరిగి విద్యలన్నీ రాణిస్తాయి

### మంగళాశాసనం

ఆళ్వార్లు అందరివలే వీరుకూడా భగవానునకు మంగళాశాసనం చేయడం మిక్కిలి అభినివేశం కలవారు. కావున పలు క్షేత్రాల్ని దర్శించి, అక్కడి అర్చామూర్తులకు మంగళాన్ని పాడారు. "వాళ్‌త్తుకవాయ్" (నోరార మంగళాన్ని పాడండి) మలరేఊ విట్టిఱైజ్జి వాళ్ త్త వలరాకిల్ (పూలను సమర్పించి, నమస్కరించి మంగళాన్ని పాడగల్గినవారైతే) అంటూ భగవానునకు మంగళాశాసనాన్ని చేయమని జనులకు ఉద్బోధించారు. వీరికి శ్రీరంగనాథుని పట్లగల భక్తి నిరుపమానం.

భక్తిసారులు యోగసమాధిలో ఉన్నప్పుడు ఒకానొక సమయంలో ఆ మార్గంలో పయనించే ముదలాళ్వార్లు వీరి దివ్యతేజస్సుకు అబ్బురపడి వీరిని చూడవచ్చారు. భక్తిసారులు వారికి ప్రణమిల్లారు. పిమ్మట వారు నల్గురూ భగవద్గుణకీర్తనతో కొంతకాలం గడిపారు. భక్తిసారుల మహిమలు అనేకం. వీరి చేతిలో శుక్తిహారుడనే ఖేచరుడు, కొంకణసిద్ధుడనే రసవాది పరాభవాన్ని పొందిన వృత్తాంతాలు ప్రసిద్ధాలు.

### శార్ఙ్గపాణి అనుగ్రహం

భగవానునకు వీరిపట్ల గల అనుగ్రహాన్ని తెల్పే వృత్తాంతం తిరునెడున్దాణ్డక దివ్యప్రబంధంలో "తణ్ కుడన్దై నకరమ్ పాడి" అనేచోట పెరియవాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్యానంలో కన్పిస్తోంది. తిరుక్కుడన్దై కీర్తింక్కుడనై (కుంభకోణం) దివ్య దేశంలో వేంచేసియుండు శార్ఙ్గపాణిస్వామి ఒకనాడు భక్తిసారులకు ఆరగింపు కానిదే తాను ప్రసాదాన్ని స్వీకరించనని అర్చక ముఖంగా తెలిపాడు. అర్చకులు కూడా స్వామి నియమాన్ని అనుసరించి, ముందుగా భక్తిసారులకు నైవేద్యాన్ని సమర్పించి, తర్వాత స్వామికి ప్రసాదాన్ని అర్పించారు. స్వామి కూడా దాన్ని పరమప్రీతితో స్వీకరించాడు. అప్పటినుండి అచటి నిలిచి స్వామికి "ఆరావ ముదాళ్వార్లు" అని భక్తిసారులకు "తిరుమళి శైప్పిరాన్" అని ప్రసిద్ధి కల్గిందని చెబుతారు.

భక్తిసారయోగి యోగబలంతో ఈ భూమండలంలో పలు వత్సరాలు జీవించి శ్రీరంగనాథుని అనుగ్రహంతో చివరకు పరమపదాన్ని చేరారు. ఈ మహనీయులు చూపిన భక్తిమార్గాన్ని అనుసరించడం ద్వారా మనం వారిపట్ల మన కృతజ్ఞతను తెల్పుదుము గాక!

## మొగలిపువ్వు - ఆవు - శివుడు

పూర్వం బ్రహ్మవిష్ణువుల ఆధిపత్యపోరుతీర్చడానికి తమలో తాము 'నేను గొప్ప అంటే నేను గొప్ప' అని వాదించుకున్నారు. పరమేశ్వరుడే స్వయంగా రంగంలోకి దిగాడు. ఈశ్వర సంకల్పంతో ఒక పెద్ద జ్యోతిర్లింగం బ్రహ్మవిష్ణువుల మధ్య వెలసింది. బ్రహ్మ, 'విష్ణువు లిరువురూ లింగాన్ని సమీపించారు. అప్పటివరకు వారి మధ్య ఉన్న ఆధిపత్యపోరు తాత్కాలికంగా సద్దుమణిగింది. ఆ మహాలింగం మొదలు, తుది తెలుసుకోవా లన్న ఆసక్తి వారిద్దరికీ కలిగింది. బ్రహ్మ హంస రూపం ధరించి లింగం అగ్రభాగాన్ని చూడటానికి, విష్ణువు వరాహరూపంలో ఆదిని కనుక్కోవడానికీ బయల్దేరారు. బ్రహ్మకు ఎంతకూ లింగం అగ్రభాగం కానీ మొదలు కానీ కనిపించలేదు. ఇంతలో లింగం పక్కనుంచి ఒక కేతకపుష్పం(మొగలిపువ్వు) జారి కిందకు రావడం చూసి బ్రహ్మ దాన్ని ఆపి తనకు, విష్ణువుకు నడుమ జరిగిన వాదాన్ని వివరించి, సహాయం చేయమని అడిగాడు. ఆవు కనపడితే అదే విధంగా చెప్పి, ఆ లింగం అగ్రభాగాన్ని చూసి నట్లుగా విష్ణువుతో చెప్పేటప్పుడు అది నిజమేనని సాక్ష్యం ఇమ్మని ప్రాధేయపడ్డాడు. సాక్షాత్తూ సృష్టికర్తే తనని బతిమాలే సరికి కాదనలేక సరేనంటాయా రెండూ. కిందికి దిగి వచ్చేసరికి విష్ణువు తాను ఆ లింగం మొదలు చూడలేకపోయానని ఒప్పుకున్నాడు. బ్రహ్మ తాను లింగం అగ్రభాగాన్ని చూశానని, కావాలంటే ఆవును, మొగలిపువ్వును అడగమని చెప్పాడు. 'నిజమే' అంది మొగలిపువ్వు. బ్రహ్మదేవుడి మాటను కాదనలేక ఆయన లింగం అగ్రభాగాన్ని చూశాడని ఆవు తలతో చెబుతుంది కానీ, అసత్యం చెప్పడానికి ఇష్టం లేక తోకతో చూడలేదని చెబుతుంది. బ్రహ్మదేవుడి అసత్యప్రచారాన్ని చూడలేక ఈశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. బ్రహ్మ చెప్పిన ప్రకారం అబద్ధపు సాక్ష్యం చెప్పిన మొగలిపువ్వుతో భక్తులెవ్వరూ తనను పూజించరాదని, తెల్ల వారి లేచి ఆవు ముఖం చూడటం కూడా పాపకారణమని శపించాడు. ఆవు అభ్యర్థన మేరకు తోకతో నిజం చెప్పింది కాబట్టి పృష్ఠభాగం పవిత్రమైనదని, తోకభాగాన్ని పూజించిన వారికి పుణ్యఫలాలు కలుగుతాయని వరమనుగ్రహించాడు మహేశ్వరుడు.



ఈనెల 6వ తేదీన కూరత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం సందర్భంగా..



# ఒడిలో బరువుంటే కదా.. దారిలో భయముండేది!

– ఆచార్య కె.రాజగోపాలన్

భగవత్ రామానుజాచార్యుల ఆంతరంగిక శిష్యులలో ప్రథములు శ్రీకూరేశమిశ్రులు. వీరికి తమిళభాషలో కూరత్తాళ్వాన్ అని, సంస్కృతంలో శ్రీవత్సాంకమిశ్రులని నామాంతరాలు.

## విద్యాభ్యాసాదులు

శ్రీకాంచీపురానికి సమీపంలోని కూర అగ్రహారంలో 1008వ సంవత్సరంలో 'పుష్య'మాసంలో 'హస్తా'నక్షత్రంలో శ్రీఅనంతభట్టార్యునకు కుమారుడిగా కూరేశులు జన్మించారు. వీరు విద్యలో బృహస్పతి. సకాలంలో ఉపనయన పంచ సంస్కారాలు చేసుకుని యుక్తవయసు వచ్చేటప్పటికి వేదవేదాంతాది శాస్త్రాలలో అసమాన ప్రతిభను కలిగి మహావిద్వాంసులుగా పేరుపొందారు. ఇంతటి మహాప్రతిభాశాలి అయిన వీరు 'కూర' గ్రామాధిపతి కూడా! అందుకే 'కూరేశు'లనే సార్థక నామధేయులయ్యారు.

## మహావైరాగ్యకారణం

అత్యంత ఐశ్వర్యసంపన్నులైన వీరు ప్రతినిత్యం సూర్యోదయంనుండి రాత్రి రెండో జామువరకు బీదలకు, సాధువులకు అన్నదానం చేస్తుండేవారు. ప్రతిదినం కంచిలో వరదరాజస్వామికి ఏకాంతసేవ అయిన తరువాతే వీరి భవన తలుపులు మూయబడడం ఆచారం. ఒకనాడు వరదరాజస్వామికి ఏకాంత సేవ ఆలస్యం కాగ కూరేశుల భవన ద్వారపాలకులు ఆ విషయం తెలీక ద్వారపు తలుపులు మూసేశారు. ఆ తలుపుల కున్న చిరుగంటల ధ్వని కంచిలోనున్న స్వామి, అమ్మవార్ల చెవినబడింది. దాన్ని ఆలకించిన స్వామి తిరుక్కచ్చినంబిని చూచి "ఆశ్చర్యంగా ఉంది. తిరువారాధనం ముగియడానికి ముందే తలుపులు మూయబడిన వెందుకు?" అని ప్రశ్నించగా, "ఈ ధ్వని ఇక్కడి కాదు. చాలాదూరంలో ఉన్న కూరేశుల భవన ఐశ్వర్యాతిశయ ధ్వని" అని తిరుక్కచ్చినంబి విన్నవించాడు.

ఈ విధంగా తిరుక్కచ్చినంబికి, వరదరాజస్వామికి జరిగిన సంభాషణను అర్చకుల ద్వారా విని వైరాగ్యంలో 'భగవంతుణ్ణి తన ఐశ్వర్యంతో భ్రమింపజేసి నందుకు' చాలా బాధపడి తన సకల ఐశ్వర్యాన్ని తృణప్రాయంగ తలచి త్యజించి బీదలకు దానం చేసి సామాన్యవస్త్రాలతో రామానుజుల వద్దకు బయలుదేరారు. అడవిమార్గంలో ప్రయాణిస్తున్నప్పుడు వీరి భార్య "స్వామీ! భయంగా ఉంది" అంది. కూరేశులు "ఒడిలో బరువుంటే కదా త్రోవలో భయముండేది, అలా నీవద్ద ఏమైనా ఉందా?" అని అడిగారు.

"నాథా మీకెప్పుడైనా దాహమైతే మంచితీర్థం తెచ్చి ఇవ్వడానికి ఒక చిన్న స్వర్ణపాత్రను మాత్రం తెచ్చాను" అని దాన్ని కూరేశుల చేతికిచ్చింది. దానికి కూరేశులు "బీదవారు బంగారుగిన్నెతో దాహం తీర్చుకోవడం చూశావా!" అని ఆ గిన్నెను అడవిలో దూరంగా విసిరేశారు. తరువాత శ్రీరంగానికి బయలుదేరారు.

## శిష్యరికం

ఇలా శ్రీరంగానికి వచ్చిన కూరేశులు రామానుజులను గురువుగా భావించి వారి పాదాల్ని ఆశ్రయించారు. రామానుజులు కూడా వీరి గొప్పతనాన్ని విని వీరిని అంతరంగ



ఓంకారానికి శబ్దలింగం అనిపేరు

శిష్యులుగా చేసుకుని వీరికి సకలవేదవేదాంతాల్లోని రహస్యాలను ఉపదేశించారు.

రామానుజులు గోష్ఠీపూర్ణులు వద్ద అష్టాక్షరీమంత్రో పదేశాన్ని పొందాలని నిశ్చయించుకుని అనేక పర్యాయాలు వారివద్దకు వెళ్లి మంత్రోపదేశం చేయమని ప్రార్థించారు. కానీ, గోష్ఠీపూర్ణులు మంత్రోపదేశం చేయకున్నారు. పట్టుదలతో మళ్లీ రామానుజులు వెళ్లి అడుగగా రామానుజుల అర్హతను గుర్తించి త్రిదండ, యజ్ఞోపవీతాలతో ఒంటరిగా రమ్మని ఆజ్ఞాపించారు. మరుసటి దినం రామానుజులు, కూరేశ, దాశరథులను వెంట బెట్టుకొని గోష్ఠీపూర్ణుల దగ్గరకు వెళ్లారు. తన ఆదేశానికి విరుద్ధంగా వచ్చిన రామానుజులపై ఆగ్రహం వ్యక్తం చేయగా, అపుడు రామానుజులు "గురువర్యా! మీ ఆనతి ప్రకారమే త్రిదండ యజ్ఞోపవీతాలతో వచ్చాను. వీరిద్దరూ నాకు త్రిదండ యజ్ఞోపవీతాలు" అన్నారు. అపుడు గోష్ఠీపూర్ణులు ఆశ్చర్యంతో "ఇందులో ఎవరు త్రిదండం, ఎవరు యజ్ఞోపవీతం అని అడుగగా, దాశరథి త్రిదండం, కూరేశులు యజ్ఞోపవీతం" అని చెప్పారు. రామానుజుల శిష్యవాత్సల్యానికి ముగ్ధులై ముగ్గురికి మంత్రోపదేశం చేశారు.

ఉంఛవృత్తితో జీవితాన్ని గడుపుతున్న కూరేశ దంప తులకు భగవత్ప్రసాదమహిమవల్ల ఇద్దరు పుత్రులు కలిగారు. వేదవ్యాసభట్టర్, పరాశరభట్టర్ అని రామానుజాచార్యులు వారికి నామకరణం చేశారు.

## అహంకార రాహిత్యం

సకలశాస్త్రాలను ఆపోసనపట్టిన వీరికి విద్వాంసుడన్న అహంకారం ఏ కోశానాలేదు. ఒకసారి ఒక ఆచార్యులు వీరి దగ్గర సంప్రదాయరహస్యాల్ని నేర్చుకోవాలని వచ్చి వీరిని ప్రార్థిస్తారు. కానీ, తాను ఆచార్యుడైనందుకు పలువురి ఎదుట బహిరంగంగా విద్య నేర్చుకోవడం అవమానంగా భావించి ఎవరూలేని, చూడని ఏకాంతప్రదేశంలో విద్య నేర్పమని అడిగారు. ఆచార్యుని అజ్ఞానానికి బాధపడి కూరేశులు అతని అభీష్టానుసారమే మధ్యాహ్నసమయాల్లో దేవాలయ ప్రాంగణం నిర్జనప్రదేశమని భావించి అక్కడే ఆ ఆచార్యునికి సంప్రదాయ రహస్యాలు బోధిస్తున్నారు.

ఒకనాడు కొందరు రాజభటులు ఆ ప్రాంగణంలో ప్రవేశించారు. వారిని చూసిన ఆ ఆచార్యుడు చాలా బాధతో ఖిన్నవదనుడై తాను విద్యాభ్యాసం చేయడం (ఒక ఆచార్యుడుగా ఉండి) వారు చూస్తే తనకు అగౌరవమేర్పడుతుందని బాధపడు తున్నారు. అతని మనస్సులోని భావనను, బాధను గుర్తించిన కూరేశులు అతని చేతిలోనున్న పుస్తకాన్ని తాను తీసుకుని ఆ ఆచార్యుడు ఉపదేశిస్తున్నట్లు, వారివద్ద తాను విద్యాభ్యాసం చేస్తున్నట్లు అక్కడికి వచ్చిన మనుషుల ఎదుట అభినయించి అతని బాధను పోగొట్టడమేగాక కూరేశులంతటివారికి కూడా ఉపదేశించగలడీ ఆచార్యుడు అని అతని కీర్తిని ఇనుమడింప జేశారు.

## శ్రీభాష్యలేఖనం

రామానుజులు బ్రహ్మసూత్రాలకు భాష్యం రచించ డానికి ఉద్యుక్తులయ్యారు. బ్రహ్మసూత్రాలకు అంతకు పూర్వం బోధాయనమహర్షి వ్రాసిన వృత్తి కాశ్మీరదేశంలో శారదాపీఠంలో ఉందని కూరేశులతోపాటు అక్కడికి వెళ్లి అక్కడి పండితులను వాదంలో ఓడించి వృత్తిగ్రంథాన్ని సంపాదించారు. రామాను జులు మొదటి అధ్యాయం చదువుతుండగా కూరేశులు మిగతా గ్రంథం పూర్తిగా చదివి పూర్తిచేశారు. ఇంతలో అక్కడి పండితులు వచ్చి పుస్తకం మళ్లీ తీసుకోవడంతో రామానుజులు పుస్తకం పూర్తిగా చదవలేదే అని బాధతో ఉన్నారు. అపుడు



కూరేశులు రామానుజులతో "గ్రంథం పోయిందని బాధ పడవద్దు. గ్రంథం పూర్తిగా నేను చదివాను. గ్రంథంలోని వాక్యాలను యథాతథంగా చెప్పగలను, పరీక్షించండి" అని రామానుజులతో చెప్పారు. రామానుజులు కూడా పలు విష యాలపై ప్రశ్నించారు. కూరేశులు కొంచెం కూడా తడబడ కుండా గ్రంథస్తవాక్యాల్నే చెప్పారు. అప్పుడు రామానుజులు కూరేశుల ఏకసంథాగ్రాహిత్వానికి ఆశ్చర్యపడ్డారు.

ఒక మంచిరోజున రామానుజులు శ్రీభాష్యాన్ని చెప్పుచుండగా కూరత్తాళ్వాన్ లేఖకులుగా ఉండి శ్రీభాష్యాన్ని పూర్తిచేశారు.

## గురుప్రాణ రక్షణం

చోళరాజ్యాన్ని కులోత్తుంగచోళుడనే రాజు పాలించే వాడు. అతడు శైవుడు. ఈయన ఆంతరంగికుడైన "నాలూరాన్", రామానుజులచే శైవమతాన్ని అంగీకరింపచేస్తే మిగిలినవారంతా వారి మార్గాన్నే అనుసరిస్తారని చెప్పాడు. రాజు రామానుజులను పిలుచుకురమ్మని భటుల్ని పంపగా భటులు ఆశ్రమానికి వెళ్లారు. తన గురువర్యులకు రానున్న ఆపద గ్రహించి వారు స్నానార్థం సమీపంలోని కొలనుకు వెళ్లి ఉండుటవల్ల కూరేశులు కాషాయ వస్త్రత్రిదండాలను ధరించి తానే రామానుజులని భటులతో రాజసభకు బయలుదేరారు. రాజు, రామానుజులే అని తలచి "శివాత్పరతరం నాస్తి" (శివునికన్నా గొప్పదైవం లేదు) అని రాసి సంతకం చేయమన్నాడు. కూరేశులు ఆ వాక్యం క్రింద "ద్రోణమస్తి తతః పరం" అని రాసి సంతకం చేశారు.

'శివ' 'ద్రోణ' శబ్దాలకు రెండర్థాలున్నాయి. ఈ పదాలు రెండు కొలత పాత్రల్ని కూడా బోధిస్తాయి. 'శివునికంటే పరదైవం లేదు' అని వ్రాయమని రాజు కోరగా 'శివ' శబ్దానికి కొలతపాత్ర అనే అర్థంలో శివం కంటే పెద్దపాత్ర లేదనుట తప్పు. ద్రోణం (కుంచం వంటిది) అనే పెద్దపాత్ర ఉంది అనే అర్థం వచ్చేలా వాక్యాన్ని పూరించాడు.

ఆలస్యంగా ఈ అర్థాన్ని గ్రహించిన రాజు కోపంతో వీరి నేత్రాలను పీకేవేయమని భటులను ఆజ్ఞాపించాడు. అప్పుడు కూరేశులు పాపాత్ముడైన నిన్ను చూసిన నేత్రాలతో నా గురువుని, స్వామిని చూడ లేనని తానే తన నేత్రాలను పీకేశారు. ఆ తరువాత శ్రీరంగం వైపు ప్రయాణిస్తూ నేత్రబాధను ఓర్వలేక భగవంతుణ్ణి కీర్తిస్తూ బయలుదేరారు.



ఇట్లు శ్రీరంగానికి ప్రయాణమైన కూరేశులు నేత్రబాధ మనోవ్యధలు జ్ఞప్తికిరాకుండా ఉండడానికి భగవంతుణ్ణి స్తుతిస్తూ ఐదు స్తోత్రాలు రచించారు. 1)శ్రీవైకుంఠస్తవం 2)అతి మానుషస్తవం 3)సుందరబాహుస్తవం 4)వరదరాజస్తవం 5)శ్రీస్తవం అనే ఈ ఐదు స్తోత్రాలు అత్యంత గంభీరమైన స్తోత్రాలుగా వెలుగొందుతున్నాయి.

వరదరాజస్తవం రచించేటప్పుడు స్వామి ప్రత్యక్షమై కావలసింది కోరుకొమ్మనగా నేత్రాల్ని కాంక్షించకుండా చోళ రాజసభలో ఉన్న నాలూరాన్ అనే వైష్ణవునికి మోక్షాన్ని ప్రార్థించిన మహానుభావులు శ్రీకూరేశమిశ్రులు.

## పరమపదప్రాప్తి

ఒకనాడు శ్రీరామానుజాచార్యులు తిరువాయ్‌మొళిని చెపుతున్నారు. ఆ సందర్భంలో "పరమపదానికి ముందు వేంచేసినవారు తర్వాత వేంచేసేవారిని ఉపచరిస్తారు" అనే అర్థం వచ్చే పాశురాన్ని విని రామానుజుల తరువాత తాను పరమపదానికి పోతే వారు తనకు ఉపచరించాల్సి ఉండునని తలచి ముందుగా తనే పరమపదానికి వెళ్లాలని నిశ్చయించుకుని రంగనాథుని సన్నిధికి వెళ్లి ప్రార్థించారు. అప్పుడు శ్రీరంగ నాథుడు "కూరేశా! నీకు, నీకు సంబంధించిన వారికి, వారికి సంబంధించినవారికి గూడా తప్పక పరమపదం లభిస్తుంది, అని మోక్షం అనుగ్రహించారు."

ఈ విషయం తెలుసుకున్న రామానుజులు కూరేశులు లేరని కొంత బాధపడ్డా కూరేశుల సంబంధంతో తమకు కూడా మోక్షం లభిస్తుందని చాలా ఆనందపడ్డారు. అంతటి ఉత్త మోత్తమ ఆచార్యులు శ్రీకూరత్తాళ్వాన్లు.

**108 దివ్యదేశాలు**

# తిరుక్కోళూరు

## (నవతిరుపతులు - 7)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

నమ్మాళ్వారుల ఆళ్వార్ తిరునగరికి రెండుమైళ్లదూరంలో విత్తన్ కోయిల్ అనే దివ్యనామంతో, మూడెకరాల విస్తీర్ణంలో, తూర్పు దిక్కును చూస్తూ, రెండు ప్రాకారాలతో, ఒక గోపురంతో, ప్రకృతి రామణీయకతతో ఈ దివ్యదేశం వెలసి ఉంది. 'కోళ్' అనే శబ్దానికి 'మంచి నియమం కలవాడు', 'తిరు' అనే శబ్దానికి 'సంపద' లేక 'నిధి' అని అర్థం. అలాంటి నిధిని పొందిన భగవంతుడు వేం చేసి ఉన్న ఊరు 'తిరుక్కోళూరు'.

### స్థలపురాణం

ఆదిదంపతులు ఏకాంతంలో ఉండగా శివభక్తుడైన కుబేరుడు కైలాసంలో ప్రవేశించాడు. పార్వతీదేవి సౌందర్యాన్ని చంచలదృక్పథంతో వీక్షించాడు. కుబేరుని ఈ నీచకృత్యానికి కోపగించిన కైలాసనాయకి "నన్ను చూచిన కన్నులలో ఒక కన్ను నశించుగాక! నీ దేహం వికారాన్ని పొందును గాక! నీ నవ నిధులు నిన్ను విడిచిపెట్టు గాక!" అని శపించింది. కుబేరుడు పార్వతీదేవి పాదాలపై పడి క్షమించమని కోరగా, ఆమెకు జాలి కలిగింది. తామ్రపర్ణినదిలో స్నానంచేసి, ఈ దివ్యక్షేత్రంలోని స్వామివారిని సేవిస్తే, ఆయన కృపాకటాక్షాల వల్ల నవనిధులు తిరిగి దక్కుతాయని చెప్పింది.



కుబేరుడు కూడా జగన్మాత చెప్పిన విధంగా తామ్రపర్ణీ నదిలో స్నానం చేసి, అక్కడ వేంచేపు చేసిన భగవంతుణ్ణి గూర్చి కఠోరతపస్సు చేశాడు. ఆ తపస్సుకు భగవంతుడు మెచ్చి, "నీకు పార్వతీదేవి ఇచ్చిన శాపం అందరికీ గుణపాఠం" అని చెప్పి నవనిధులలో ఒక భాగం మాత్రమే కొలిచి ఇచ్చాడు. ఆ సంపద కొలిచిన పాత్ర (కుంచం)ను స్వామి దిండుగా పెట్టుకుని భక్తుల్ని అనుగ్రహిస్తున్నారు.

కుబేరునికి శాపవిమోచనం కలిగించిన స్వామి వైత్తమా నిధిగా ఈ క్షేత్రంలో పూజలందుకుంటున్నారు. ఎవరైతే ఈ స్వామిని కొలుస్తారు, సేవిస్తారు వాళ్లు తమ శాపాల్ని పోగొట్టుకుని భగవంతుని అనుగ్రహంతో తరిస్తారు.

ఈ దివ్యక్షేత్రం మధురకవి ఆళ్వారు అవతార స్థలం కూడా!

| | | |
|---|---|---|
| స్వామివారు | : | మూలవరులు: వైత్తమానిధి పెరుమాళ్<br>ఉత్సవమూర్తి: నిక్షిప్తవిత్తన్ |
| అమ్మవారు | : | మూలవరులు: కోళూర్‌వల్లి నాచ్చియార్<br>ఉత్సవమూర్తి: కుముదవల్లి |
| పుష్కరిణి | : | కుబేరతీర్థం |
| విమానం | : | శ్రీకరవిమానం |
| ప్రత్యక్షం | : | కుబేరునకు, మధురకవి ఆళ్వార్ |
| ముఖము/స్థితి | : | తూర్పు/ భుజంగశయనం |
| మంగళాశాసనం | : | నమ్మాళ్వార్ |



# శివతాండవం

– డా॥ నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి

శ్లో॥ విస్తారశాలి కనకాచల బీజకోశ
చక్రస్య నృత్తవలనాసు సహస్ర సంఖ్యైః
పుల్లజ్జపారుణ తలైర్భువనారవింద
కోశస్యపత్ర పటలాయితమస్యహస్తైః ॥ (హరవిజయం)

శివతాండవాన్ని గూర్చి ఈ శ్లోకంలో రమణీయంగా వర్ణించబడింది. శివుడు ఆనందపరవశుడై నాట్యంచేస్తున్నాడు. ఈ సమస్తవిశ్వం ఒక పెద్ద తామరపువ్వులా ఉందిట. తామర పువ్వు మధ్యలో విత్తనాలకోశం ఉంటుంది. మరి ఇక్కడ అలాంటిది ఏదంటే చాలా విశాలంగా ఉన్న మేరుపర్వతం ఆ బీజకోశమట. ఈ మహావిశ్వానికి మధ్యలో మేరుపర్వతం ఉంటున్నదని పురాణాలు చెబుతున్నాయి. ఈ మహావిశ్వం మధ్యలో నిలబడి శివుడు తాండవం చేస్తూ బలంగా పొడవుగా ఉన్న తన వేయి చేతులను త్రిప్పుతున్నాడు.



అతని అరచేతులు విచ్చిన జపాకుసుమంలా ఎర్రగా ఉన్నాయి. అందుకే లలితాదేవి జపాపుష్పకాంతితో ఉంటుందని వర్ణించబడింది. **"జపాపుష్ప నిభా కృతిః"** అని లలితాసహస్ర నామంలో ఉంది. సూర్యుడు ఎర్రగా ఉండటం వల్ల జపాకుసుమంలా ఉన్నాడని **"జపా కుసుమ సంకాశం కాశ్యపేయం మహా ద్యుతిమ్"** అని వర్ణించబడ్డాడు. **"జపాకుసుమ భాసురాం జపవిధౌ స్మరామ్యంబికామ్"** అని అమ్మవారు ఎర్రగా ఉంటుందని ధ్యానశ్లోకంలో ఉంది. **"జపాపుష్పచ్ఛాయా తవ జనని జిహ్వాజయతి సా"** అని సౌందర్యలహరిలో శంకరులు అమ్మవారి నాలుక జపాపుష్పకాంతితో ప్రకాశిస్తుందని వర్ణించారు.

**"జపాకుసుమ సంకాశౌ మదాఘూర్ణిత లోచనౌ
జగతః పితరౌవందే భైరవీ భైరవాత్మకౌ"**

అని తంత్రాలలో భైరవీ భైరవులు జపాపుష్పకాంతితో ప్రకాశిస్తూ ఉంటారని వారు జననీజనకులని వర్ణించబడింది. కనుక జపాపుష్పంలాంటి శివుని ఎర్రని అరచేతులు విశ్వం నలువైపులకు వ్యాపించి ఉంటే అవి తామరపువ్వురేకులవలె ఉన్నాయట. ఇది అద్భుతమైన వర్ణన. కువలయానందంలోని ఉదాహరణ శ్లోకంలో పగటిని తామరపువ్వులా వర్ణించాడు ఒక కవి. ఇక్కడ విశ్వాన్ని తామరపువ్వని వర్ణించడం విశేషం. ఇక్కడ వేయిచేతులు అంటే వెయ్యనేకాదు. అనేకమని అర్థం. **"సహస్రాణి సహస్రశః"** అనే రుద్రమంత్రంలో **సహస్రాణి = అనేక సహస్ర సంఖ్యాకాని** అని భాష్యం కనుక సహస్రం అంటే వేయి అని కాక అనేక వేలని (అనంతం) అర్థం.

శివుడు నృత్యం చేస్తున్నాడు. అంటే తాళం, లయతో కూడిందని అర్థం. అలాంటి శివునికి నమస్కరిస్తూ పై శ్లోకాన్నే మారేడు దళంగా భావించి సమర్పిద్దాం!!



పశ్చిమ బెంగాల్‌లో అవివాహితలు మంచి భర్త కోసం శివరాత్రి రోజున తారకేశ్వర్‌లో ప్రార్థనలు చేస్తారు



# శివ పంచాక్షరీస్తోత్రమ్

నాగేంద్రహారాయ త్రిలోచనాయ
భస్మాంగరాగాయ మహేశ్వరాయ,
నిత్యాయ శుద్ధాయ దిగంబరాయ
తస్మై 'న' కారాయ నమశ్శివాయ 1

మందాకినీసలిల చందన చర్చితాయ
నందీశ్వర ప్రమథనాథ మహేశ్వరాయ,
మందారపుష్ప బహుపుష్పసుపూజితాయ
తస్మై 'మ' కారాయ నమశ్శివాయ 2

శివాయ గౌరీవదనాబ్జ బృంద
సూర్యాయ దక్షాధ్వరనాశకాయ,
శ్రీనీలకంఠాయ వృషధ్వజాయ
తస్మై 'శి' కారాయ నమశ్శివాయ 3

వసిష్ఠ కుంభోద్భవ గౌతమాది
మౌనీంద్ర దేవార్చిత శేఖరాయ,
చంద్రార్క వైశ్వానరలోచనాయ
తస్మై 'వ' కారాయ నమశ్శివాయ 4

యక్షస్వరూపాయ జటాధరాయ
పినాక హస్తాయ సనాతనాయ,
దివ్యాయ దేవాయ దిగంబరాయ
తస్మై 'య' కారాయ నమశ్శివాయ 5

పంచాక్షర మిదం పుణ్యం యః పఠేత్ శివసన్నిధౌ,
శివలోక మవాప్నోతి శివేన సహ మోదతే.

ఇతి శ్రీమచ్ఛంకరాచార్య విరచిత శివపంచాక్షరస్తోత్రం సంపూర్ణమ్.



# శివాష్టకమ్

తస్మైనమః పరమకారణకారణాయ
దీప్తోజ్జ్వల జ్వలిత పింగళ లోచనాయ,
నాగేంద్ర హార కృత కుండల భూషణాయ
బ్రహ్మేంద్ర విష్ణు వరదాయ నమశ్శివాయ 1

శ్రీమత్ప్రసన్న శశిపన్నగ భూషణాయ
శైలేంద్రజా వదన చుంబితలోచనాయ,
కైలాస మందర మహేంద్ర నికేతనాయ
లోకత్రయార్తి హరణాయ నమశ్శివాయ 2

పద్మావదాత మణికుండల గోవృషాయ
కృష్ణాగరుప్రచుర చందన చర్చితాయ,
భస్మానుషక్త వికచోత్పల మల్లికాయ
నీలాబ్జకంఠ సదృశాయ నమశ్శివాయ 3




లంబత్ సపింగళ జటా మకుటోత్కటాయ
దంష్ట్రాకరాళ వికటోత్కట భైరవాయ,
వ్యాఘ్రాజినాంబరధరాయ మనోహరాయ
త్రైలోక్యనాథ నమితాయ నమశ్శివాయ 4

దక్షప్రజాపతి మహామఖ నాశనాయ
క్షిప్రం మహాత్రిపుర దానవ ఘాతనాయ,
బ్రహ్మోర్జితోర్ధ్వగ కరోటి నికృంతనాయ
యోగాయ యోగనమితాయ నమశ్శివాయ 5

సంసార సృష్టి ఘటనా పరివర్తనాయ
రక్షః పిశాచ గణసిద్ధ సమాకులాయ,
సిద్ధోరగ గ్రహ గణేంద్ర నిషేవితాయ
శార్దూలచర్మవసనాయ నమశ్శివాయ 6

భస్మాంగరాగ కృతరూప మనోహరాయ
సౌమ్యావదాత వనమాశ్రిత మాశ్రితాయ,
గౌరీకటాక్ష నయనార్ధ నిరీక్షణాయ
గోక్షీర ధార ధవళాయ నమశ్శివాయ 7

ఆదిత్య సోమ వరుణానిల సేవితాయ
యజ్ఞాగ్నిహోత్ర వరధూమ నికేతనాయ,
ఋక్సామవేదమునిభిః స్తుతిసంయుతాయ
గోపాయ గోపనమితాయ నమశ్శివాయ 8

శివాష్టక మిదం పుణ్యం యః పఠేత్ శివసన్నిధౌ,
శివలోక మవాప్నోతి శివేన సహ మోదతే.

ఇతి శ్రీమచ్ఛంకరాచార్య విరచితం
శివాష్టకం సంపూర్ణమ్.



# విశ్వనాథాష్టకమ్



గంగాతరంగ రమణీయ జటాకలాపమ్
గౌరీ నిరంతర విభూషిత వామభాగమ్,
నారాయణప్రియ మనంగమదాపహారం
వారాణ సీపురపతిం భజ విశ్వనాథమ్ 1

వాచామగోచర మనేకగుణస్వరూపం
వాగీశ విష్ణు సురసేవిత పాదపీఠమ్,
వామేన విగ్రహవరేణ కళత్రవంతం
వారాణ సీపురపతిం భజ విశ్వనాథమ్ 2

భూతాధిపం భుజగభూషణ భూషితాంగం
వ్యాఘ్రాజినాంబరధరం జటిలం త్రినేత్రమ్,
పాశాంకుశాభయ వరప్రద శూలపాణిం
వారాణ సీపురపతిం భజ విశ్వనాథమ్ 3

శీతాంశుశోభిత కిరీట విరాజమానం
ఫాలేక్షణానల విశోషిత పంచబాణమ్,
నాగాధిపారచిత భాసుర కర్ణపూరం
వారాణ సీపురపతిం భజ విశ్వనాథమ్ 4

పంచాననం దురితమత్తమతంగజానాం
నాగాన్తకం దనుజపుంగవ పన్నగానామ్,
దావానలం మరణశోకజరాటవీనాం
వారాణ సీపురపతిం భజ విశ్వనాథమ్ 5

తేజోమయం సగుణనిర్గుణ మద్వితీయం
ఆనందకంద మపరాజిత మప్రమేయమ్,
నాగాత్మకం సకలనిష్కల మాత్మరూపం
వారాణ సీపురపతిం భజ విశ్వనాథమ్ 6

రాగాదిదోషరహితం స్వజనానురాగం
వైరాగ్య శాంతినిలయం గిరిజాసహాయమ్,
మాధుర్యధైర్యసుభగం గరళాభిరామం
వారాణ సీపురపతిం భజ విశ్వనాథమ్ 7

ఆశాం విహాయ పరిహృత్య పరస్యనిందాం
పాపే రతిం చ సునివార్య మనస్సమాధౌ,
ఆదాయ హృత్కమలమధ్యగతం పరేశం
వారాణ సీపురపతిం భజ విశ్వనాథమ్ 8

వారాణసీ పురపతేః స్తవనం శివస్య
వ్యాఖ్యాత మష్టక మిదం పఠతే మనుష్యః,
విద్యాం శ్రియం విపుల సౌఖ్య మనన్తకీర్తిం
సంప్రాప్య దేహవిలయే లభతే చ మోక్షమ్ 9

విశ్వనాథాష్టక మిదం యః పఠేత్ శివసన్నిధౌ,
శివలోక మవాప్నోతి శివేన సహ మోదతే.






వైకుంఠఏకాదశి పర్వదినాన్ని (30-12-2025) పురస్కరించుకుని కలియుగ వైకుంఠమైన తిరుమల నిజవైకుంఠాన్ని తలపించింది. ఆ రోజు వేకువజాము నుంచే ప్రముఖుల నుండి సామాన్య భక్తుల వరకు స్లాట్లవారీగా క్యూలోకి వెళ్లి వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆ రోజు ఉదయం స్వర్ణరథంపై నాలుగుమాడవీథుల్లో నేత్రపర్వంగా ఊరేగారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమలలో ప్రత్యేక అలంకరణలు చేశారు. వైకుంఠద్వాదశి (31-12-2025)రోజున స్వామివారి పుష్కరిణిలో శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం నిర్వహించారు.

















# 'భస్మం' ధరిస్తే బ్రతుకు బంగారమే!

– బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుశర్మ

విభూతిధారణ అనేది దేనికోసం చేయాలి? పూజచేసే టప్పుడు మనం ఒకరకమైన విధానానికి సిద్ధమై పూజాగృహంలో ప్రవేశించాలి. పూజామందిరంలోకి ప్రవేశించేముందు పూజకు కావలసిన ఉపకరణాలనన్నిటిని ముందుగా సిద్ధం చేసుకోవడం చాలా ముఖ్యం. పూజామందిరంలోకి వైదికమైన దుస్తులు వేసు కుని వెడతాం. వేషానికి బాహ్యచిహ్నానికి శౌచానికి భగవంతుని యందు మనస్సు రమించడానికి ఒక దగ్గర సంబంధం ఉంది. పూజామందిరంలో పూజకు ప్రవేశించే ముందు ఒక విషయాన్ని మనసులో పెట్టుకుని కూర్చోవాలి. పూజచేసే విగ్రహాలు ఎక్కడ కొని తెచ్చిందీ, లేక ఎవరు వాటిని బహూకరించింది అనే విషయాలకు సంబంధించిన భావనలతోటి మీరు ఉండ కూడదు. మీ ఇంట మీరు ఎక్కడ ఈశ్వరుడిని కూర్చోబెట్టి ఉంచారో దాన్ని 'సింహాసనం' అని పిలవాలి. అది ఇంటికి ఈశాన్యంలో ఉండాలి. సింహాసనంలో మీ ఇష్టం వచ్చిన వారిని పెట్టే అధికారం మీకు లేదు. మీ ఇష్టం వచ్చినట్టు మీరు పూజ చెయ్యడానికి వీలుండదు. మీ ఇంటికి పూర్వాచారంగా మొట్ట మొదటినుంచి సంప్రదాయసానుసారంగా వంశంలో కుల దేవతగా ఎవరున్నారో వారిని మాత్రమే అర్చన చెయ్యాలి. మిగిలినవారు ఎవరైనాసరే వారికి పరివారదేవతలు అవుతారు. లేదా "వీరందరి అనుగ్రహంతో నేను వారిని చేరుతున్నాను అనాలి". అథవా వారే వీరి స్వరూపంలో ఉన్నారు అనాలి. అప్పుడు మీకు అభేదభావం వస్తుంది. శివుడిని పూజచేసేటపుడు సాకారంగ చెయ్యాలా! లేక లింగరూపిగా చెయ్యాలా? శివుడిని లింగరూపిగానే మనం సాధారణంగా పూజచేస్తాం. శివుడు సాకారంగా ఉన్న దేవాలయాలు చాలా తక్కువ. శివలింగాలుగానే ఉంటాయి. కామ్యం కోసం పూజచేస్తే లేదా అర్చన చేస్తే కలియుగంలో ఎలాంటి శివలింగాన్ని ఆరాధన చేయాలి? కృతయుగంలో అయితే రత్నాల చేత తయారుచేయబడ్డ లింగాన్ని ఆరాధన చేసేవారు. త్రేతా యుగంలో బంగారంతో చేయబడిన శివలింగాన్ని ఆరాధన చేశారు. ద్వాపరయుగంలో పాదరసంతో చేయబడ్డ లింగానికి పూజచేసే వారు. కలియుగంలో అయితే పార్థివలింగాన్ని ఆరాధన చేయాలి. అంటే మట్టితోచేసిన శివ లింగాన్ని ఆరాధన చేయాలి. ఆరాధన చేసేటపుడు శౌచంతో పూజామందిరప్రవేశం జరిగి మీ మనస్సు బాగా నిలబడుట కోసం భస్మాన్ని మూడుగీతలుగా లలాటమందు పెట్టుకోకుండా పూజచేయవద్దు. శివలింగం మీద ఆజ్ఞాచక్రం మీద బొటన వేలితో బొట్టుపెట్టే అధికారం ఒక్క గురువుకు మాత్రమే ఉంటుంది. స్త్రీలైనా, పురుషులైనా లలాటమందు విభూతిని మూడుగీతలుగా మాత్రమే పెట్టుకోవాలి. విభూతిని పెట్టుకోకుండ ఉండరాదు. రుద్రాక్షమాల వేసు కోకుండా పూజచేయరాదు. బిల్వపత్రం లేకుండా పూజ చేయడం అంత మంచిది కాదు. బిల్వపత్రాలను కొన్ని రోజులపాటు నిలవచేసి పూజచేసు కోవచ్చు. ఇలా ఈ మూడింటితో పూజచేయాలని పండితులైనవారు, జ్ఞాన మున్నవారు, భక్తి కలిగినవారు తాపత్రయపడుతూ ఉంటారు. కాబట్టి ఇవి తప్పకుండా ఉండాలి. ఎప్పుడైతే ఆచమనం చేసి పూజచేసే అధికారం సిద్ధించిందో అప్పుడు

ఆయన మెడలో రుద్రాక్షమాల పడాలి. అపుడు పూజచేయడానికి కావలసిన అర్హత ప్రకాశిస్తుంది. ఆ నామోచ్చారణ చేయడానికి, ఆచమనం చేయడానికి అధికారం తనంత తానుగా సిద్ధిస్తుంది.

ఇప్పుడు మీరు పూజామందిరంలో శివనామం చెపుతారు. శాస్త్రంలో శివనామం గంగ. విభూతి యమున. రుద్రాక్ష సరస్వతి. ఇప్పుడు ఒక గొప్ప శివభక్తుడు ఉన్నాడను కోండి. ఆయన లలాటంలో త్రిపుంద్రాలను ధరించిన వాడై బొట్టుపెట్టుకుని మెడలో రుద్రాక్షమాలలు వేసుకుని శివపూజ పూర్తిచేసి బయటకు వచ్చాడు. అలా బయటకు వచ్చిన వ్యక్తిని ఒకాయన పూజామందిరంలోంచి బయటకురాగానే చూశాడు. ఆయన పూజ ఎంత బాగా చేశాడన్నది పక్కనపెడితే, అలా శివ పూజ చేసి బయటకురాగానే ఆ వ్యక్తిని ఎవరైనా చూస్తే త్రివేణీ సంగమస్నానాన్ని చేసిన ఫలితాన్ని ఆయన ఖాతాలో వేస్తారు. ఈ మూడింటిని శరీరం మీద వేసుకుని ఉండడం వల్ల అంత గొప్పతనం కలుగుతుంది. నుదుటి మీద పెట్టుకుంటున్న భస్మాన్ని ఎలాబడితే అలా పెట్టుకోకూడదు. శాస్త్రనియమం ప్రకారం మీరు నిద్రలేచిన తరువాత స్నానం అయేవరకు యథార్థానికి పచ్చిగంగ కూడా త్రాగరాదు. అయితే కొన్నికొన్ని కారణాలచేత కొంతమంది స్నానంచేయకుండా నీటిని త్రాగాల్సి రావచ్చు. ఒకవేళ అలా తీసుకుంటే ఆ పాపం గాయత్రిచేత సాధ్యమైనంత తొందరగా పోతుంది అని చెప్పబడింది. గాయత్రికి అధికారం లేనివారు తమ ఇష్టదేవతా నామం చెప్పి పూజచేసుకోవాలి. విభూతిధారణ చేసేవారు స్నానం చేయకుండా ఎక్కడికో అత్యవసరంగా వెళ్లవలసి వచ్చిన సందర్భంలో వారు పొడి విభూతిని తీసుకుని లలాటమందు ధరించవచ్చు. పొడి విభూతిని పెట్టుకుని వెళ్లడం వెనుక ఒక రహస్యం ఉంది. శరీరం స్నానం చెయ్యలేదు. అందుకని అశౌచంతో ఉంది. స్నానం చెయ్యనంత వరకు శరీరానికి అశౌచం ఉంటుంది. అశౌచంతో ఉన్న శరీరం తొందరగా వ్యగ్రత కలిగిన ప్రాణుల చేత ఆవహింపబడుతుంది. అలా కాకుండా ఉండాలంటే రక్షణహేతువు ఉండాలి. అందుకని విభూతి పెట్టుకోవాలి.

విభూతిధారణం వైదికం. బ్రహ్మన్ని తెలుసుకోవాలన్నవాడు, కొన్నికొన్ని ఫలితాల్ని పొందాలని అనుకున్నవాడు, ఈశ్వరారాధకుడు కావాలనుకున్నవాడు ఎవ్వరైనా భస్మధారణ చేయవచ్చు. స్త్రీలు, పురుషులు, పిల్లలు ఎవ్వరైనాసరే అందరికి భస్మధారణ చేసే అధికారం ఉంది. స్నానం చెయ్యకుండా వెడుతున్నా పొడి విభూతిని పెట్టుకుని వెళ్లవచ్చు. తడి విభూతిని పెట్టుకోకూడదు. స్నానంచేస్తే పూజచేసుకునేముందు విభూతిని పొడిచేసి ఎడమచేతిలో వేసుకుని దాంట్లో రెండు మూడు నీటి చుక్కలు వేసుకోవాలి. నీటిచుక్కలువేసి ఇప్పుడు ఆ ఎడమచేతిలో వేసిన విభూతి మీద కుడిచేతిని మూతపెట్టాలి. మూతపెట్టి మాహాత్మ్యాన్ని గురించి శబ్దశక్తిచేత మీరు దాన్ని అనుసంధానం చెయ్యాలి. ఎలా?

భూతింభూతకరీ పవిత్రజననీ పాపౌఘవిధ్వంసనీ
సర్వోపద్రవనాశనీ శుభకరీ సర్వార్థసంపత్కరీ
భూతప్రేతపిశాచరాక్షసగణారిష్టారి సంహారిణీ
తేజోరాజ్యవిశేషమోక్షలహరీ విభూతిస్సదాభార్యతామ్.

అని చెప్పాలి. ఇది సమస్తపాపాలను పోగొడుతోంది. ఇది మీ శరీరానికి అలది ఉండగా భూతప్రేతపిశాచరాక్షస గణాలు మీ ఇంట ప్రవేశించలేవు. అందుకే ఒక్కొక్కమహాత్ముడు ఇంట్లో తిరుగుతుంటే ఆయన విభూతి ప్రకాశించినంతమేర ఉగ్ర గణాలు ప్రవేశించవు. అది తేజస్సును ప్రసాదిస్తుంది. అది విశేషమైన ఐశ్వర్యాన్ని ఈయగలదు. మోక్షాన్ని ఇవ్వగలదు. కనుక "నేను ఈ విభూతిని దర్శిస్తున్నాను" అని చెప్పి తీసుకోవాలి. ఇలా కాకపోతే విభూతిధారణకు ప్రత్యేకమంత్రాలు ఉన్నాయి.

విభూతి ధారణకు చాల తేలికైన మార్గం ఒకటి ఉంది. కుడిచేతిని ఎడమచేతి మీదవేసి

శ్రీకరంచ పవిత్రంచ రోగశోక నివారణం ।
లోకే వశీకరం పుణ్యం భస్మత్రైలోక్య పావనమ్ ॥

అని చెప్పాలి. "దీని ధారణ చేత నాకు ఐశ్వర్యం కలుగుతోంది. ఇది నన్ను పవిత్రుడిని చేస్తోంది. ఇది నాకు రోగాలు రాకుండ, దోషాలు పట్టకుండా నాకు నివారణ చేస్తోంది. లోకం వశం అయ్యేటట్టుగా చేస్తోంది. ఇది నాకు పుణ్యాన్ని ఇస్తోంది. పరమపావనమైన ఈ భస్మాన్ని నేను ధరించుచున్నాను". ఇదేదో వశీకరణవిద్యలాంటిదని అనుకోకూడదు. లోకం యథార్థస్థితి మీకు భాసిస్తుంది.

ఒకవేళ ఈ మంత్రం రాకపోతే కనీసంలో కనీసం 'శివా శివా శివా' అని మూడుమార్లు అనాలి. అలా మూడు మార్లు శివా అని అంటే మంగళం, శోభనం, భద్రం, క్షేమం, కల్యాణం అన్నిటినీ మీరు అడిగినట్టు అవుతుంది.

విభూతిని తీసి మూడు వేళ్లతో పెట్టుకుంటుంటారు. అలా విభూతిధారణ చేయరాదు. శాస్త్రంలో అది దోష



భూయిష్ఠం. మనల్ని ఎప్పుడూ లోకంలో రెండు వేరుచేసి చూపిస్తుంటాయి. అందులో మొట్టమొదటిది కన్ను. దాని అమరికే అంత. అది ఎదుటమనిషిని చూడగానే 'ఆయన ఫలానా వ్యక్తి, నేను ఫలానావాడిని' అని మన ఉనికిని తెలియజేస్తుంది. అనగా ఎదుటవ్యక్తి నుండి మనల్ని వేరుచేస్తుంది. కన్ను ఎప్పుడూ రెండుగా చెపుతుంది. ఆ రెండూ ఒకటే అని నేత్రం చెప్పదు. అది దాని తప్పుకాదు. అది దాని లక్షణం. అది మాంసనేత్రం. మాంసనేత్రము అయిన కారణంచేత చూడబడుతున్న వస్తువు వేరు– చూస్తున్న వస్తువు వేరు అంటుంది. అంతేకాని తానూ ఎదుటివ్యక్తి ఒకటే అని ఈ కన్ను చెప్పదు. ఈ కన్ను చూపించే వస్తువులను వేరుగా చూపించి చెపుతుంది. ఈ కన్నుచూసిందల్లా "ఇది నేను కాదు" అని అంటుంది. కాదనుకునే కన్నుచేత చూడబడ్డ మనోభావనను చేతివేలు వేరుచేసి చెపుతుంది. రజోగుణం, వ్యగ్రత వేర్పాటు రెండిటిని చూచుట చేతిచూపుడు వేలి మనోభావన. రజోగుణ, తమోగుణ భావాలన్నీ ఈ వేలితోనే ప్రకటితమౌతాయి. అందుకే పూజలో చేతిచూపుడువేలును ఉపయోగించడం నిషిద్ధం. అలాంటి వేలును విభూతిధారణలో ఎలా ఉపయోగిస్తారు? కుదరదు కదా! అందుకని నీటిలో భస్మం తడిపి మృగముద్ర పట్టమని శాస్త్రం చెప్పింది. మృగ ముద్రను జాగ్రత్తగా పరిశీలిస్తే అది ఏ లేడో జింకో కొమ్ములతో నిలబడ్డట్టుగా మీకు కనపడుతుంది. మూడువేళ్లు కలుస్తాయి. రెండువేళ్లు నిలబడతాయి. ఇప్పుడు తడిభస్మంలో ముందుగా మధ్యవేలును ఉంగరపువేలును ముంచుతారు. తరువాత బొటనవేలును ముంచుతారు. ముంచిన తరువాత కుడిచేతివైపు నుండి ఎడమచేతివైపుకి బొటనవేలు పట్టగలిగినంత దూరాన్ని విడిచిపెట్టి నుదుటి మీద ప్రయాణం చెయ్యాలి. అప్పుడు బొటనవేలికి సజలవిభూతి ఉంది కదా– ఆ రెండువేళ్లగీసిన విభూతిరేఖల మధ్యలోంచి విభూతితో కూడిన బొటనవేలును లలాటం మీదరాస్తూ వెనక్కి తీసుకురావాలి. దీన్ని 'శాస్త్రోక్త విభూతిధారణం' అంటారు.

భస్మధారణం అనేది మనుష్యుని జీవితాన్ని కొత్తదారికి తిప్పగలిగిన ఒక విశేషం. మనకు వాసనలు కొన్ని జన్మల నుండి తరుముకు వస్తాయి. అనగా మనస్సు ఒక సుఖానికి అలవాటు పడిపోయి ఉంటుంది. కొంతమందికి తాము చేసేది తప్పు అని, అది వ్యసనమని, అలా చేయడం చాల హేయమైన విషయమని వారికి తెలుసు. అలాంటి వ్యసనం జీవులను ఎప్పుడూ పాడుచెయ్యాలని చూస్తుంది. అలా మనల్ని పాడు చెయ్యాలని చూసే వాసనను మనం అధిగమించగలగాలి. ఇలా అధిగమించడానికి వీలుగా ఈశ్వరుడు ఒక్క మనుష్యజన్మలో మాత్రమే మనకు బుద్ధి అనే దాన్ని ఇచ్చాడు. ఇతరప్రాణులకు అలాంటి బుద్ధి లేదు. బుద్ధి అంటే వాసనాబలాన్ని గెలిచే ప్రయత్నాన్ని చేయడం. మీకు తెలిసో, తెలియకో భస్మధారణ చేస్తున్నారు. అది శివచిహ్నం. శంకరుడు భస్మం పెట్టుకున్నాడు కదా! 'శివ' అని అన్నప్పుడు దానిని పరబ్రహ్మంగా గుర్తు పెట్టుకోవాలి. అలాంటి పరబ్రహ్మం సాకారంగా కనబడితే అది విభూతిధారణ చేసి కనపడుతోంది. అనేకమైన దేవతా స్వరూపాలు విభూతిధారణ చేస్తాయి. శాస్త్రంలో చాలామంది దేవతలు విభూతిధారణ చేసి ఉన్నారు. విభూతిధారణ చేస్తే మీకు ఉన్న వాసనాబలాన్ని మీరు గెలవగలిగిన శక్తిని మీకు ఈశ్వరుడు ఇస్తాడు. పాపక్షయం అంటే ఇదే!

శాస్త్రప్రకారం 'భ' భస్మధారణం మీ పాపాలను తీయ గలదు. మీ పాపములే ప్రతిబంధకాలుగా వచ్చి ఈశ్వరుడిని చేరకుండ భోగాల వైపుకి తిప్పేస్తున్నాయి. అధర్మబద్ధమైన భోగాల కోసం వెంపర్లాడుతుంటారు. అలా వెంపర్లాడకుండా చెయ్యగలిగింది 'స్మ' భగవంతుడిని స్మరణలోకి తేగలిగింది. కాబట్టి దానిపేరు 'భస్మ'.

భస్మం రెండురకాలుగా తయారౌతుంది. ఒకటి మహా ప్రళయంలో ఏర్పడే భస్మం. ఆ భస్మం ధరించడానికి మనం ఉండం. ఆ సమయంలో లోకాలన్నీ ప్రళయంలో మునిగి పోతాయి. రెండోది లౌకికమైన భస్మం. ఆవులపేడనుపట్టి జాగ్రత్తగాకాల్చి దాన్ని విభూతిగా తయారుచేస్తే తేలికైన భస్మం తయారౌతుంది. అంతేకాకుండా అది చాలా గట్టిగా ఉంటుంది. ఇలాంటి విభూతి ఉండలు మనకు శ్రీశైలంలో దొరుకుతాయి.

స్వచ్ఛమైన విభూతిని ఆవుపేడను కాల్చి తయారు చేస్తారు. ఎందుకు? ఆవుపేడ సూక్ష్మక్రిములన్నింటిని సంహరించి నేలను మంగళప్రదంగా మార్చి భూతప్రేతపిశాచాదుల వంటివి అక్కడకు వచ్చి కూర్చోలేని స్థితిని కల్పించి అక్కడ పూజచేసు కోవడానికి వీలైన యోగ్యతను సిద్ధింపచేయగలదు. ఒక్క ఆవు పేడకే ఆ శక్తి ఉంది. అందుకే పూర్వం పూజచేయాలంటే ఆవు పేడతో అలికేవారు. అలాంటి ఆవుపేడను కాల్చినపుడు వచ్చిన భస్మం ఏది ఉందో ఆ భస్మం చాలగొప్ప భస్మం. ఆ భస్మాన్ని మనం పెట్టుకుంటాం. అలాగే యజ్ఞగుండంలో యజ్ఞం పూర్ణా హుతి తరువాత దర్భను కాల్చి తీస్తారు. దాన్ని కూడా ధరిస్తారు.

ఇలాంటి భస్మం పాపాలను తీయగలదు. వాసనాబలం చేత చేస్తున్న పాపాలను పోగొడుతుంది. శాస్త్రం భస్మాన్ని ముప్పై రెండుస్థానాల్లో ధరించమని చెప్పింది. అయితే మనం లలాటంలో మాత్రం తప్పనిసరిగా ధరిస్తాం. భస్మాన్ని లలాటం లోనే ఎందుకు ధరించాలి? మనం ఒకమాట చెపుతాం-

బ్రహ్మ నుదుటి మీద రాసిన రాత పోదు అని మనం నమ్ముతాం. కానీ ఆ రాతను పోగొట్టగలశక్తి భస్మానికి ఉంది. నుదుటిమీదపెట్టుకున్న మూడు భస్మరేఖలను 'త్రిపుండ్రాలు' అంటారు.

విభూతికి ఒకమారు పేరు ఉంది. 'విశేషేణ భవతీతి విభూతి'- విశేషంగా ఈయగలిగింది. అలా ఈయబడేదాన్ని మహదైశ్వర్యం అని పిలిచింది శాస్త్రం. విభూతికి మహా దైశ్వర్యం- గొప్ప ఐశ్వర్యమని పేరు. సృష్టి అంతా నామ రూపాలుగా ఉంది. ప్రతివస్తువుకి నామం, రూపం, రంగు అనే మూడుగుణాలు ఉంటాయి. మీరు దేనినైనా ఒకపేరుపెట్టి పిలిస్తే దానికి ఒక రూపం ఉంటుంది. వస్తువు పేరు చెప్పగానే దాని రూపం గుర్తుకు వస్తుంది. ప్రతిపదార్థంలోనూ కంటిని ఆకర్షించే లక్షణాలు మూడు ఉంటాయి. అవే నామం, రూపం, రంగు అనేవి. ఈ మూడూ ఎందులో పడినా పోయే అవకాశం లేదు. ఒక వస్తువు నీటిలో పడితే పాసిపోవచ్చుకానీ అస్తిత్వాన్ని కోల్పోదు. ఒకకర్ర అగ్నిలో పడితే అది కర్ర రూపంలో ముందు కాలిపోతుంది. కర్రకి ఉన్న గోధుమరంగుపోయి నల్లగా అయిపోతుంది. అది ఇంకా కాలిపోతే తెల్లటి భస్మం అయిపోతుంది. ఇప్పుడు కర్రకి నామం లేదు, రూపం లేదు. కర్రకి ఉన్న రంగు లేదు. ఒకమనిషి అగ్నిగుండంలో పడిపోయి నట్లయితే అతనికిగల మూడులక్షణాల్ని పోగొట్టుకుని భస్మం అయిపోతాడు. ఏదిపడిపోతున్నా చివరకు భస్మం అయి పోతోంది. భస్మాన్ని తీసుకువెళ్లి మరొక అగ్నిహోత్రంలో పడేస్తే అది భస్మంగానే ఉంటుంది. అనగా ఏది చిట్టచివర మిగిలి పోతున్న సత్యవస్తువో ఆ సత్యమే భస్మం. ఇపుడు భస్మధారణం చేస్తే సత్యం గోచరిస్తుంది. ఇది భస్మాన్ని లలాటంలోనే ధరించ డానికి కారణం. ఏది సత్యవస్తువో అది సత్యంశివంసుందరం- ఆ సత్యం శివం ఆ శివం సుందరం- అది పరమాత్మ. బుద్ధి దానివైపుకి వెడుతుంది. ఇదివరకు లౌకికంగా ఉన్న బుద్ధి అటు వైపుకి వెడుతుంది. వెడితే లోపల దాన్ని పట్టుకోవడానికి ఉపాసన ప్రారంభమౌతుంది.

భస్మము పవిత్రమైంది. సమస్తదోషాలు పోయినపుడు మాత్రమే ఏదైనా పవిత్రం అవుతుంది. ఏదైనా వస్తువు అగ్నికి తగిలినట్లయితే అది శుద్ధమైపోతుంది. విభూతి అగ్నిసంపర్కం కలిగింది. దాన్ని మీరు ధరిస్తే మీలో జ్ఞానాగ్ని ప్రకాశిస్తుంది. అలా ప్రకాశించడానికి యోగ్యంగా మీరు మీ ఉపాధిని సిద్ధం చేస్తున్నారు. కాబట్టి సత్యాన్ని తెలుసుకోవడానికి దీన్ని మీరు వాడుతున్నారు. ఈ లోకాలన్నీ లయమైపోతే భస్మం మిగులు తుంది: లోకాల నన్నిటిని సృష్టిచేసేటప్పుడు ఈశ్వరుడి దగ్గర మొదటిగా ఉంది భస్మం. ఇపుడు సృష్టి భస్మంలో నుండే ప్రారంభం అవాలి. కాబట్టి ఇపుడు భస్మం అణువులలో సమస్త సృష్టికి సంబంధించిన తేజస్సు నిక్షిప్తమై ఉంది. అది ఈశ్వర సంకల్పంచేత పునఃసృష్టి అవుతుంది. అందుకే మీరు తమిళనాట ఏ దేవాలయానికి వెళ్లినా చేతిలో విభూతి వేస్తారు. పరమైశ్వర్యం అంతా దాంట్లోంచే వస్తోంది.

ఫిబ్రవరి 14న
శనిత్రయోదశి

# ధర్మపరులకు ఈయన అండ ఎప్పుడూ ఉంటుంది!

– డా।। జి. ఆంజనేయులు

గ్రహాలలో ఏడవవాడు శనైశ్చరుడు. అతడు నవ గ్రహాల్లో శక్తిమంతుడు. ప్రభావశాలి. ఆతడు మార్గశీర్షమాసం బహుళనవమి రోహిణీనక్షత్రంలో జన్మించాడు. మకర కుంభరాశులకు ఈతడు అధిపతి. సూర్యుని ధర్మపత్ని సంజ్ఞాదేవి. వైవస్వతుడు, శ్రాద్ధదేవుడు, యమధర్మరాజు, యమునానది అనేవారు సంజ్ఞాసూర్యదేవుల సంతానం. సంజ్ఞ సూర్య భగవానుని తేజస్సు భరించలేక తన ఛాయను ఒక వనితగా సృష్టించి, తనకు బదులుగా పతిదేవుడిని ఆనందింప జేయమని అర్థించి, పుట్టినింటికి వెళ్లింది. ఛాయామార్తాండులకు సావర్ణుడు, శనిమహాత్ముడు జన్మించారు.

పద్మ, స్కాంద, బ్రహ్మాండపురాణాలు శనీశ్వరుణ్ణి గురించి, శనిత్రయోదశిని, స్వామిబాధ్యతలను గురించి వివరించాయి. అతడిది మందగమనం. అతడి వాహనం కాకి. స్వామికి నలుపు, నీలిరంగులంటే ఇష్టం. తిలలు (నువ్వులు), అర్క పత్రాలు (జిల్లేడు ఆకులు) ఇష్టమైనవి. అతడు తైలాభిషేక ప్రియుడు.

దేవతలను, మానవులను, సకలజీవులను సత్య మార్గంలో పయనింపజేయడానికి శనైశ్చరుడు అవతరించాడని పురాణప్రవచనం. సత్యమార్గంలో నడుస్తూ, అహింసను పాటిస్తూ, స్వచ్ఛంగా, నిస్స్వార్థంగా, పవిత్రంగా, ధర్మమార్గంలో నడిచేవారికి శని అండదండలు ఉంటాయి. శుభపరంపరలు కలిగిస్తాడు. ఆతడు నిష్కారణంగా ఎవ్వరినీ పీడించడు. **పూర్వ జన్మలో చేసిన పుణ్యంవల్ల సుఖం, పాపంవల్ల దుఃఖం కలుగుతాయి.** వారు చేసిన కర్మలననుసరించి, వారిని ప్రేరేపించి, కర్మఫలితాలను అనుభవింపజేస్తాడు. అంతేకాని, అందరిని అనవసరంగా బాధించడు. బాధిస్తాడని లోకులు చెప్పుకునే కట్టుకథలు నమ్మరాదు.

దేవతలను, ధర్మాత్ములను అనవసరంగా శనైశ్చరుడు పట్టి పీడించాడని చెప్పడం అవాస్తవం. అనాదిగా ప్రజలకు కష్టనష్టాలు శనిదేవుడు కల్గిస్తున్నా డనేభావం ప్రజల్లో గాఢంగా ఉంది. ఇది తప్పు. శనైశ్చరుణ్ణి దూషిస్తే దేవతలందరినీ దూషించినట్లే. అతని దయ సమస్త దేవతల అనుగ్రహంతో సమానం.

శనికి శనివారం, త్రయోదశి తిథి చాలాప్రియమైనవి. **(త్రయోదశి శనివారం సాయంకాలం ఉండాలి)** నువ్వులు దానమివ్వడం ప్రశస్తం. నలచక్రవర్తి, దశరథ మహారాజు, ధర్మరాజు, పరీక్షితుడు మొదలైన ధర్మాత్ములు ఆపత్కాలాల్లో శనిమహాత్ముణ్ణి సేవించి, తరించారని పురాణకథనాలు. లోహంతో తయారు చేసిన శనిదేవుని ప్రతిమను నువ్వుల నూనె గల పాత్రలో పెట్టి, నల్లని వస్త్రాన్ని దానిపైన కప్పి, నీలి పుష్పాలతో, గంధంతో, తిలలతో, అన్నంతో ఆరాధించి, ఆ ప్రతిమను దానంచేయాలి. కోణస్థ, పింగల మొదలైన శనీశ్వరుని పదినామాలను అశ్వత్థవృక్షం (రావిచెట్టు) క్రింద

## ఈశ్వరుణ్ణి ప్రసన్నం చేసుకోవడం ఎలా?

**పరమేశ్వరుడిని ప్రసన్నం చేసుకోవడం చాలా సులువు. పెద్ద పెద్ద మొక్కులు మొక్కుకో నవసరం లేదు. నోరారా 'శివా!' అని స్మరిస్తూ, చెంబుడు నీరు ఆయన శిరస్సుపై పోసి, చేతి కందిన పత్రిని సమర్పిస్తే చాలు ఆ పరమశివుడు ప్రసన్నుడైపోతాడు. సంతోషంతో ఉప్పొంగిపోయి, కామధేనువును పెరట్లో కట్టేసి, కల్పవృక్షాన్ని ఇంటి ముందు పాతేసి వెళతాడట. ఈ విషయాన్ని ధూర్జటి తన శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యంలో ప్రస్తావించాడు.**





## పిప్పలాదమహర్షికృతశనిస్తోత్రం

నమ స్తే కోణసంస్థాయ, పింగళాయ నమోఽ స్తుతే।
నమ స్తే బభ్రురూపాయ, కృష్ణాయ చ నమోఽ స్తుతే।
నమ స్తే రౌద్రదేహాయ, నమ స్తే చాంతాకాయ చ
నమ స్తే యమసంజ్ఞాయ, నమ స్తే సౌరయే విభో! ॥
నమ స్తే మందసంజ్ఞాయ, శనైశ్చర నమోఽ స్తుతే
ప్రసాదం కురు దేవేశ! దీనస్య ప్రణతస్య చ ॥

**గమనిక-** **జాతకరీత్యా శనిమహాదశ జరుగుతున్నపుడు, అష్టమ, అర్ధాష్టమ, ఏల్నాటిశని జరుగుతున్నప్పుడు, శని అనుకూలంగా లేనపుడు ఈ స్తోత్రాన్ని రోజూ ఉదయం, సాయంకాలం 12 మార్లు పారాయణం చేయడంవల్ల శనైశ్చరుని అనుగ్రహం కల్గుతుంది. శుభఫలాలు చేకూరుస్తాయి.**

నిష్ఠతో, భక్తిశ్రద్ధలతో జపిస్తే, శనిబాధ తొలగుతుందని భక్తుల విశ్వాసం. **పరమశివుడు ఋషులకు 'శనైశ్చరకవచం' ప్రబోధించాడు. శని అంటే శక్తి. శనైశ్చరుడంటే శివచైతన్యం.**

అనంతపురం జిల్లా పెనుకొండకు 40కి.మీ. దూరంలో రొద్దం మీదుగా వెళ్తే పావగడకు వెళ్లవచ్చు. కర్ణాటకరాష్ట్రం తుమకూరుజిల్లా పావగడ- ఆంధ్ర ప్రదేశ సరిహద్దులో ఉంది. అక్కడ శనైశ్చరాలయం సుందరంగా వెలసింది. దేశం నలుమూలల నుండి భక్తులు విచ్చేసి, పూజలు చేస్తున్నారు. శనిమహాత్మునికి తైలాభిషేకం, నవగ్రహపూజలు నిష్ఠతో చేస్తున్నారు. భక్తులు తగిన ప్రయోజనాన్ని, శాంతిసౌఖ్యాలను పొందుతున్నారు.

అట్లే మహారాష్ట్రలో శిరిడీసమీపంలోని సింగణాపురంలో శని దేవుడు శిలగా వెలశాడు. ఆలయంలేని దేవుడిగా పూజింపబడుతున్నాడు. ఈ పుణ్యక్షేత్రంలో మద్యపాన, మాంసాహారాలు నిషిద్ధాలు. ఈ గ్రామంలో ఏ గడపకూ తలుపులు లేకుండడం ఇక్కడి ప్రత్యేకత. ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరిజిల్లా కోనసీమ, మందపల్లిలో సుప్రసిద్ధ శనైశ్చరాలయం ఉంది. ఇక్కడ ద్రావిడశైలిలో నల్లరాతిపై శనిమహాత్ముని విగ్రహం మలచబడింది.

మహాన్యాసపూర్వకతైలాభిషేకం, శనిసహస్రనామార్చనలు చేస్తారు. అష్టోత్తరశతనామావళి పఠించి, పూజించి, శనిదోషనివారణ పొందుతున్నారు.

## డిసెంబరు నెల క్విజ్ - 41 సమాధానాలు

01) పుణ్యభువనాలు
02) భగవద్గీత
03) తిరుప్పావై
04) గోదాదేవి
05) దీపానికి
06) ఆనందం
07) రోహిణి
08) మనోరథాలు
09) క్షేత్రజ్ఞుడు
10) పంచజనుడు
11) వాల్మీకి
12) గణపతి
13) భారతీయ
14) గాంధారి
15) లోభి

### సరైన సమాధానాలు వ్రాసినవారు-

1)మాచిరాజు విష్ణువందన, విజయవాడ 2)సాయివాణి, బెంగళూరు 3)కంభంపాటి ఋత్విక్‌సాయి, ఖమ్మం 4)కె.పూజిత, విజయవాడ 5)డి.ప్రశాంత్, విజయవాడ 6)సి.హెచ్.కార్తికేయ, విజయవాడ 7)ఆర్. సుహాస్, విశాఖపట్నం 8)చిప్పాడ తేజస్వి వేదాంశు, విశాఖపట్నం 9)నగరం సుహాంత్ అమర్త్య, తిరుపతి 10)బి.సూర్యకృష్ణ విరాజశర్మ, బెంగళూరు 11)కాందూరి శ్రీచరణ్, కోదాడ 12)తేతల గీతిక, కుతుకులూరు 13)మేడపాటి కీర్తిక, కుతుకులూరు 14)జీ.వి.రియాశ్రీ, చెన్నై 15)పి.జాహ్నవ్, ఖమ్మం 16)ఆర్.నాగమౌనిక, హైదరాబాదు 17)క్రిష్టిపాటి భార్గవ్, హైదరాబాదు 18)పత్తి వరప్రసాద్, విశాఖపట్నం 19)జి.అతులిత్ రెడ్డి, హైదరాబాదు 20)జె.లక్ష్మణ్ వీర్, కుప్పం 21)ఏ.సృజనగాయత్రీ పవన్, ప్రొద్దుటూరు 22)ఎం.వి.కమల, పిఠాపురం 23)మాచేపల్లి షణ్ముఖతనీష్, పెద్దాపురం 24)కె.అభయకృష్ణ, హైదరాబాదు



మహాశివుణ్ణి సోమవారం పున్నాగపూలతో పూజిస్తే అఖండకీర్తి లభిస్తుంది

# గురుబలం పెరగాలంటే...

- శ్రీ తల్లంరాజు శేషగిరిరావు

మన దేవాలయాలు

కోటప్పకొండ అనగానే అందరికి గుర్తుకొచ్చేది ప్రభలు. శివరాత్రికి, వీటిని విద్యుద్దీపాలతో అలంకరించి, ఇక్కడ జరిగే తీర్థంలో ఊరేగిస్తారు. వీటిని వీక్షించడానికి లక్షలాది మంది భక్తులు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాలనుండి కూడి వస్తారు.

కోటప్పకొండ, గుంటూరు జిల్లా, నరసరావుపేటకు 15కి.మీ. దూరంలో ఉంది. ఇది దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన ప్రాచీన శైవక్షేత్రంగా భాసిల్లుతోంది. గుంటూరు, విజయవాడ, గుంతకల్లు రైలు మార్గంలో, పిడుగురాళ్లలో దిగి, బస్సులో ఒక గంటలో నరసరావుపేట చేరుకోవచ్చు. ఈ క్షేత్రానికి వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉంది. ఈ కొండమీద శ్రీత్రికోటేశ్వరస్వామి ఆలయం ఉంది.

శ్రీత్రికోటేశ్వరస్వామి గురించి, ఒక పురాణ కథ ఉంది. పరమేశ్వరుడు, దక్షయజ్ఞాన్ని విధ్వంసం చేసిన తరువాత శాంతించి, దక్షిణామూర్తి స్వరూపంలో కోటప్పకొండ మీద అవతరించాడు. శివుడు పన్నెండు సంత్సరాలు వటువుగా మారి, బ్రహ్మచర్యానికి పూనుకొని సమాధిశిష్ఠుడైన సమయంలో, బ్రహ్మాదులు, దక్షిణామూర్తిని బ్రహ్మోపదేశం చేయమని కోరగా అందుకు సమ్మతించి, త్రికుటాద్రికి వచ్చి బ్రహ్మోపదేశం చేశాడు.

ఈ కొండ మూడు శిఖరాలు కలిగి ఉండడం వల్ల దీన్ని త్రికూటపర్వతమని, ఈ దేవుని త్రికూటేశ్వరుడని పిలుస్తారు. ఈ శిఖరాలను బ్రహ్మ, విష్ణు, రుద్ర శిఖరాలని పిలుస్తారు. రుద్రశిఖరం మీద దక్షిణామూర్తి యోగనిష్ఠలో బ్రహ్మాదులకు బ్రహ్మోపదేశం చేశాడని విశ్వసిస్తారు. పాత కోటేశ్వరాలయం ఇక్కడ ఉంది. పక్కన ఉన్న విష్ణుశిఖరం మీద, విష్ణువు శివుని గూర్చి తపస్సు చేయగా, శివుడు ప్రత్యక్షమై, త్రిశూలంతో రాతిమీద పొడవగా జలం ఉద్భవించింది. ఇక్కడ పాపవినాశనే శ్వరాలయం నిర్మించారు. రుద్ర శిఖరం కింద నైరుతి భాగంలో బ్రహ్మశిఖరం ఉంది. బ్రహ్మ శివుని గూర్చి తపస్సు చేయగా, శివుడు జ్యోతిర్లింగంగా వెలసిన చోట ప్రస్తుత కోటేశ్వరాలయం రూపు దిద్దుకుంటుంది. ఇక్కడ ఉత్తరాన యలమంద (ముని మంది) గ్రామంలో మునులు గుంపులుగా ఉండేవారు. అందువల్ల యలమంద కోటేశ్వరుడని అంటారు.

కోటప్పకొండ ఎత్తు 1587 అడుగులు కాగా 660 అడుగుల ఎత్తులో త్రికోటే శ్వర స్వామి దేవాలయం ఉంది. కొండపైకి వెళ్లేందుకు మెట్లను, నరసరావుపేట జమీందారు శ్రీనరసింహరాయనింగారు నిర్మించారు. మెట్లమార్గానికి కుడివైపు బాట ప్రక్కన మరో మార్గం కూడా ఉంది. పాపవినాశ స్వామి గుడి క్రిందనుంచి పోయే మార్గాన్ని యలమంద సోపానమార్గం అంటారు.

దక్షిణామూర్తి స్వరూప త్రికోటేశ్వరస్వామి బ్రహ్మచారి కనుక ఇక్కడ కల్యాణం జరుగదు. ధ్వజస్తంభం కూడా లేదు.



ఇక్కడ కాకులు సంచారం కూడా ఉండదు. దీనికి ఒక పురాణగాథ ఉంది. కొండకావూరులో ఆనందవల్లి అనే పాలు అమ్ముకొనే స్త్రీ ఉండేది. ఆమె శివభక్తురాలు. ఈమె విభూది, రుద్రాక్షలు ధరించి, శివస్తోత్రం చేస్తూ స్వామిని పూజించేది. ఒక శివరాత్రి నాడు ఓగేరు నదిలో స్నానం చేసి, రుద్రశిఖరం మీద ఉన్న కోటేశ్వరుని పూజించి తపస్సు ఆచరించింది. ఎండా కాలంలో కూడా ఆనందనల్లి పూజలు ఆపకుండా పాపవినాశం దొన వద్దకు వెళ్లి, తీర్థాన్ని రుద్రశిఖరానికి తెచ్చి అభిషేకించి పూజలు చేసింది. ఒకనాడు తీర్థం తెచ్చి మారేడు దళాల కోసం వెళ్ళగా, కాకి ఒకటి ఆ తీర్థాన్ని నేలపాలు చేసింది. దాంతో కోపగించిన ఆనందవల్లి శాపం వలన, కొండ ప్రాంతంలో కాకుల సంచారం లేకుండా పోయిందంటారు.

ఆనందవల్లిని పరీక్షించడానికి శివుడు జంగమయ్య రూపంలో ఆమెను ఎన్నోవిధాల కష్టపెట్టాడు. వాటన్నింటిలో ఆమె నెగ్గింది. నీ ఇంటికి వస్తాను. అక్కడే శివవ్రతం ఆచరించ మని చెప్పి ఆమె వెనుక బయలుదేరాడు. 'ఎట్టి పరిస్థితులలో వెనుకకు తిరిగి 'చూడకూడదు' అన్నాడు. ఆమె అలాగేనంది. కానీ హఠాత్తుగా వినిపించిన ప్రళయధ్వనులకు తాళలేక బ్రహ్మశిఖరం వద్ద ఆమె వెనుతిరగడంతో, ఇద్దరూ శిలలుగా మారిపోయారు. అక్కడే, కోటేశ్వరాలయం, ఆనందవల్లి గుడి వెలిశాయి.

త్రికోటేశ్వరాలయానికి దిగువులో ఆనందవల్లి గుడి ఉంది. భక్తులు ముందుగా ఈ గుడిని దర్శించిన తరువాత కోటయ్య స్వామిని పూజిస్తారు. శ్రావణమాసంలో రుద్రశిఖరం పైన, కార్తికమాసంలో విష్ణుశిఖరంపైన, మహాలింగార్చన చేసి





శ్రీ త్రికోటేశ్వరస్వామి వారు - కోటప్పకొండ

ఉపవాసం జాగరణలతో, ప్రభలు కట్టి, అన్నదానం చేసినవారికి, మోక్షం సిద్ధిస్తుందని స్థలపురాణం. కొండపైన, రుద్రశిఖరం మీద చిన్న గుడి, లింగం, దానికి ఎదురుగా శిథిలమైన దారుధ్వజం ఉన్నాయి. దాన్ని పాత కోటప్పగుడి అంటారు. మొదట కోటేశ్వరుడు ఉన్న స్థలం ఇదే. ఇక్కడనుంచే, ఆనంద వల్లితో దిగివచ్చాడు. ఇదే బ్రహ్మ శిఖరం. ఇక్కడ నూతన కోటేశ్వరుని గుడి ఉంది. ప్రస్తుతం భక్తులు పూజించే స్థలం ఇదే!

11వ శతాబ్దం నాటికే ఈ ఆలయనిర్మాణం జరిగినట్లు కొండ మీద పురాతన శాసనాల ఆధారంగా తెలుస్తోంది. ఈ క్షేత్రం చోళరాజులకు పూర్వం నుంచి ప్రసిద్ధి కెక్కి ఉంది.

కోటేశ్వరుని గుడికి దక్షిణంగా గణనాథుని గుడి, పశ్చిమంలో సాలంకేశ్వరుని గుడి, ఉత్తరాన అరుగు మీద సంతాన కోటేశ్వరలింగాలు ఉన్నాయి. కోటేశ్వరుని గుడికి

ఎడమప్రక్కన మార్కండేయ లింగం, తూర్పున సందీశ్వరుడు, నందికి తూర్పున దిగువ మెట్లమార్గం పక్కన రామలింగేశ్వరుడు, దక్షిణాన, ఆనందవల్లి గుడి ఉన్నాయి. కొండ క్రింద ప్రసన్న కోటేశ్వరుడు, నీలకంఠేశ్వరస్వామి, మల్లికార్జునాలయం, బొచ్చు కోటేశ్వరుడు (కల్యాణకట్ట) తదితరుల దేవాలయాలు, గాలిగోపురం పక్కన(విజయ) విఘ్నేశ్వరస్వామి ఆలయం ఉన్నాయి.

ప్రతి ఏడాది, శివరాత్రినాడు తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరుగుతాయి. దాన్ని ప్రభల పండుగ అని కూడా అంటారు. ఈ తిరునాళ్ల రోజున లక్షలాది భక్తులతో కోటప్ప కొండ కళకళలాడుతుంది. హరో హర హరో హర అనే భక్త జనఘోషతో ఈ కొండ ప్రతిధ్వనిస్తుంది. పంటలు, చేతికొచ్చి చేతి నిండా డబ్బులు ఉండటం వల్ల రైతాంగం అంతా పండగ సంబరంలో పాలుపంచుకుంటారు. అందంగా ప్రభలు రూపొందించటంలో గ్రామప్రజలు పోటీ పడి, నెల ముందుగా ఈ ప్రభల తయారీలో మునిగిపోతారు. విద్యుత్ప్రభల కోసం గ్రామాలు, గ్రామాలు పోటీపడతాయి.

## శివరాత్రి ప్రభలు

చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు, తమ మొక్కులు తీర్చుకోవటానికి బండ్లపైన తమ స్థాయికి తగ్గట్లుగా ప్రభలను నిర్మించి, కోటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. వీర శైవులు, ఇక్కడ కత్తులను చేతబట్టి ప్రభలముందు నిలబడి ముందుకూ, వెనుకకూ నడుస్తూ, గంతులువేస్తూ, రుంజ, డప్పు, బూరలను ఊదుతూ భక్తులను ఉత్తేజపరుస్తారు. బండ్లపైన గోపురాకారంలో బొంగులతోనూ, కట్టెలతోనూ నిర్మించి, వివిధ ఆకారాల్లో కత్తరించిన రంగుకాగితాలు, బట్టలు, పూలు, ఆకులతో, దేవుని చిత్రపటాలతో, జాతీయనాయకుల బొమ్మలతో అలంకరించి, జనరేటర్లద్వారా విద్యుద్దీపాలను కూడా అలంకరించి, అత్యంత ఆకర్షణీయంగా, ఈ ప్రభలను తీర్చిదిద్దుతారు. ప్రభలతోబాటు, బండ్లను, ఎద్దులను కూడా రైతులు ఆకర్షణీయంగా అలంకరిస్తారు. చుట్టుపక్కల ఊళ్ళన్నీ ప్రభల తయారీలో పోటీపడి ఎత్తైన, అందమైన ప్రభల్ని తయారుచేస్తారు. గతంలో ఆకుల గణపవరంవారు 100 అడుగుల ప్రభను నిర్మించటంలో పేరుగాంచారు. రైతులు, తమ



పశువుల్ని అలంకరించి కొండచుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు. ఒంగోలు గిత్తల ప్రదర్శన, పోటీలుకూడా జరుగుతాయి. శివరాత్రి పర్వదిన సందర్భంగా కొండకింద పెద్ద సంత జరుగుతుంది. ఆ సందర్భంగా లక్షలాదిమంది భక్తులతో ఆప్రాంతమంతా నిండిపోతుంది. జానపదకళారూపాలు, నాటకాలు, నృత్యప్రదర్శనలతో ఆ ప్రాంతమంతా కళకళలాడు తుంది. ఎడ్ల పోటీలు, క్రీడల పోటీలు గ్రామస్థులు నిర్వహిస్తారు.

## ఉత్సవాలు

ఆలయంలో మహాశివరాత్రి అత్యంత వైభవంగా మాఘ బహుళ ఏకాదశినుంచి అమావాస్యదాకా 50 రోజులపాటు జరుగుతాయి. ఇంత ఘనంగా జరిగే ఈ ఉత్సవాలను రాష్ట్ర విభజన తరువాత, మన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. ఈ సందర్భంగా అభిషేకం, రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మెట్లపూజలు జరుగుతాయి. చతుర్దశినాడు భక్తులు జాగరణ ఉంటారు. ఇక్కడి దేవుడైన దక్షిణామూర్తి బ్రహ్మచారి కాబట్టి అతనికి కల్యాణోత్సవాన్ని నిర్వహించరు. అందుచేత

శివరాత్రికి లింగోద్భవ కాలం అని కూడా పేరు



ఆకర్షణ. వేలాదిమంది భక్తులు ఇక్కడకు వచ్చి, స్వామిని దర్శించి ధన్యులౌతున్నారు. త్రికోటేశ్వర స్వామి ఆలయం ఎదుట అంతే ఎత్తులో ఒక శివలింగం నిర్మించారు. కోటయ్య దర్శనాంతరం, ఉత్తరభాగంనుంచి క్రిందికి దిగితే, ధ్యానంలో ఉన్న శివుని విగ్రహం, ధ్యానమందిరం భక్తులను తరింపజేస్తాయి.

ఇక్కడ ధ్వజస్థంభం అవసరం లేకుండాపోయింది. శివరాత్రి సందర్భంగా భక్తులు పండ్లు, పూలు, కొబ్బరికాయలు, నెయ్యి, ధనాన్ని స్వామివారికి సమర్పిస్తారు. కోటప్పకు నిత్యార్చనలతో పాటు, కార్తిక, మాఘమాసాల్లోనూ, ధనుర్మాసంలో వచ్చే ఆర్ద్రోత్సవాల సందర్భంగా మేధాదక్షిణామూర్తి అర్చనలు నిర్వహిస్తారు. ధనుర్మాసంలో ఆరుద్రనక్షత్ర ఉత్సవానికిముందు నలభైరోజులపాటు భక్తులు మేధా దక్షిణామూర్తి దీక్షను స్వీకరిస్తారు. ఈ దీక్షను కోటప్పదీక్ష అంటారు. ఈ సందర్భంగా మహారుద్రయాగం, కోటిబిల్వార్చన జరుగుతాయి. ఆషాడశుద్ధ (తొలి) ఏకాదశి, కార్తికశుద్ధ(శని) త్రయోదశి, పుష్యశుద్ధ (వైకుంఠ) ఏకాదశి ఉత్సవాలను కూడా ఈ ఆలయంలో ఘనంగా నిర్వహిస్తారు.

పూర్వం, ఈ కొండపైకి వెళ్లాలంటే మెట్లే శరణ్యం. ఇవి 703 దాకా ఉంటాయి. దీనివల్ల భక్తులు చాలా శ్రమకు లోనయ్యేవారు. అందువల్ల లక్షల రూపాయల ఖర్చుతో ఘాట్ రోడ్డు నిర్మించారు. దీన్ని పర్యాటక కేంద్రంగా రూపొందించారు. భక్తులు శ్రమకు లోను కాకుండా బస్సులపైనా, ఇతర వాహనాల మీద కొండపైకి వెళ్లడానికి వీలుపడుతోంది. కోట్లాది రూపాయలతో భక్తులకు అన్ని సదుపాయాలు ప్రభుత్వం కల్పించింది. ఈ ఘాట్‌రోడ్డులో 50 అడుగుల ఎత్తుగల విఘ్నేశ్వరుని విగ్రహం భక్తులను ఆకర్షిస్తోంది.

ఇదిగాక బ్రహ్మ, విష్ణు, పార్వతి మొదలైన దేవతల విగ్రహాలు కూడా భక్తుల పూజలందుకొంటున్నాయి. క్రింద మ్యూజియం, పిల్లల పార్కు, జింకల పార్కు పర్యాటకులకు

## కోటప్పకొండపై దర్శనీయ స్థలాలు

**దొనలు:** కొండపైన వర్షాకాలం నీటి నిల్వకోసం ఉపయోగపడుతున్న మడుగులను పోలిన, సహజసిద్ధమైన దొనలు ఉన్నాయి. కొత్త కోటేశ్వరస్వామి ఆలయం కిందగానున్న పెద్దసైజు దొనల్లో ఒక్కోసారి భక్తులు పుణ్యస్నానాలు కూడ చేస్తారు. ఇక్కడున్న ఇతర రాతి తొట్లలో ఎద్దడుగుదొర, పరై దొన, పుట్టెచేతిదొన, పాలదొన, కాదదొన, ఉబ్బు లింగయ్య దొన ముఖ్యమైనవి.

**గుహలు :** కొండపైన అక్కడక్కడ సహజసిద్ధమైన గుహలున్నాయి. స్థానికులిచ్చిన సమాచారం మేరకు, ఇక్కడి గుహలను సంగమయ్యగుహ, మారెళ్ళగుహ అని పిలుస్తున్నారు. కొన్ని చిన్న గుహల్లో భక్తులు శివలింగాలను ప్రతిష్టించుకొని పూజలు చేస్తున్నారు.

**సత్రాలు :** శివరాత్రి పర్వదినాల్లోనేకాక, వివిధ ఉత్సవ సందర్భాల్లో కోటప్పకొండకు వచ్చే భక్తుల భోజన, వసతి సదుపాయాలకోసం కొన్ని సత్రాలు ఏర్పాటైనాయి. వాటిలో కొండపైన తి.తి.దేవస్థానాల సత్రం, కొండదిగువనున్న భాగివారి సత్రం, కమ్మజన సత్రం, అయ్యంభొట్లవారి సత్రం, గబ్బిటవారి సత్రం, లింగాయత సత్రం (బసవ మందిరం) ముఖ్యమైనవి.

అన్నదానంతోపాటు విద్యాదానం కూడా చేయటానికి, 1982లో ప్రాచ్యభాష పాఠశాల నెలకొల్పబడింది. ఆనందవల్లి, తోటవారి అతిథిగృహాలున్నాయి.

వదాన్యుల సహకారంతో, బాలల, వృద్ధులకోసం, చిన్మయారణ్యం పేరిట విడివిడిగా ఆశ్రమాలను కూడ కోటప్ప కొండ దిగువన ఏర్పాటుచేసి నిర్వహిస్తున్నారు.



# శ్రీవేంకటేశ్వరలీలలు

# ప్రయత్నంలో నిజాయితీ ఉంటే...

– శ్రీ వి.నరేష్ కుమార్, 90322 94134

సుమారు ముప్పైసంవత్సరాలక్రితం నా జీవితంలో జరిగిన శ్రీస్వామివారి పరమాద్భుతలీలా వైభవమిది!

అప్పుడు నా వయస్సు పన్నెండు సంవత్సరాలు. నాకు ఊహ తెలిసిన తర్వాత మా కుటుంబమంతా కలిసి తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లాలనుకున్నాం. అప్పుడు మా పొరుగింట్లో ఉన్న వాళ్ల బంధువులు కొండపైన ఉంటూ, తి.తి.దే.లో పని చేస్తున్నారు. అప్పుడు మా పొరుగువారు. వాళ్ల చిరునామా ఇచ్చి వాళ్లను సంప్రదించమన్నారు. వసతి, దర్శనం తదితర ఏర్పాట్లు చేస్తారని నమ్మకంగా చెప్పారు. మేము ఆ చిరునామా తీసుకుని కుటుంబమంతా తిరుమలకు బయలుదేరాం.

కొండకు చేరుకున్నాక తిరుమలలో ఒకటే వర్షం. మంచుతో ఆకాశం పూర్తిగా కప్పేసుకుంది. అది నవంబరు నెల. తిరుమల క్షేత్ర ప్రకృతి సౌందర్యాన్ని చూచిన నా మనసు వర్ణించడానికి మాటలు చాలని దివ్యానుభూతికి లోనైంది. సరే, మా పక్కింటి వాళ్లు ఇచ్చిన చిరునామా ఆధారంగా వెతకడం ప్రారంభించాం. ఆ చిరునామా, ఇచ్చిన వాళ్లే ఇవ్వడం తప్పో, లేదా మా నాన్నగారే పొరబాటుగా రాసుకున్నారో తెలీదు. బస్సు దిగినప్పటి నుండి, మధ్యాహ్నం వరకు ఆ మంచువానలో




తిరుగుతూనే, వెతుకుతూనే ఉన్నాం. ఇక ప్రయోజనం లేక వానలో తడవకుండా కాసేపు తలదాచుకుందామని, సమీపం లోని ఒక సత్రం వరండాలో నిలబడ్డాం.

అప్పుడే ఒక వ్యక్తి మా దగ్గరకు వచ్చాడు. "ఏమిటి సార్ ఇక్కడున్నారు?" అని అడిగాడు. మేము జరిగినదంతా చెప్పాం. ఆయన పేరు వేంకటేశ్వర్లు. ఆయనది మా ఊరే! మా నాన్నగారు గూడూరులో తపాలా శాఖ ఉద్యోగి. ఉద్యోగంలో చేరిన కొత్తలో మా నాన్నగారికి విద్య నేర్పిన గురువు ఈ వేంకటేశ్వర్లుగారి తండ్రి. వేంకటేశ్వర్లు గారు, ఆయన యజమానితో కలిసి స్వామివారి కల్యాణం చేయించడానికి తిరుమల వచ్చారట. ఆయన మాకు గది ఇప్పించి, స్వామివారి కల్యాణోత్సవ ప్రసాదం ఇచ్చారు. ఆ తర్వాత మేము తలనీలాలు సమర్పించి, శ్రీవారిదర్శనం చేసుకుని తిరుమలకొండపైనే మూడు రోజులు ఉన్నాం. ఆపదలో ఉన్నవారిని అడక్కుండానే ఆదుకునే దైవం శ్రీవేంకటేశ్వరుడు. మన ప్రయత్నంలోగానీ, పడే కష్టంలో గానీ ధర్మం, నిజాయితీ ఉంటే స్వామి వారు మన ప్రార్థనకు తప్పక కరుణిస్తాడు. ఆపద్బాంధవా! అనాథ రక్షకా!! గోవిందా!! గోవింద!!!



గృహలక్ష్మి

# పిల్లలు లేరని దిగులుపడుతున్నారా..?

– బ్రహ్మశ్రీ తాడంకి వెంకట లక్ష్మీ నరసింహారావు

సంతానం లేకుండా మరణించిన వారికి మరణానంతరం ఉత్తమలోకాలను ప్రాప్తింపజేసే వ్రతం "**లింగదాన వ్రతం**". ఈ వ్రతాన్ని లయకారుడైన పరమశివుడికి అత్యంత ప్రీతికరమైన మహాశివరాత్రి రోజున ఆచరించాలి. ఈవ్రతం ఆచరణ వెనుక ఓ ఆసక్తికరమైన గాథ ఉంది.

**2026, ఫిబ్రవరి నెల ఉత్సవాలు, పర్వదినాలు**

| | |
|---|---|
| 01 | రామకృష్ణతీర్థముక్కోటి |
| 08-17 | తిరుపతి, శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం |
| 08-16 | శ్రీనివాసమంగాపురం, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం |
| 15 | మహాశివరాత్రి |
| 24 నుండి మార్చి04వరకు | తరిగొండ, శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవం |

పూర్వం మధురరాజ్యాన్ని "గత కర్ముడు" అనే రాజు పరిపాలిస్తుండేవాడు. ఆయన భార్య చంద్రప్రభ. ప్రజలను కన్నబిడ్డల వలే చూసుకుంటూ ప్రజాను రంజకంగా పరిపాలిస్తున్న గత కర్మునికి, చాలాకాలంపాటు సంతానం కలుగలేదు. చివరకు సంతానం కలుగక ముందే యుద్ధంలో మరణించాడు.

దీంతో రాజ్యపాలనా బాధ్యతను చంద్రప్రభ చేపట్టింది. రాజ్యపాలన చేయసాగింది. కానీ, తనకు సంతానం లేకపోవడం ఆమెను తీవ్రదుఃఖానికి గురి చేస్తుండేది. అంతేకాకుండా సంతానం లేకుండా మరణిస్తే, ఉన్నత లోకాలు ప్రాప్తించవని దిగులు చెందుతుండేది.

ఇలా ఉండగా, ఒకనాడు "పరమేశ్వరభట్టు" అనే పండితుడు రాజ్యానికి వచ్చినట్లు తెలుసుకున్న రాణి, ఆయనను తన ఆస్థానానికి పిలిచి తన మనస్సులోని దిగులును వివరించింది. అంతా విన్న పండితుడు లింగదాన వ్రతాన్ని బోధించగా, రాణి ప్రతి సంవత్సరం ఆచరించినట్లు, అప్పటినుంచి ఈ వ్రతం అమల్లోకి వచ్చినట్లు పురాణకథనం.

## వ్రతవిధానం

మహాశివరాత్రినాడు తెల్లవారుఝామునే నిద్రలేచి తల స్నానం చేసి, శివాభిషేకాలు, పూజలు యథావిధిగా నిర్వహించిన అనంతరం, పగలంతా ఉపవాసవ్రతాన్ని అనుసరించాలి. సాయంత్రం తిరిగి శివపూజ చేసి వెండి లేదా రాగి శివలింగాన్ని ప్రమిదలో ఆవు నేతితో దీపాన్ని వెలిగించి దక్షిణ తాంబూలాలతో పాటూ పండితుడికి దానం ఇవ్వాలి.

ఈ విధంగా లింగదానవ్రతాన్ని చేయడంవల్ల ఇహంలో సౌఖ్యం, పరంలో శివసాయుజ్యం లభిస్తుందని శాస్త్రవచనం. ఈ వ్రతాన్ని మహాశివరాత్రినాడే కాకుండా శివుడికి ప్రీతికరమైన కార్తికమాసంలోగానీ, ఏదైనా నెలలోని "మాసశివరాత్రి" నాడు అయినా ఆచరించవచ్చు.

ఈ నెల 26వ తేదీన
తిరుక్కచ్చినంబి శాత్తుమొఱ

# మహాభాగ్యవంతుడు

- శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు,
99896 79681

శ్రీయామునాచార్యులవారి శిష్యులలో పంచనంబులు ప్రసిద్ధులు. తిరుక్కచ్చినంబి (కాంచీపూర్ణుడు), తిరుమలనంబి (శ్రీశైలపూర్ణుడు), పెరియనంబి(మహాపూర్ణుడు), తిరుక్కోటియూర్‌నంబి (గోష్ఠీపూర్ణుడు), మారనేర్ నంబి అనే వారిని పంచ నంబులు (పంచపూర్ణులు) అంటారు. ఈ పంచ నంబుల శిష్య రత్నమే భగవద్రామానుజాచార్యులవారు. పంచనంబుల ద్వారానే రామానుజులవారికి వైష్ణవసిద్ధాంతజ్ఞానం సంక్రమించిది. పంచనంబులలో ఒకరైన తిరుక్కచ్చినంబికి కచ్చినంబి, తిరుఆలవట్ట తిరుక్కచ్చినంబి, కాంచీపూర్ణ, గజేంద్రదాస, ఆరుళ దాస, పరాంకుశదాస అని కూడ వ్యవహారనామాలు.

పంచనంబులలో ప్రథమగణ్యుడైన తిరుక్కచ్చినంబి కుంభ(మాఘ)మాసంలో మృగశిర నక్షత్రంలో జన్మించినట్లు వీరి తిరునక్షత్ర తనియ(జాతకశ్లోకం) తెలియచేస్తోంది.

కాంచీపూర్ణులు నమ్మాళ్వారుల పునరవతారమనీ, నమ్మాళ్వారుల శిష్యులైన మధురకవి ఆళ్వారుల పునరవతారమే కాంచీపూర్ణులశిష్యులైన రామానుజులవారనీ చెప్తారు. ఈ అర్థం పై శ్లోకాలలో ఉండటం గమనార్హం. శ్రీకాంచీపూర్ణులు విష్వక్సేనాంశ సంభూతులు. నమ్మాళ్వారులు కూడ విష్వక్సేనాంశ సంభూతులు కావటం ఇక్కడ స్మరణీయం.

తమిళనాడులో (తొండమండలంలోని) కాంచీపురానికి సమీపంలో ఉన్న పూవిరుందవల్లి(పూందణ్మల్లిగై) అనే గ్రామం కాంచీపూర్ణుల జన్మస్థలం. ఆ గ్రామంలో కమలాదేవి, వీర రాఘవసూరి అనే దంపతులు కాంచీపూర్ణుల తల్లితండ్రులు.

కాంచీపూర్ణుడు యామునాచార్యులవారికి(918-1038) శిష్యుడు, రామానుజాచార్యుల వారికి (1017-1137) గురువు. కనుక వీరి కాలం పదకొండవ శతాబ్దమని స్థూలంగా చెప్పవచ్చు.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు కాంచీపూర్ణులు శైశవం నుంచి కూడ భక్తిసంపన్నునిగా విరాజిల్లారు. పరమ భాగవతోత్తమునిగా కీర్తించబడ్డారు. కంచివరదరాజస్వామివారి ఆంతరంగికభక్తులైన వీరు పెరుమాళ్ల ఆనతి మేరకు శ్రీరంగంలోని యామునాచార్యులవారికి శిష్యులవుతారు. యామునులవారు తిరుక్కచ్చినంబిని పంచసంస్కార సంపన్నుని చేస్తారు. గురుపరంపరాపూర్వక గుప్తద్వయార్థాన్ని తెలియచేస్తారు. తత్త్వోపదేశంచేస్తారు. అరుళాళదాసు అనే దాస్యనామం ఇస్తారు. యామునుల ఆజ్ఞమేరకు వీరు స్వస్థలం విచ్చేస్తారు. వీరు తిరువల్లిక్కేళి- నృహరి, పెరంబుదూరు- ఆదికేశవ, కంచి-వరద, తిరుమల- వేంకటాధిపుడు, శ్రీరంగం- రంగ నాయక మొదలైన అర్చామూర్తులను సందర్శించి సేవించారు.

కాంచీపూర్ణునికి జన్మస్థలమైన పూవిరుందవల్లి గ్రామంలో అందమైన పూలతోట ఒకటి ఉండేది. కాంచీపురంలో వెలసిన వరదరాజపెరుమాళ్ల పుష్పకైంకర్యం కోసం కాంచీపూర్ణుడు ఆ పూలతోటను భక్తిశ్రద్ధలతో పెంచేవాడు. ప్రతిరోజు తిరుక్కచ్చినంబి తన తోటలోని పూలను గ్రహించి అందమైనమాలికగా కూర్చి కంచివరదరాజ పెరుమాళ్లకు సమర్పించేవారు. వయసు పైబడ్డ తర్వాత కచ్చినంబి స్వగ్రామమైన పూవిరుందవల్లినుంచి కాంచీపురానికి నడువలేక కంచిలోనే నివసించి వరదరాజస్వామివారి సన్నిధిలో తాళవృంత కైంకర్యం చేస్తుంటాడు. దీన్ని ఆలవట్టకైంకర్యం అంటారు. అందువల్ల వీరికి తిరుఆలవట్ట తిరుక్కచ్చినంబి అనే పేరు కలిగింది.

అర్చకుడొకనాడు వేడిపాలు నివేదన చేయగా కంచి వరదరాజస్వామివారికి వదనం వాడిపోతుందట. అప్పటినుంచి కంచివరదునకు తిరుక్కచ్చినంబి తాళవృంతాన్ని చేబూని పాలను చల్లార్చి కైంకర్యానికి అందచేసేవారు.

కాంచీపూర్ణుని తలిదండ్రులు చాలా వృద్ధులై తమ తన తనయుని చూసేందుకు కోరిక కలిగి పూవిరుందవల్లి నుంచి కాంచీపురంలో ఉన్న కాంచీపూర్ణునికి వార్త పంపిస్తారు. అపుడు కాంచీపూర్ణుడు వృద్ధజననీజనకులను చూసేందుకు స్వగ్రామం వెళతాడు. ఆయనవెంట కంచివరదరాజ పెరుమాళ్లుకూడ

వెళ్లివృద్ధదంపతులకు పరమపదం ప్రసాదిస్తారు. ఓ పర్యాయం స్వామివారి కైంకర్యసేవలో అద్దమరేయి అవుతుంది. తిరుక్కచ్చి నంబి తన మఠానికి ఒంటరిగా వెళ్లవలసి వస్తుంది. అప్పుడు వరదరాజస్వామి వారు శిష్యుని రూపంలో కచ్చినంబివారిని మఠం దగ్గర వదలివస్తారు.

రామానుజులవారు యాదవప్రకాశుల వద్ద కాంచీ పురంలో విద్యాభ్యాసం చేస్తారు. రామానుజులవారు యాదవ ప్రకాశులవారితో విభేదిస్తారు. వారిరువురికి సరిపడదు. ఆ తరువాత కాంచీపురంలో రామానుజులవారు కాంచీపూర్ణుల వారిని ఆశ్రయిస్తారు. కాంచీపూర్ణులు రామానుజులను అక్కడి శాలక్కణరను బావిలోని

జలాన్ని కంచివరదరాజులవారి తిరుమంజనార్థం ప్రతి రోజు తెచ్చేందుకు ఆజ్ఞాపిస్తారు. రామానుజులవారు కంచి వరదులవారికి తిరుమంజన కైంకర్యం చేస్తుంటారు. కాంచీ




పూర్ణులు కంచివరదరాజ పెరుమాళ్లకు తాళవృంతకైంకర్యం (చామరసేవ) చేస్తూ దేవునితో ప్రత్యక్షంగా మాట్లాడతారని రామానుజుల వారికి తెలుస్తుంది. రామానుజుల వారు తన సందేహాలకు సమాధానాలను కంచివరదుల వారిని అడిగి తెలుసుకుని తనకు చెప్పవలసిందిగా తిరుక్కచ్చినంబిని కోరు తారు. కంచివరదులు కాంచీపూర్ణుని ద్వార రామానుజుల సందేహాన్ని నివృత్తిచేసే షడ్వార్తలు తెలుపుతాడు.

ఈ సందర్భంలో రామానుజుల సహస్రనామస్తోత్రం లోని 'కాంచీపూర్ణార్య విజ్ఞాపి తాత్పార్యాభిప్రాయాయనమ' (183వ నామం) అనేది స్మరణీయం, గమనార్హం.

రామానుజులవారు ఓ పర్యాయం కాంచీపూర్ణులవారి భుక్తశేషాన్ని ఆరగించాలని అపేక్షిస్తారు. రామానుజులు తన ఇంట భోజనం సిద్ధంచేయించి కాంచీపూర్ణుని ఆగమనం కోసం నిరీక్షిస్తుంటారు. చాలాసేపటికి కూడా కాంచీపూర్ణుడు రాక పోవటంతో వారిని పిలుచుకొని వచ్చేందుకు వెళతారు రామా నుజులు. అలా రామానుజులు వెళ్లిన తర్వాత మరోదారి నుంచి కాంచీపూర్ణుడు రామానుజులవారి ఇంటికి వస్తారు. రామా నుజులవారి భార్య రక్షకాంబ(తంజమాంబ) కాంచీపూర్ణులకు భోజనం వడ్డిస్తుంది. కాంచీపూర్ణులు భజించిన తర్వాత తంజ మాంబ అతని ఉచ్ఛిష్ట భోజనాన్ని పరిహరించి సచేలస్నానం చేస్తుంది. ఈ సంఘటనకు రామానుజులు భార్యపై కోప గించుకుంటారు. నేడుకూడా రామానుజులవారి జయంతి సందర్భాన తిరుక్కచ్చినంబి తళిఘ ప్రసాదాలు రామానుజుల వారి అర్చావతారాల సన్నిధిలో లభిస్తున్నాయనటం జగత్ప్ర సిద్ధం. ఈ అంశాన్ని 'శ్రీవైష్ణవసిద్ధాంతదీపిక' పుట. 67 (1918 ప్రచురణ) ఇలా పేర్కొంది.. 'రామానుజ శ్రీజయన్తికాలే శ్రీకాంచీపూర్ణ శేషప్రసాదాద్యవతారేపి లభన్తే ఇతి సుప్రసిద్ధం'

రామానుజులవారు కాంచీపూర్ణులను గురువుగా భావించారు. అయితే కాంచీపూర్ణులవారు రామానుజులకు తనను గురువుగా భావించలేదని తెలుస్తోంది. రామానుజా ష్టోత్తరశతనామస్తోత్రంలో 'కాంచీపూర్ణ ప్రియసఖః' అనే నామం ఉండటం ఈ సందర్భంలో స్మరణీయం.

భగవంతుణ్ణే స్వచ్ఛందంగా తన వెంట నడిచేలా చేసుకున్న తిరుక్కచ్చినంబి మహాభాగ్యశాలి!


ఫాల్గుణమాసంలో చేసే అష్టమివ్రతంలో శివుడికి నువ్వులన్నం నివేదించాలి

# జగానికి నిండుదనం

-శ్రీ కందుకూరి వేంకటసత్యబ్రహ్మాచార్య,
81797 30107

సృష్టిలో పురుషుడు గొప్పా? స్త్రీ గొప్పా? అంటే ఇద్దరూ చెరిసగం అని చెప్పాలి. స్త్రీ పురుషులిద్దరూ సమానమే అనే విషయాన్ని తెలియజేయడానికే పరమేశ్వరుడు అర్ధనారీశ్వరావతారం దాల్చాడు. చరాచర జగత్తు ప్రకృతి పురుషుల కలయికతో ఏర్పడిందే. పార్వతీదేవి అడిగింది పరమేశ్వరుడు కాదనడు. పరమేశ్వరుడి మాట పార్వతి జవదాటదు. అందుకే వారిది ఆదర్శదాంపత్యం. మన దేవతల్లో శరీరంలో సగభాగం భార్యకు కేటాయించిన దేవుడు ఒక్క పరమేశ్వరుడే. ఈమూర్తిలో ఒకేసారి మనం అయ్యను, అమ్మను కూడా దర్శించవచ్చు. పరమేశ్వరుడి అవతారాలలోనే విలక్షణమైనది ఈ రూపం.

ఒకసారి భృంగి పరమేశ్వరుడి పాదాలకు మొక్కాడు. ఆయనకు ప్రదక్షిణలు చేశాడు. పక్కనే ఉన్న పార్వతీదేవిని చూడలేదు. ఆమెకు కనీసం నమస్కరించలేదు. విశేషం ఏమిటంటే పార్వతీపరమేశ్వరులు ప్రక్కప్రక్కనే ఉన్నా అమ్మని వదిలిపెట్టి అయ్యకు మాత్రమే ప్రదక్షిణ చేసాడా భక్తశిఖామణి. పార్వతీదేవికి అతడి ప్రవర్తన వింతగా తోచింది. అది గమనించి చిరునవ్వుతో పరమేశ్వరుడిలా అన్నాడు. దేవీ! మోక్షసాధకులకు ఐహిక సుఖాలతో పనేముంది. నీద్వారా మోక్షం లభించదు కదా? అన్నాడు. పార్వతీదేవికి మనసు చివుక్కుమంది. అయినా అప్పటికి సరిపెట్టుకుంది. మరుసటిరోజు పార్వతీపరమేశ్వరులు ఏకాంతంగా కూర్చున్నారు. భృంగి వచ్చాడు పరమేశ్వరుని పూజించుకుందామని. పార్వతీదేవి అతణ్ణి పరీక్షిద్దామని స్వామికి చాలా దగ్గరగా జరిగి కూర్చుంది. భృంగికి ఏమీ పాలుపోలేదు. స్వామికి ఎలా ప్రదక్షిణ చేయాలి?



వెంటనే అతడు ఒక తుమ్మెద రూపం ధరించి స్వామి అమ్మవార్ల మధ్య ఉన్న కొద్దిదూరంలో స్వామికి ప్రదక్షిణం చెయ్యసాగాడు. విషయం తెలుసుకున్న అమ్మవారు కోపించింది. అతడి రెండుకాళ్లు శక్తిహీనమై పోవాలని శపించింది. స్వామికి భక్తుడిపై జాలి కలిగింది. ఒక ఉపాయం ఆలోచించాడు. అతడికి మూడవ కాలు ప్రసాదించాడు. భృంగి తన మూడవ కాలు ఆధారంగా పడిపోకుండా ఉన్నాడు. పార్వతీదేవికి ఈ విషయం అవమానంగా అనిపించి కైలాసాన్ని వీడి, గౌతమమహర్షి ఆశ్రమానికి చేరింది.

ఆయన కైలాసంలో జరిగిన విషయాన్ని తెలుసుకుని పార్వతీదేవికి శివుడి దేహంలో సగభాగం పొందే మార్గం తెలియజేశాడు. అమ్మవారు శివుని గురించి కఠోరదీక్ష చేసింది. ఆ దీక్షకు మెచ్చి శివుడు ప్రత్యక్షమయ్యాడు. పార్వతీదేవి-"స్వామీ! నేనెన్నడూ నిన్ను ఎడబాయకుండునట్లు వరమిమ్ము! నీ శరీరంలో సగభాగమిమ్ము" అని అడిగింది. పరమేశ్వరుడు అనుగ్రహించాడు.

అర్ధనారీశ్వరమూర్తి తలపై నెలవంకతో జటాజూటం ఒక వైపు, కోటి కాంతులు కలిసిన కిరీటపు కాంతి మరోవైపు, విభూతి ధరించి అరకన్ను ఒకవైపు, పాపిట తిలకం ధరించి మరోవైపు, కుడి చేత అభయముద్ర, ఎడమచేత డోలాహస్తం, కుడి పరహస్తంతో టంకం, ఎడమ పరహస్తంలో కలువపూవు, కుడివైపు పురుషఉదరం, ఎడమవైపు పయోపీనోన్నతస్తనం, కుడిసగం పులితోలు ధరించి, ఎడమవైపు పట్టు పీతాంబరాలను ధరించి, కుడికాలిని కుంచితంగా - ఎడమకాలిని స్థిరంగా నిలిపి స్వామి శరీరం తెల్లని తెలుపుతో భాసిల్లుతుంటే అమ్మవారు ఎర్రగా మెరిసిపోతూ ఉన్న ఆ రూపాన్ని దర్శించిన కన్నులకెంత భాగ్యం. అనేక స్తోత్రాలు చేశారు సురులు.

నాటి నుండి శివుడు అర్ధనారీశ్వరుడయ్యాడు. భార్యకు తనతో సమానస్థాయిని కల్పించిన ఆయన తరతరాలకు ఆదర్శపురుషుడు. ఈ రూపాన్ని శివుడు నిరాకార రూపమైన శివలింగంలో కూడా చూపుతాడు. శివుడు శివలింగరూపమైతే, పానవట్టం పార్వతీ రూపం.




# అర్థం చేసుకునే మనసుండాలి!

- డా॥ నల్లాని రాజేశ్వరి, 99086 02443

పద్మనాభుని నాభిపద్మంనుంచి బ్రహ్మ జన్మించాడు. బ్రహ్మమానసపుత్రుడు మరీచి. మరీచి కొడుకు కశ్యపుడు. అతని సుతుడు సూర్యుడు. త్వష్ట కూతురు సంజ్ఞను సూర్యుడు పత్నిగా పరిగ్రహించాడు. సంజ్ఞ చక్కదనాలచుక్క కానీ ఆ చంద్రముఖి భాస్కరుని తేజస్సును సహించలేక, బాధపడుతూనే ఇద్దరు మగపిల్లలను, ఒక స్త్రీశిశువును కన్నది. మగపిల్లలలో పెద్దవాడు వైవస్వతమనువుగా పేరు పొందినవాడు. రెండవవాడు యముడు. ఆడుబిడ్డ పేరు యమున.

సుకుమారి అయిన సంజ్ఞ ఎంత కాలం గడిచినా భాస్కరతేజస్సును భరించలేక ఒకనాడు ఆత్మశక్తితో ఒక కన్యకను సృష్టించింది. దానికి 'ఛాయ' అని పేరు పెట్టింది. ఆ ఇంతి ముమ్మూర్తులా తనలాగే ఉంది. "అమ్మయ్యా! నా సంకల్పం ఫలించింది" అనుకుని, "ఛాయా! నేను చెప్పినట్టు చెయ్యాలి నువ్వు. నేను పుట్టింటికి పోయి, కొంతకాలం అక్కడ ఉండి, తిరిగి వస్తాను. అంతవరకూ నువ్వు నాకు మారుగా నా కొడుకులను, కూతురినీ నీ పిల్లల లాగా చూచుకుంటూ, లాలిస్తూ పాలిస్తూ ఉండు. అన్నివిధాలా ఆయనను నాలాగే సేవిస్తూ స్వేచ్ఛగా ఉండు. నేను ఇలా చేశానని ఏ సమయంలోనూ బయట పెట్టకు" అని ఇల్లు అప్పచెప్పింది. "అలాగే చేస్తాను. నా జుట్టు పట్టుకుని ఎవరు నువ్వు? అని దండించే పరిస్థితి వచ్చినా, శపించే దశ వచ్చినా ఉన్నది ఉన్నట్టు చెప్తాను. అంతవరకూ చెప్పను" అని మాట ఇచ్చింది ఛాయ. "మంచిది, పోయివస్తాను" అని సంజ్ఞ పుట్టింటికి వెళ్లిపోయింది.

సంజ్ఞకు సవర్ణగా ఉన్న ఛాయను సూర్యుడు సంజ్ఞగానే భావిస్తూ, ప్రవర్తిస్తూండగా, ఆమెకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు పుట్టారు. ఒక కొడుకు పేరు సావర్ణి. అతడే అష్టమ సావర్ణి. రెండవ కొడుకు పేరు శనైశ్చరుడు(శని). కూతురి పేరు భద్ర.

పిల్లల లాలనలో, పాలనలో, భోజన భాజనాదులలో ఛాయ విషమంగా ప్రవర్తిస్తూ వచ్చింది. వైవస్వతమనువు ఆమె హెచ్చుతక్కువలు పట్టించుకోలేదు. కాని చిన్నవాడు యముడు సహించలేక పోయాడు. అది మరి భవిష్యబలమో, బాల్యచాపల్యమో, మమకారమహిమో కోపించి ఒకనాడు ఛాయను తన్నడానికి కాలెత్తాడు. అది చూచి ఛాయ కోపంతో ఓపిక నశించి, కళ్లెర్రజేసి, చురచుర చూచి, పళ్లు పటపటకొరికి "ఏరా నీ దుండగం! నన్ను తన్నబోతావా? ఫలం అను భవించు. నీ పాదం తెగిపడుగాక!" అని శపించింది.

సంజ్ఞాదేవి మనసారా నమ్మి, పిల్లలను తనకు ఇల్లెడ పెట్టిన విషయం మరచిపోయిందా? తన కొడుకులాగా వాడూ పసివాడు. ఏదో చెయ్యబోయాడు. దానికి అంతకోపం తెచ్చు కోవాలా? తాను పిల్లలను కని పెంచినతల్లి కాదా? సవతి కొడుకు తప్పు ఆ పాటి క్షమించరాదా? తన్నడానికి కాలెత్తాడే కానీ తన్నలేదే? అంత తప్పా? దానికి అంత దారుణమైన శిక్షా? కనికరంలేని కఠినాత్మురాలై శపించింది.

యముడు కన్నీళ్లతో కన్నతండ్రి వద్దకు వెళ్లి, జరిగింది చెప్పాడు. అది విని భాస్కరుడు భగ్గుమన్నాడు. క్షణం ఆలోచించాడు. ఛాయను రమ్మన్నాడు. గడగడలాడుతూ వచ్చింది. భానుడు పరీక్షగా చూశాడు. నిప్పులు కురిసే చూపులు సహించ లేక ఛాయ తలదించుకుంది. గర్జిస్తున్నట్టున్నాడు- సూర్యుడు.

"తలెత్తి చూడు. ఏ తప్పు చేసినా కన్నకొడుకును తల్లి ఇలా శపించదు. నిజం చెప్పు. నువ్వు సంజ్ఞవేనా? నిజం చెప్పకపోతే బూడిద చేస్తాను నిన్ను. నా శాపం అలాంటిది. తెలుసునా? చెప్పు నిజం! ఎవరు నువ్వు?"

చెప్పక తప్పనిముప్పు, ఛాయ ఏడుస్తూ తన వృత్తాంతం చెప్పింది. అంతా విన్నాడు. ఆమెవల్ల తప్పు లేదనుకున్నాడు సూర్యుడు. జాలిగా యముణ్ణి చూశాడు. "కుమారా! ఈమె కూడా తల్లి వంటిదే! తల్లి శాపం తప్పదు. విచారించకు. అలా జరగవలసి ఉంది. అంతే! లేకపోతే నువ్వు ఆమెను తన్నడానికి కాలెత్తవచ్చునా? ఊఁ కానీ! పాదమందలి మాంసాన్ని క్రిమి కీటకాలు తొలిచి తినగా, అది నేలమీదపడుతుంది. అంతే"



వారణాసిలోని కాశీవిశ్వనాథుని ఆలయంలో లింగాన్ని జ్ఞానానికి వెలుగుగా, శివస్వరూపంగా భావిస్తారు

అని కొడుకును ఊరడించి సంజ్ఞ సమాచారం తెలుసు కోవడానికి అత్తవారింటికి వెళ్లాడు.

అల్లుడు వస్తాడని ఆ మామకు తెలుసు. "భర్త అనుమతిలేక ఎందుకు వచ్చావు? ఎవరిచ్చిన అధికారమిది? పో" అని ఆనాడు కూతుర్ని అధిక్షేపించగా, అతనితేజస్సు నాకు దుస్సహంగా ఉంది. నేనక్కడ ఉండలేనని ఏదో సాకు చెప్పింది- సంజ్ఞ.

కానీ బాధ్యత ఎరిగిన తండ్రిగా అతడు, తనయింట కూతురు ఉండడానికి ఒప్పుకోలేదు. "ఆహా! ఏమి అస్వతంత్రం!" అని సంజ్ఞ, "నేను తపోవృత్తితో కాలక్షేపం చేస్తాను. ఉత్తర కురుభూములకు పోతాను" అని తండ్రితో చెప్పి, వెళ్లిపోయింది.

త్వష్ట అల్లుణ్ణి నిండువేడుకతో ఆదరించలేక లాంఛనంగా మర్యాద జరిపాడు. "సంజ్ఞ ఎక్కడ?" అని సూర్యుడు కసిగా అడిగాడు. ఉన్నది ఉన్నట్టు త్వష్ట చెప్పి, తేజోహీనమైన చక్రయంత్రంలో సూర్యుణ్ణి కూర్చుండబెట్టి, గిర్రున త్రిప్పి విడిచాడు. సూర్యుడు చక్రంనుంచి బయటకు వచ్చాడు. ఆశ్చర్యం! సగానికి సగం ఆ వేడి తగ్గిపోయింది. "మంచిది, వస్తాను మామా!" అని చెప్పి, తిన్నగా కురుక్షేత్రానికి వెళ్లాడు.



ఆ సమయానికి సంజ్ఞ ఆడుగుర్రంగా మారిపోయి, ఎండుగడ్డి మేస్తూ, బరువుగా అడుగులు వేస్తూ, చెట్లక్రింద తిరుగుతూంది. సూర్యుడు కనిపెట్టాడు. తానుకూడా గుర్రపు రూపు ధరించి, మెల్లమెల్లగా దగ్గరకు వెళ్లాడు. ఆ ప్రాంతం మారుమ్రోగేట్లు సకిలించాడు. మోరకు మోర కలిపాడు. "ఇతడు నా భర్తే అయిఉంటాడు. లేకపోతే సామాన్యులు నా దరి చేరగలరా?" అని ఆమె మనసే సాక్షిగా మోర కలిపింది. ఆ ఉద్రేకంలో గుర్రం ముక్కుపుటాల నుంచి తేజస్సు స్రవించి, ఆడుగుర్రపు ముక్కు పుటాలలోకి జారింది. దానివల్ల ఆమె గర్భవతియై ఇద్దరు బాలసూర్యప్రభా భాసమానులైన కవలపిల్లల్ని కన్నది. వారు సద్యోయౌవనంతో తరుణసూర్యుల్లాగా భాసించారు. సూర్యుడు ఆనందంగా గుర్రపురూపు విడిచి, నిజరూపం ధరించాడు. బడబగా ఉన్న సంజ్ఞాదేవి నిజరూపాన్ని పొంది, పతిపాదాలకు మ్రొక్కి, క్షమించమని వేడుకుంది. 'గతం గతం' అని విచారించవద్దని భానుడు భార్యను చేరదీసుకున్నాడు. ఆమె పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. సూర్యభగవానుడు ఎంత వేడిగా ఉన్నా పరిస్థితుల్ని గ్రహించి పెద్ద మనసుతో ఆలోచించాడు. కొడుకుల్ని చూచి, "మీపేరు నాసత్యులు, ఆశ్వినేయులు, ఆశ్వికులు, దస్రులు, అశ్వినీకుమారులు అని ప్రసిద్ధ లౌతారు. దేవవైద్యులుగా జీవించండి. మీకు అసాధ్యమైన రోగమే ఉండదు" అని వరమిచ్చి పంపించి, సంజ్ఞతో స్వపురానికి చేరుకున్నాడు.

తరువాత శనైశ్చరుడు తండ్రి ఆదేశాను సారంగా కాశీక్షేత్రానికి వెళ్లి, విశ్వేశ్వరునికి దక్షిణంగా, శుక్రేశ్వరునికి ఉత్తరంగా శివలింగం ప్రతిష్ఠించి, పరమభక్తితో సేవించాడు. అతని భక్తికి శివుడు మెచ్చి, ప్రత్యక్షమై గ్రహాలలో విశిష్టగ్రహంగా వరమిచ్చి, ఈ లోకానికి అధిపతిగా మన్నించాడు. ఈ శనైశ్చరుడు కాశిలో స్థాపించిన శనైశ్చరలింగాన్ని సేవించే వారికి ఏలాంటి గ్రహపీడా ఉండదు. దీర్ఘాయువులై, భోగభాగ్యాలు అనుభవిస్తారు. శనైశ్చరలోకం అన్ని గ్రహలోకాలకూ పైన ఉంటుంది.

# చిత్ర కథ తల్లిప్రేమ ముందు తలవంచాల్సిందే కదా!


కథ– 'కళారత్న' డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు– శ్రీ తుంబలి శివాజీ





అందరం కలసి బెజ్జమహాదేవి ఇంటికెళ్దాం. అందరం ఆ పరమశివుణ్ణి స్తుతిస్తూ, ఆయన మళ్లీ మామూలు స్థితికి వచ్చేవరకు నిరాహారంగా, నిర్విరామంగా పంచాక్షరీ జపిస్తూ కూర్చుందాం!
మన వంతు ప్రయత్నం కూడా మనం చేద్దాం! అందరం శుచియై ఇష్టలింగ పూజ చేసుకుని ఇక్కడ నుండే ఆ పరమశివుణ్ణి స్తుతిస్తూ, భజిస్తూ, కీర్తిస్తూ వెళదాం!
బెజ్జ మహాదేవి గారు ఆ పనే చేస్తున్నారు కదా! ఆమె ఇప్పుడేనా? ఏ పని చేస్తున్నా పంచాక్షరినే జపిస్తూ ఉంటారు. నిద్రలో కూడా పంచాక్షరిని మరువరు. ఆమె శివ ప్రసాది. కనుక నిరంతరం శివ ధ్యానంలోనే ఉంటుంది.
అందరూ ఓం నమ:శివాయ ఓం నమ: శివాయ... అని పాడుకుంటూ బెజ్జమహాదేవి ఇల్లు చేరుకున్నారు.
నాయనా! నేనిక ఈ బాధ భరించలేను. బాలుడా! నీ మీద ప్రాణాలు విడుస్తాను.
అమ్మా! బెజ్జమహాదేవీ! నీకేమి వరం కావాలో కోరుకో!
పరమశివా! నీవు అనారోగ్యం లేకుండా ఆరోగ్యంగా ఉంటే అంతే చాలు!
భక్తురాలా! మీ వంటి వారి నిర్మల మనస్సులు నైవేద్యాలవుతుంటే మాకు అనారోగ్యమెలా కలుగుతుంది? ప్రతి తల్లి తన బిడ్డల్ని దేవతా స్వరూపాలుగా భావించి ఉపచారాలు చేస్తూ, క్రమశిక్షణాపరులుగా తీర్చిదిద్దితే అందరూ బాగుంటారు. మిగతా భక్తులందరూ ఏదో ఒక విధంగా నా నుండి ఏదేదో కోరిన వారే. ఏ కోరికా లేకుండా బెజ్జమహాదేవి మాకు తల్లియై మమ్మల్ని లాలించింది. మా తల్లికి ఈ క్షణం నుంచే మా కైలాసంలో స్థానం సిద్ధపరచబడి ఉంటుంది.
ఈమె వలన మీరు, మీ కుటుంబం తరించింది. మీరందరూ క్రమేణా మీ కర్మ పరిపాకం చెందాక కైలాసం చేరుతారు. ఈమె మాతృప్రేమకు మేము మరొకసారి ప్రణమిల్లుతున్నాం!
ధన్యులం! పరమశివా! ధన్యులం!
2

## విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



# అప్పు చేయరాదు

**పరుల మోసపుచ్చి, పరధన మార్జించి,**
**కడుపు నింపుకొనుట కానిపద్దు;**
**ఋణము సేయు మనుజు డెక్కువ కెక్కునా?**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**అర్థాలు:** పరధనం= ఇతరులసంపద; ఆర్జించి= సంపాదించి; ఋణం= అప్పు; మనుజుడు= మనిషి.

**భావం:** ఇతరుల్ని మోసంజేసి, ఇతరుల ధనం సంపాదించి, కడుపు నింపుకోడం తగనిపని. అప్పు చేసి జీవించేవాడు గొప్పవాడుగాడు.

**వివరణ:** లోకంలో కొందరు తాము బ్రతకడానికి ఇతరులను మోసం చేస్తుంటారు. ఇతరులకు చేరవలసిన సంపదను తాము సొంతం చేసుకుంటారు. మోసాలతో ఇతరుల ధనంతో సుఖపడేవాడిబ్రతుకు నీచమైంది. కొందరు అప్పు చేసి పప్పుకూడు తింటూంటారు. ఆ అప్పు తీర్చడంకోసం మరొకచోట అప్పు చేయవలసివస్తుంది. లేదా అప్పులు తీర్చకపోతే అపఖ్యాతి పాలు కావలసివస్తుంది. పదిమందిలో పరువు పోగొట్టుకోవడంకంటె ఉన్నదానితో తృప్తిగా జీవించడం నేర్చుకోవడం ఉత్తమం. తాత్కాలికసుఖాల కోసం మోసాలు, అప్పులు చేసి, కుటుంబం భవిష్యత్తు నాశనం చేసుకోగూడదు.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

## గ్రంథసమీక్ష

# యోగక్షేమం వహామ్యహం

**రచయిత–** ఆర్.సి.కృష్ణస్వామి రాజు; **సైజు–** 1/8 డెమ్మీ; **పుటలు–**112; **ధర–**రూ.160/–; **ప్రతులకు–** ఆర్.సి.కృష్ణస్వామి రాజు, 22-4-71, బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ, మంగళం రోడ్, తిరుపతి 517507. సెల్–93936 62821.

మంచి నడవడిక, సత్ప్రవర్తన, సహనం, సత్సంగం... మనిషి సక్రమమార్గంలో పయనించడానికి మార్గాలు. మనలోకి మనం తొంగిచూసుకొని జీవితాన్ని ఆనందకరం చేసుకోవడానికి ఉపయోగపడే చక్కని పుస్తకం "యోగక్షేమం వహామ్యహం". ఇందులోని బొమ్మలతో కూడిన యాభై రెండు చిన్నచిన్న కథలు చదువరులను ఇట్టే ఆకట్టుకుంటాయి.

మానవనైజాన్ని "ఎవరు అదృష్టవంతులు" కథలో చూస్తాం. "మాట మంచిదైతే!" కథలో మనకు నలుగురు కావాలంటే నోటిమాట ఎంతో మంచిగా ఉండాలంటూ హితవు చెబుతారు. అత్యాశని విడనాడే కథ "ఎంత చెట్టుకంత గాలి". "కొత్త ఊరు" కథలో సహజంగా మనుషుల్లో ఉండే చిన్న చిన్న పొరపాట్లను పక్కన పెట్టి సర్దుకుపోవాలంటారు. భగవంతుడు మనకు ఇవ్వదలిస్తే దండిగానే ఇస్తాడు. 'అతనికి తెలిసినట్లుగా మరెవ్వరికీ తెలియదు' అని "గుగ్గిళ్ళ రహస్యం" కథ ద్వారా తెలియపరుస్తారు. ఏ సమస్యా కలకాలం ఉండదు. కాలానికి ఎంత పెద్ద గాయాన్నైనా మాన్పే శక్తి ఉంటుందని తెలియజేసే కథ "గుమ్మడి కూర".




జీవితంలో ఆశావహ దృక్పథాన్ని పెంపొందింపజేస్తూ, ఉత్తమ మార్గంలో ఆనందకరమైన జీవితం గడపడానికి చక్కటి దిశానిర్దేశం చేసే "యోగక్షేమం వహామ్యహం" లాంటి ఆధ్యాత్మిక కథలు ఉపయోగపడతాయి.

– శ్రీమతి లేదాళ్ళ జయ,
87901 82908

# క్విజ్ 43

01) సంసారభయం లేనిదెవరికి? జ)........................................

02) సమస్త భూత జాతిని సమానంగా చూసేవాడు? జ)........................................

03) నందనారుకు ముక్తినిచ్చింది? జ)........................................

04) శ్రీమహావిష్ణువు కౌస్తుభాంశలో జన్మించిన వారు? జ)........................................

05) నాలుగువేల పాశురాలను ఏమంటారు? జ)........................................

06) అలంకారప్రియుడు ఎవరు? జ)........................................

07) సాధకుడి మనస్సు? జ)........................................

08) గోవిందరాజ ఉత్సవాల నిర్వహణకు సంకల్పించినవారు? జ)........................................

09) పార్వతీదేవి సింహవాహనం పేరు? జ)........................................

10) నాన్ముగన్ తిరువన్దాది అనుగ్రహించిన వారు? జ)........................................

11) కేతకపుష్పమని దేన్ని అంటారు? జ)........................................

12) శ్రీవత్సాంకమిత్రులని ఎవరిని అంటారు? జ)........................................

13) వరదరాజస్తవం ఎవరి రచన? జ)........................................

14) యమధర్మరాజు ఎవరి సంతానం? జ)........................................

15) గొప్ప ఐశ్వర్యం అని దేనికి పేరు? జ)........................................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-02-2026.**

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: ........................ వయస్సు: ..........

పాఠశాల: ........................ తరగతి: ..........

పేరు: ........................................

చిరునామా: ........................................

........................................

........................................

........................ పిన్‌కోడ్: ..........

ఫోన్ సంఖ్య: ........................................

### జవాబులు చేరాల్సిన చిరునామా

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

# పిల్లలూ ఈ భక్తవశంకరుడి గురించి తెలుసా?

## కాలరూపుడు... భైరవుడు!

కాలభైరవుడికి మన పురాణాల్లో చాలా విశిష్టత ఉంది. కాలాన్ని జయించడం సాధ్యం కాకున్నా దాన్ని అనుకూలంగా మార్చుకోవచ్చు. గ్రహబలాలని అధిగమించి అదృష్ట జీవితాన్ని, సంకల్పసిద్ధిని పొందడం భైరవుడి ఉపాసనతో సాధ్యమని శాస్త్రాలు చెబుతున్నాయి.



కాలభైరవుడిని కాశీక్షేత్ర పాలకుడిగా కీర్తించారు. ఏది సాధించాలన్నా ముందుగా ఆయన అనుమతి తీసుకోవాలని 'కాశీక్షేత్ర మహిమ' చెబుతోంది. సాక్షాత్తూ శివుడే కాలభైరవుడై సంచరించాడని శాస్త్రాలు చెబుతున్నాయి. హోమకార్యాలలో అష్టభైరవులకు ఆహుతులు వేసిన తర్వాతే ప్రధాన హోమం చేస్తారు. భక్తులకు అనుగ్రహాన్ని, అతీంద్రియమైన శక్తులని ఆయన ప్రసాదిస్తాడు.



దేవాలయాలలో ఆయనకి గారెలతో మాలవేస్తారు. కొబ్బరి బెల్లం నైవేద్యం పెడతారు. ఈశ్వరుడు ఆయుఃకారకుడు. ఆయనకు పరమవిధేయుడైన కాలభైరవుడిని ఆరాధిస్తే ఆయుష్షు పెరుగుతుందని ప్రతీతి.

## శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదా?

ఈ సామెత ఓ నమ్మకం నుంచి పుట్టింది. శివుడు కేవలం లయకారుడు మాత్రమేననేది చాలామంది నమ్మకం. కానీ అది నిజం కాదు. ఆయన కేవలం నాశనం చేసేవాడు మాత్రమే కాదు.

ఈ సృష్టిలోని సమస్త చరాచర ప్రాణికోటికీ ఆయనే నాథుడు. ఆయన ఆజ్ఞ లేనిదే ఏ పనీ జరగదు. ఈ విషయం నుంచే పై మాట పుట్టింది. అదే మెల్లగా సామెతలా మారింది. ఏదైనా గొప్ప పని చేసినప్పుడు అదంతా తమకు తాముగా సాధించామని కొందరు గొప్పలు పోతుంటారు. అలాగే మరికొందరు, ఏదైనా అనుకోనిది జరిగితే ఎలా జరిగిందని విస్తు పోతూ ఉంటారు. ఇలాంటి సందర్భాల్లో అంతా దేవుడి వల్లే జరిగింది అని చెప్పడానికి ఈ సామెతను వాడతారు.



## రంగులేద్దాం!



పై చిత్రాన్ని చూసి రంగులు వేయండి

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** మంచి యోచన, ముందుచూపు, యుక్తితో వ్యవహరించటం, రాజకీయ వ్యవహారాలలో మెరుగైన పాత్ర పోషిస్తారు. అధికారం వస్తుంది. వ్యాపారస్తులకు అధికలాభాలు కల్గుతాయి.



**వృషభం–** వృత్తిపరంగా ముందంజ వేస్తారు. రాజకీయపలుకుబడి ఉపయోగించి పనులు సకాలంలో పూర్తిచేసుకోగల్గుతారు. నేత్రసంబంధ వైద్యచికిత్సలు అవసరమౌతాయి.



**మిథునం–** అన్ని సమస్యలను అధిగమించే దృఢత్వం కల్గుతుంది. శారీరకంగా మరియు మానసికంగా దృఢంగా చేస్తుంది. కల్యాణాది శుభ యోగాలు సంప్రాప్తిస్తాయి. ఆదాయమార్గాలు పెరిగి జీవనం సుఖమయమౌతుంది.



**కర్కాటకం–**శుభకార్యాల్లో పాలుపంచుకుంటారు. విద్యార్థులు అధ్యయనవిషయాల్లో రాణిస్తారు. కొత్తవిషయాలు నేర్చుకునేందుకు సుముఖత చూపిస్తారు. ఉదరసంబంధ అనారోగ్యం కలిగే అవకాశముంది.



**సింహం–** కుటుంబసభ్యులతో అనగా ముఖ్యంగా తల్లి సోదరవర్గం వారితో మంచి సంబంధాలు కలిగి ఉంటారు. కష్టాల్లో ఉన్న ఇతరులకు సహాయకారిగా వ్యక్తిత్వాన్ని పెంచుకుంటారు. పోటీపరీక్షలలో ఉద్యోగవిజయం పొందుతారు.



**కన్య–** విద్యార్థినీ విద్యార్థులకు వృత్తిపరంగా అవకాశాలు మెరుగవుతాయి. సుసంపన్నమైన, సురక్షితమైన జీవితాన్ని ఆస్వాదించటానికి రంగం సిద్ధమౌతుంది. మంచివిద్య, సంపద పొందుతారు. అన్ని విధాల అనుకూలం.



**తుల–** విద్యావిషయాల్లో శ్రద్ధవహిస్తారు. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇంట శుభకార్య నిర్వహణ అవుతుంది. వృత్తి, వ్యాపారాల్లో ఆర్థిక వికాసం కల్గుతుంది.



**వృశ్చికం–** ఈ మాసంలో సంపద, భౌతిక ఆనందాలు, సౌకర్యాలు పెరుగుతాయి. ప్రయత్నాలకు తగిన విజయాన్ని పొందుతారు. ఆర్థికస్థితి కూడా మెరుగుపడుతుంది.



**ధనుస్సు–** గణితం, సామాన్యశాస్త్రాలకంటే సాంఘిక శాస్త్రాలు, కళలవైపు ఎక్కువగా మొగ్గ చూపుతారు. ఆచరణాత్మక అంశాలకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. న్యాయవాదవృత్తి వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది.



**మకరం–** సన్నిహితులతో అపోహలు కలగడానికి అవకాశం ఉంది. అహంకారం వదలి సహనంగా ఉండటం మంచిది. ఆలస్యమైనా కార్యసాధన చేస్తారు. సోదరవర్గంతో అపోహలు రాకుండా చూచుకోవడం మంచిది.



**కుంభం–** వృత్తి ఉద్యోగాలలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. వ్యాపారాలు అంతంత మాత్రంగా ఉంటాయి. శాంతిసామరస్యాల్ని కాపాడేందుకు వివాదాలకు దూరంగా ఉండాలి. అస్థిరత్వం, అభద్రతా భావాలకు లోనవుతారు.



**మీనం–** పట్టిందల్లా బంగారమౌతుంది. మూడు పువ్వులు ఆరుకాయలు చందంగా అన్నీ అనుకూలమౌతాయి. వ్యవహారజయం పొందుతారు. ఆరోగ్యం వికసిస్తుంది.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

........................................ తేది :..................

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# శ్రీపదకేళి

121



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)మాఘమాసంలో తిరుపతిలో బ్రహ్మోత్సవాలు జరిగే స్వామి(7); 7)సుఖం(2); 8)మన్మథుడు(3); 9)గంగా నది ఒడ్డున గల శైవక్షేత్రం(2); 12)సప్తర్షులలో ఒకరు(4); 13)అర్చన(2); 15)అనసూయ భర్త అటునుంచి(2); 16)సూర్యోదయాన్ని ఆపిన సాధ్వి(3); 17)చదరంగంలో కదిపేది(2); 20)మందపాలుని భార్య(3); 21)చిగురు(5)

**నిలువు** 2)తండ్రి(2); 3)మామ(4); 4)అగ్నిభార్య(2); 5)మాఘబహుళచతుర్దశిన జరిగే పండుగ(6); 6)మాఘ, ఫాల్గుణమాసాలు ఏ ఋతువు(6); 10)వీటిని మాట్లాడరాదు(3); 11)మాఘబహుళ ఏకాదశి(3); 14)ఫాల్గుణ శుద్ధ ఏకాదశి(4); 18)తీగ(2); 19)స్వప్నం(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., and Published by Dr.V.G.Chokkalingam, M.A., Ph.D. on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



# తిరుపతి
# శ్రీకపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం

2026, ఫిబ్రవరి 07 నుండి 17 వరకు

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 07-02-2026 | శని | -- | మూషికవాహనంపై వినాయకస్వామి, అంకురార్పణం |
| 08-02-2026 | ఆది | (పల్లకీఉత్సవం) ధ్వజారోహణం | హంస వాహనం |
| 09-02-2026 | సోమ | సూర్యప్రభ వాహనం | చంద్రప్రభ వాహనం |
| 10-02-2026 | మంగళ | భూత వాహనం | సింహ వాహనం |
| 11-02-2026 | బుధ | మకర వాహనం | శేష వాహనం |
| 12-02-2026 | గురు | తిరుచ్చి ఉత్సవం | అధికార నంది వాహనం |
| 13-02-2026 | శుక్ర | వ్యాఘ్ర వాహనం | గజ వాహనం |
| 14-02-2026 | శని | కల్పవృక్ష వాహనం | అశ్వ వాహనం |
| 15-02-2026 | ఆది | రథోత్సవం | నంది వాహనం (మహాశివరాత్రి) |
| 16-02-2026 | సోమ | పురుషామృగ వాహనం | కల్యాణోత్సవం, తిరుచ్చి ఉత్సవం |
| 17-02-2026 | మంగళ | సూర్యప్రభ వాహనంలో నటరాజస్వామి త్రిశూలస్నానం | ధ్వజావరోహణం, రావణాసుర వాహనం |



# తరిగొండ
# శ్రీలక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవం

2026, ఫిబ్రవరి 23 నుండి మార్చి 04 వరకు



| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 23-02-2026 | సోమ | --- | అంకురార్పణం |
| 24-02-2026 | మంగళ | ధ్వజారోహణం | --- |
| 28-02-2026 | శని | --- | గరుడ వాహనం |
| 03-03-2026 | మంగళ | రథోత్సవం, ముత్యపుపందిరివాహనం | --- |
| 04-03-2026 | బుధ | తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం | ధ్వజావరోహణం |

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY
Published by Tirumala Tirupati Devasthanams Printing on 25-01-2026 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 “LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026” Posting on 1st of Every Month.




భవజలధిగతానాం ద్వంద్వ వాతాహతానాం
సుత దుహితృ కళత్రత్రాణ భారార్దితానాం
విషమ విషయతోయే మజ్జతా మప్లవానాం
భవతి శరణమేకో విష్ణుపోతో నరాణాం

- శ్రీకులశేఖరులు